ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్




# యుగశక్తి  గాయత్రి




ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ | సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదక మండలి
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్

సంపుటి 18 - సంచిక 01
**జూన్ 2013**

పత్రిక అందనివారు మరియు పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు ఈ క్రింది ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
**040-23700722**
**99491 11175**
**94407 69798**


## నవయుగానికి అధిదేవత గాయత్రి

**'సయత్ కృత్స్నాం గాయత్రీ మన్వాహ తత్ కృత్స్నం ప్రాణం దధాతి' - (శతపథ బ్రాహ్మణం)** అనగా సమిష్టిగతం, వ్యక్తిగతం అయిన జగత్తులో వ్యవస్థను ఏర్పరచేది, సమన్వయాన్ని నిర్మాణం చేసేది గాయత్రి. ఈ ఋషివాక్కు విశ్వమంతటా అక్షరాల అమలు జరిగే తరుణం ఆసన్నం అవుతున్నది. వాస్తవానికి నవ సమాజ నిర్మాణానికి, వికాసానికి అత్యావశ్యకములైన సద్గుణాలను, సత్ ప్రవృత్తులను, మంచి విధానాలను సూత్రబద్ధం చేస్తే ఆ దివ్య సూత్రమే మూడు చరణముల గాయత్రీ మహామంత్రం. సమస్త మానవాళికి ఆధ్యాత్మిక మూలాధారాన్ని ప్రసాదించే మహత్తర తత్వాలన్నీ ఆ మంత్రంలో ఇమిడి ఉన్నాయి.

నేడు అవివేకం అనే మహా రాక్షసుడు మానవ జీవనంలోని ప్రతి రంగాన్ని ఏలుతున్నాడు. ఫలితంగా మానవజాతి అనైతికం అయిపోతున్నది. అనాగరికం అయిపోతున్నది. భ్రష్టం అయిపోతున్నది. మనిషి ఆలోచనలలో వివేకాన్ని ప్రతిష్ఠిస్తే తప్ప మానవాళికి పురోగమనం గగన కుసుమమే అవుతుంది. గాయత్రీ ఉపాసన అంటే సద్గుణాల ఉపాసన, సత్ జ్ఞాన ఉపాసన. ప్రతి జీవన రంగాన్ని ఆరోగ్యప్రదంగా, సమర్థవంతంగా, వివేకవంతంగా తీర్చిదిద్దే వెలుగుల వెల్లువను ఉపాసకుని అంతఃకరణలో ఉప్పొంగజేసే దివ్యమంత్రం గాయత్రి.

కనుకనే మన మహర్షులు, మహా మనీషులు గాయత్రీ మంత్రాన్ని ఏకగ్రీవంగా ప్రస్తుతించారు. అవతార పురుషులందరు భగవతి గాయత్రిని ఇష్టదేవిగా కొలిచారు. ఈ విధంగా ప్రాచీనకాలం నుండి భారతీయ సంస్కృతికి ఊపిరిగా విలసిల్లింది గాయత్రి. వేదమాతగా, దేవమాతగా, విశ్వమాతగా లోకోత్తర భూమికను నిర్వహించింది గాయత్రి. ఈ బీజమంత్రం నవయుగంలో విశ్వసంస్కృతికి మూలాధారం అవుతుంది. నవయుగానికి కల్పవృక్షం అవుతుంది. ఈ మంత్రంలో అంతర్గతంగా ఉన్న జ్ఞాన విజ్ఞానాల ఆధారంగా వ్యక్తిలో ఉత్కృష్టత, సమాజంలో సువ్యవస్థ తిరిగి స్థాపించబడతాయి. నవయుగంలో విశ్వమంతా సమత, మమత, శుచితల త్రివేణిలో స్నానం చేసి పునీతం కావలసి ఉన్నది. ఆత్మవత్ సర్వభూతేషు, వసుధైక కుటుంబకం అనే సార్వజనీన, సార్వకాలిక సూత్రాలను మానవాళి తన దైనందిన జీవితంలో ప్రతిబింబించవలసి ఉన్నది. ఇందుకు కావలసిన సిద్ధాంతపరం, వ్యవహారపరం అయిన సత్యాలన్నీ గాయత్రీ మహామంత్రంలో బీజరూపంలో ఉన్నాయి.

అందువల్ల కృతయుగ అవతరణకు దారిచూపే దివ్యజ్యోతి గాయత్రి, యుగశక్తి గాయత్రి. మహాకాలుని తిరుగులేని సంకల్పం ఇది.

**సొంత లాభం కొంచెం తగ్గించుకుని అయినా ఇతరులకు మేలు చేయాలి**

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | **సంపాదకీయం :** నవయుగానికి అధిదేవత గాయత్రి | 1 |
| 2. | **విషయసూచిక-సద్గురు వచనామృతం :** దృష్టికోణాన్ని శ్రేష్ఠంగా ఉంచుకో | 2 |
| 3. | **వేదమంత్రం :** కలసిమెలసి ఉండాలి | 3 |
| 4. | **గాయత్రీ విద్య - 33 :** స్వర యోగం-3 | 4 |
| 5. | **గాయత్రీ చిత్రావళి - 12 :** బంధనము నుండి విముక్తి | 6 |
| 6. | **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 12 :** మొలకెత్తుతున్న విత్తనాలు-2 | 7 |
| 7. | **మస్తిష్కమే కల్పవృక్షం - 8 :** అలౌకిక కళాకారుని అద్భుత రచన-8 | 11 |
| 8. | **గాయత్రీ జయంతి ప్రత్యేకం :** గాయత్రీ పంచముఖి - ఏకముఖి | 14 |
| 9. | **గాయత్రీ జయంతి ప్రత్యేకం :** తారక మంత్రం - గాయత్రీ మంత్రం | 18 |
| 10. | **కఠోపనిషత్తు-5 :** ప్రథమ అధ్యాయం-ప్రథమ వల్లీ | 20 |
| 11. | **జీవజగత్తు :** చిన్న శరీరంలో దాగి ఉన్న అనన్య గుణ సంపద | 24 |
| 12. | **సంకల్పశక్తి - దాని అద్భుత పరిణామాలు:** మైఖేల్ ఫేరడే - పుస్తకాలను బైండింగ్ చేయుపని నుండి పైకి ఎదిగిన మహావిజ్ఞాని | 27 |
| 13. | **ఆదిశక్తి యొక్క లీలా కథలు - 36 :** సాధకునిలో అంతర్వివేకం ఎప్పుడు జాగృతం కాగలదు? | 29 |
| 14. | **మెస్మరిజం-1:** మెస్మరిజం అంటే ఏమిటి? మెస్మరిజం మరియు యోగం | 32 |
| 15. | **జీవన వికాసం:** మృత్యువు-చేతనత్వము యొక్క ఉచ్చతమ వికాసమునకు ప్రవేశద్వారం | 35 |
| 16. | **పూజ్య గురుదేవుల అమృతవాణి :** ఆధ్యాత్మికత యొక్క సరియైన రూపమును తిరిగి జాగృతం చేయాలి-3 | 38 |
| 17. | **నా వారితో నా మాట :** నిందించకండి - ప్రోత్సహించండి | 42 |
| 18. | **శాంతికుంజ్‌లో జరిగిన సంజీవని సాధనా శిబిరంపై ఒక సమీక్ష** | 44 |




# సద్గురు వచనామృతం

## దృష్టి కోణాన్ని శ్రేష్ఠంగా ఉంచుకోండి

మీరు బాధాకరమైన పరిస్థితులలో, చెడు వాతావరణంలో చిక్కుకు పోయిఉంటే నిరాశ చెందవద్దు; మీ అదృష్టాన్ని నిందించవద్దు. ఈ పరిస్థితికి ఇతరులను నిందించవద్దు. మీ దృష్టికోణాన్ని మార్చుకోండి. అంతే చెడుకు కారణం మీలోనే ఉన్నది. దానిని అర్థం చేసుకోండి. ఆనందంగా ఘటనాస్థలం వద్ద ఘటనను ముందుకు రానివ్వండి. ఈ ఘటన మీరు స్వయంగా నిర్మించు కున్నదే, దానిని మీరు త్వరలోనే దూరం చేయగలరు. మీరు మీ దృష్టికోణాన్ని మార్చుకుంటే, ఎల్లప్పుడు ఉత్తమ ఆలోచనలలో లీనమై ఉంటే, మీ ఆంతరిక స్థితిని సంస్కరించుకోవాలనే ధృఢ సంకల్పం చేసుకుంటే మీరు కోరుకునే బాహ్య జీవితం కూడా సంస్కరించబడుతుంది.

క్రోధం, చింత, ఈర్ష్య, లోభం మొదలైన అనుచిత మానసిక దోషాలకు గురిఅవుతూ ఉన్నతమైన ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆశిస్తే అది అసాధ్యమే. జీవితాన్ని సుఖమయం సమున్నతం చేసుకోవాలని నిజంగా కోరుకుంటే క్రోధం, చింత, ఈర్ష్య మొదలైన చెడు ఆలోచనలను తొలగించుకోవడానికి ప్రయత్నించాలి.

అంతఃకరణలో ఉన్నతమైన ఆలోచనలను నింపుకోవాలి. సుఖమయజీవితాన్ని ఆశిస్తూ నిరంతరంగా ముందడుగు వేయండి, ఆశాజనకమైన పరిస్థితులను మీరు చూస్తారు. మీ జీవితాన్ని భారంగా మార్చిన బాధాకరమైన పరిస్థితులు తగ్గుముఖం పట్టడం జరుగుతుంది.

*అఖండజ్యోతి, మార్చి, 1951*
*అనువాదం: సత్యనారాయణ గుప్తా*

## పండుగలు

**జూన్ 2013**

19-06-2013 గాయత్రీ జయంతి

23-06-2013 కబీర్‌దాస్ జయంతి

**జులై 2013**

22-07-2013 గురు పౌర్ణమి

**ప్రేరణ కరువయితే బ్రతుకంతా చీకటే**

వేద మంత్రం

# కలసిమెలసి ఉండాలి

**సమానీ వ ఆకూతిః సమానా హృదయాని వః ।**
**సమాన మస్తు వో మనో యథావః సుసహాపతి ।**
**(ఋగ్వేద 10/191/4)**

**భావార్థం :** మన హృదయములు, మనస్సులు, సంకల్పములు ఒక్కటి అగు గాక, దానితో మన సంఘం ఎప్పటికీ చెడకుండు గాక.

**సందేశం :** కలసి ఉండుట, సహకారము, మైత్రి ఆరోగ్యవంతమైన సమాజమునకు ఆవశ్యక అంగములు. సమాజములో అన్ని రకాల వారు ఉంటారు. మూర్ఖులు, విద్వాంసులు, రోగులు, ఆరోగ్య వంతులు, నాస్తికులు, ఆస్తికులు, భోగులు, త్యాగులు మొదలైన పరస్పర విరుద్ధమైన వ్యక్తులు నలువైపులా కనిపిస్తూ ఉంటారు. ప్రతి ఒక్క వ్యక్తి యొక్క దృష్టికోణము, అభిప్రాయాలు, అనుభవం, అభ్యాసం, జ్ఞానం, స్వార్థం, రుచి, సంస్కారాలు, వేరువేరుగా ఉంటాయి. అందరి ఆలోచన ఒకే విధంగా ఉండదు. ఒక వ్యక్తి మరొక వ్యక్తిపట్ల ఉదారత, ఓర్పు కలిగి ఉండుట తప్పనిసరి. కొద్దిపాటి అభిప్రాయభేదం కలిగి ఉన్నవారిని మూర్ఖుడు, అజ్ఞాని, మొండివాడు, దుష్టుడు, విరోధి అని అనుకోవటం సరికాదు. ఓర్పు సంఘమునకు ప్రాణం. దీని ఆధారముతోనే సమాజంలో అందరి హృదయాలు, మనస్సులు, సంకల్పాలు ఒకే దిశలో నడుస్తాయి, అన్ని రంగాలలో ఉన్నతి కలుగుతుంది.

ఓర్పు లేకపోవడం వలన సమాజంలో మోసం, విశ్వాస ఘాతుకం, క్రోధం, ద్వేషం మొదలైన చెడుగుణాలు తలెత్తుతాయి. అరాచకం వస్తుంది. నలువైపులా దాదాగిరి, గుండాగిరి, మోసం, దగాల భయం సమాజంలో నెలకొంటుంది. జన జీవితం అసురక్షితం, అశాంతమవుతుంది. నేడు అంతటా ఇదే కనిపిస్తున్నది.

కలిసి ఉండుట అనే అత్యంత సుందర ఆదర్శం మనకు భగవంతుడైన శివుని జీవితంలో దొరుకుతుంది. గుడ్డివాళ్ళు, కుంటివాళ్ళు, కుష్టువాళ్ళు, రోగులు అందరిని ఒకేవిధంగా భావించి తన వెంబడి ఉంచుకోగలిగిన సామర్థ్యం ఆయనకే ఉన్నది. సర్పంతో సమానంగా ఇతరులను కాటువేసి బాధపెట్టే వారిని కూడా తన వశంలో ఉంచుకొన్నాడు. తన మెడలో హారంగా కూడా ధరించాడు. ఈ విధంగా విభిన్న, విపరీత స్వభావం కలిగిన వ్యక్తులను ఒకే సూత్రంలో కలిపి, సమాజానికి ఉపయోగపడేటట్లు చేసే సంకల్పాన్ని ఆయన చరితార్థం చేశాడు. ఆడంబరాలు ఏమి ఉండవు, భస్మం రాసుకున్నాడు. తన అవసరాలు కనీస స్థాయికి తగ్గించుకున్నాడు, అందరి క్షేమం కోసం విషం త్రాగాడు. సమాజం లోని అన్ని వర్గాలలో సహకారము, ఓర్పును ప్రతిష్ఠించాడు.

ఇతరుల అభిప్రాయాలను గౌరవించుట, మంచి మాటలను స్వీకరించుట, తప్పుడు విషయాలు తిరస్కరించుట సమాజము లేదా కుటుంబ సర్వతోముఖ ప్రగతికి అవసరము. పరస్పర గౌరవము ఓర్పుతోనే కలసిమెలసి ఉండగలరు.

దొంగలు, బందిపోట్లు, మోసగాళ్ళు తమ సంఘటన (ఆర్గనైజేషన్) ఎంత సుదృఢంగా ఉంచుకుంటారో మనం చూస్తూనే ఉన్నాము. నాయకుడు ఏది చెబితే దానిని అందరు అనుసరిస్తారు. వారికి నాయకుడి భయం ఉంటుంది. సహకరించకపోతే నాయకుడు చంపేస్తాడు. కానీ మనం మన నాయకుడిని పూర్తిగా మరచిపోయాము. మన నాయకుడు సర్వశక్తివంతుడైన పరమేశ్వరుడు. ఆయన దండిస్తాడు, దండించగలడు కూడా. ఈ తథ్యం మరచిపోవుట వలననే ప్రపంచంలో అన్ని చెడులు మొలకెత్తుతున్నాయి, పెచ్చు మీరుతున్నాయి.

మన విద్వాంసులు, తెలివిగలవారిలో బ్రాహ్మణత్వపు కొరత వలననే ఈ పరిస్థితి తలెత్తింది.

★★★

## అభినందనలు

*వరంగల్లు వాస్తవ్యులు శ్రీ శివకుమార్‌గారు జ్ఞానయజ్ఞ రూపంలో యుగశక్తి గాయత్రి మాసపత్రికను వరంగల్లు జిల్లాలోని 100 సంస్థలకు ఉచితముగా 2013 మే నుండి 2014 ఏప్రిల్ వరకు ఒక సంవత్సరము పాటు అంద జేయుటకు ధనసహాయం అందించిరి. వారి ఈ ప్రేరణాత్మక చర్యను గాయత్రీ చేతనా కేంద్రము మనసారా అభినందించు చున్నది. పూజ్య గురుదేవులు, వందనీయ మాతాజీల ఆశీస్సులు వారికి, వారి కుటుంబానికి ఎల్లవేళలా లభించుగాక!*

**- గాయత్రీ చేతనా కేంద్రం, హైదరాబాద్**

మన పగ, ప్రతీకారం మనకే హాని చేస్తాయి



గాయత్రీ విద్య-33

# స్వరయోగం-3

*(గత సంచిక తరువాయి...)*

## స్వర సంయమంతో దీర్ఘ జీవనం

బయటకు వెలువడే శ్వాస సుమారు 12 అంగుళములు ఉంటుంది. దీనిని ఈ విధంగా పరీక్షించవచ్చు. ఒక చిన్న కర్ర పుల్ల చివర బాగా ఏకిన పత్తి ఉంచి, దానిని నాశికల నుంచి 12 అంగుళముల దూరం ఉంచి, శ్వాస వదలాలి. పత్తి యొక్క దూదిపింజలు కదిలితే శ్వాస 12 అంగళముల దూరం వరకు వెళ్తుందని తెలుస్తుంది. శ్వాస యొక్క పొడుగు ఎక్కువయినా, తక్కువయినా, కర్రకు కట్టిన దూది పింజల ద్వారా తెలుసు కోవచ్చు. శ్వాస పొడుగు ఎక్కువగా ఉండటం హానికరం. తక్కువ పొడవు గల శ్వాస లాభదాయకం. భోజనం చేసేటప్పుడు శ్వాస 20 అంగుళములు ఉంటుంది. నిద్రపోయే సమయంలో శ్వాస 30 అంగుళములు కావచ్చు. అందువలన 6-7 గంటల కన్నా అధికంగా నిద్రించడం మంచిది కాదు. రోగులలో శ్వాస పొడుగు పెరుగుతుంది. క్షయ రోగులలో సుమారు 70 అంగుళముల వరకు శ్వాస వెళ్తుంది. వారికి మృత్యువు చేరువలో ఉందని అర్థం చేసుకోవాలి.

**ప్రతి ప్రాణి పూర్ణాయువు ప్రాప్తించుకొనుట అనేది దాని శ్వాసక్రియపై ఆధారపడి ఉంటుంది. పూర్వ కర్మానుసారం జీవించుట కొరకు పరమాత్మ ఒక నియమిత సంఖ్యలో శ్వాసలు ప్రదానం చేస్తాడు. ఈ ఖజానాను ఏ ప్రాణి ఎంత తెలివిగా ఖర్చు చేస్తుందో అంత ఎక్కువ కాలం వరకు జీవించి ఉంటుంది,** ఏ ప్రాణి ఈ ఖజానాను వృథా చేసుకుంటుందో అంత త్వరగా దాని మృత్యువు సంభవిస్తుంది. సామాన్యంగా ప్రతి మనిషి పగలు రాత్రి 21,600 సార్లు శ్వాస తీసుకుంటాడు. అంటే సుమారుగా నిమిషానికి 15 సార్లు, దానికన్నా ఎంత తక్కువగా తీసుకుంటే అంత దీర్ఘజీవి అవుతాడు. తన ధనాన్ని ఎంత తక్కువగా వ్యయం చేస్తే అంతే అధికంగా ఉంటుంది. శ్వాసకు కూడా ఇదే పరిస్థితి. **విశ్వంలోని సమస్త ప్రాణులలో ఏ జీవి ఎంత తక్కువ శ్వాస తీసుకుంటుందో, అంత ఎక్కువ కాలం జీవించి ఉంటుంది.** ఈ విషయం క్రింద ఇచ్చిన పట్టిన ద్వారా స్పష్టమవుతుంది.

| ప్రాణి పేరు | నిమిషానికి శ్వాసలు | పూర్ణాయుష్షు |
|---|---|---|
| కుందేలు | 38 సార్లు | 8 సంవత్సరాలు |
| కోతి | 32 సార్లు | 10 సంవత్సరాలు |
| కుక్క | 26 సార్లు | 12 సంవత్సరాలు |
| గుఱ్ఱం | 16 సార్లు | 25 సంవత్సరాలు |
| మనిషి | 13 సార్లు | 120 సంవత్సరాలు |
| పాము | 8 సార్లు | 1000 సంవత్సరాలు |
| తాబేలు | 5 సార్లు | 2000 సంవత్సరాలు |

మామూలు పనులలో 12 సార్లు, పరిగెత్తినప్పుడు 18 సార్లు, మైథునం జరిగేటప్పుడు 36 సార్లు శ్వాస జరుగుతుంది. అందుకే విషయాసక్తుల, వ్యభిచారుల ఆయువు తగ్గుతుంది. ప్రాణాయామం చేసే యోగాభ్యాసులు దీర్ఘకాలం జీవించి ఉంటారు. ఊరికే కూర్చుంటే తక్కువసార్లు శ్వాస తీసుకుంటాం కనుక నిష్క్రియంగా కూర్చుంటే ఆయువు పెరుగుతుందని అనుకోకూడదు. అలా జరుగదు ఎందుకంటే పని ఏమి లేకుండా కూర్చునే వారి అంగములు బలం పోగొట్టుకుంటాయి. తదనుసారంగా శ్వాస వేగం చాలా పెరుగుతుంది. అందువల్ల శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకునేందుకు శారీరిక పరిశ్రమ తప్పనిసరి కాని శక్తికి మించిన పనులు తలపెట్టకూడదు.

చైనాలోని పెకింగ్ పట్టణంలో ఒక వృద్ధుడు ఉండేవాడు. అతని వయస్సు 250 సంవత్సరాలు. అతని దీర్ఘాయుష్షుకి కారణం అడుగగా మూడు విషయాలు చెప్పేవాడు. 1) శ్వాసను నాభి వరకు తీసుకుంటాను. 2) ఎప్పుడు వంగి కూర్చోను. నిఠారుగా కూర్చుంటాను. 3) మస్తిష్కంలో ఉత్తేజకరమైన చెడు ఆలోచనలు రానివ్వను. వాస్తవంగా ఈ సూత్రములు స్వరయోగం లోనివి, అతి మహత్వపూర్ణమైనవి. నాభివరకు శ్వాస తీసుకోవడం వలన ఒక రకమైన కుంభకం జరుగుతుంది, శ్వాసల సంఖ్య తగ్గుతుంది. మేరుదండం లోపల ఒక పలుచని జీవనతత్వం ప్రవహిస్తుంది. ఇది సుషుమ్నకు బలం చేకూరుస్తుంది. తదనుసారం మస్తిష్కానికి పుష్టిని చేకూరుస్తుంది. మేరుదండం వంగి ఉంటే ఈ పదార్థపు ప్రవాహం ఆగిపోతుంది, నిర్బలమైన సుషుమ్న మస్తిష్కానికి పోషణ ఇవ్వలేదు. **చెడు ఆలోచనలు, కోపం, శోకం**

**పగ ప్రతీకారాలను దూరంగా తరిమేయాలి, అప్పుడే శాంతి లభిస్తుంది**

**మొదలైన వాటివల్ల శ్వాస వేగం తీవ్రమవుతుంది, ఇదే ఆయు క్షీణతకు ప్రధానకారణం.** స్వరవిజ్ఞాని ఇలా చెప్తారు "శ్వాస తీసుకునేటప్పుడు దాని పొడుగు సుమారు 10" అంగుళాలు ఉంటుంది, శ్వాస వదిలేటప్పుడు 12 అంగుళాలు ఉంటుంది. అంటే వచ్చేదానికన్నా వదిలేది 2 అంగుళములు ఎక్కువ. రాబడి కన్నా ఖర్చు ఎక్కువయితే ఏదో రోజు దుకాణం మూత పడుతుంది. ఇదే మృత్యువు అంటే.

శ్వాస ఎల్లప్పుడు ముక్కుతోనే తీసుకోవాలి. నోటిద్వారా శ్వాస తీసుకునే ఆ అలవాటు కూడదు. శ్వాస తీసుకునేందుకే నాశికనే ద్వారంగా ప్రకృతి తయారు చేసింది. శ్వాస ఈ విధంగా తీసుకోవడం వల్ల ఊపిరితిత్తులకు రక్షణ కలుగుతుంది. తీసుకునే గాలిలో ధూళి కణములు, రోగములు కలిగించే సూక్ష్మక్రిములు ఉంటాయి. దీనిపై బయట ఉన్న చలి-వేడిల ప్రభావం కూడా ఉంటుంది. ఇలాంటి గాలి నేరుగా ఊపిరితిత్తులలోకి వెళ్తే ఆ కోమలమైన అవయవములకు హాని కలిగించకుండా ఉండదు. నాశికలలోని వెంట్రుకలు గాలిని జల్లిస్తాయి. నాశికలో ఒక రకమైన శ్లేష్మం ఉంటుంది. ధూళి కణములు, సూక్ష్మక్రిములు ఈ శ్లేష్మానికి అంటుకుపోతాయి. ముక్కులోని పక్కులు ఒడగొట్ట బడిన వాయువు యొక్క మైలగా తెలుసుకోవాలి. తరువాత వాయువు మస్తిష్కంలోనికి వెళ్ళి అక్కడ నుండి శ్వాస నాశికల ద్వారా ఊపిరితిత్తులోకి వెళ్తుంది. గాలి శిరస్సులో నుండి రావడం వల్ల దాని వేడి కూడా సవ్యంగా ఉంటుంది. ఈ విధంగా శ్వాస తీసుకోవడం వల్ల గాలి నిర్మలమయి ఊపిరితిత్తులలోకి వెళ్తుంది. కాని నోటి నుండి శ్వాస తీసుకోవడం వల్ల గాలిని శుభ్రపరిచే అవకాశం ఉండదు. నోటికి ఊపిరితిత్తులు దగ్గరగా ఉండటం వలన తీసుకునే గాలి యొక్క వేడి కూడా సరిగ్గా ఉండదు. ఇటువంటి గాలి ఊపిరితిత్తులకు హానికారక మవుతుంది. పైగా నాశికలను ఉపయోగించకపోవడం వలన అనేక నాశికలకు సంబంధించిన రోగములు కలగవచ్చు.

నిద్రించేటప్పుడు వెల్లకిలా పడుకోకూడదు. ఇందువలన సుషుమ్న స్వరం నడుస్తుంది. నిద్ర సరిగ్గా పట్టదు. అశుభకరమైన, భయానకమైన స్వప్నములు కలుగుతాయి. అందువల్ల భోజనం చేసిన తరువాత మొదట ఎడమ ప్రక్కగా, తరువాత కుడి ప్రక్కకి తిరిగి పడుకోవాలి. భోజనం చేసిన తరువాత కనీసం 15 నిమిషాలు విశ్రాంతి తీసుకోకుండా బయటకు వెళ్ళటం మంచిది కాదు.

చల్లదనం వల్ల అగ్నిమాంద్యం కలుగుతుంది. ఉష్ణం వలన అగ్ని తీవ్రతరమవుతుంది. ఈ ప్రభావములు మన జఠరాగ్ని మీద కూడా పడుతుంది. సూర్య స్వరంలో జీర్ణశక్తి వృద్ధి అవుతుంది. **సూర్యస్వరంలో ఆహారం తీసుకొనడం ఉత్తమం.** భోజనాంతరం ఎడమవైపు తిరిగి పడుకోవడం వలన సూర్య స్వరం నడుస్తుంది.

నిద్ర నుంచి మేల్కొన్నప్పుడు, ప్రక్క మీద నుంచి లేచేటప్పుడు ఏ స్వరం నడుస్తుందో చూచుకోవాలి. నడుస్తున్న స్వరం వైపు ఉన్న చేతితో ముఖమును రాసుకుని, దానిని దర్శించి, శ్వాసను లోపలికి తీసుకుంటూ నడుస్తున్న స్వరం యొక్క పాదమును నేలపైకి పెట్టి ప్రక్క మీద నుంచి లేవాలి. ఇలా చేయడం వల్ల బద్ధకం పోయి స్ఫూర్తి వస్తుంది, రోజంతా మనస్సు ప్రసన్నంగా ఉంటుంది. నడుస్తున్న స్వరమునకు శరీరంపై అధికారము ఉంటుంది. ఈ క్రియల ద్వారా కొంచెం ఉత్తేజితం చేయడం వలన శరీరంలో నవ చైతన్యం ఉదయిస్తుంది.

భోజనం చేసిన వెంటనే మూత్ర విసర్జన చేయాలి. ఇలా చేయడం వలన ఏ రోగం రాదు. మూత్ర విసర్జన ఎడమ స్వరముతో, మల విసర్జన కుడి స్వరంతో చేయాలి. మల విసర్జన సమయంలో మూత్ర విసర్జన కూడా కుడి స్వరంలో చేసినట్లయితే దోషం లేదు. పాఠకులు దీనిని కపోల కల్పితంగా భావించక దీని లాభములు పరీక్షించండి. కుడి స్వరం నడుస్తున్నప్పటి మూత్రమును, ఎడమ స్వరం నడుస్తున్నప్పటి మూత్రమును రెండు వేరు వేరు సీసాలలో ఉంచి వాటిని పరీక్షింప చేయండి. ఎడమ స్వరంలో వదలిన మూత్రం మంచిగా, కుడి స్వరంలో వదిలిన మూత్రంలో అనేక దోషములు కనిపిస్తాయి. ఇది శరీర శాస్త్రం యొక్క ప్రాకృతిక నియమం. ఒక సంవత్సరం లోపు బాలుడిని గమనించండి. అతను మూత్రం వదిలినప్పుడు ఎడమ స్వరం నడుస్తుంటుంది. మల విసర్జన చేస్తున్నప్పుడు దక్షిణ స్వరం నడుస్తుంటుంది. మొదట్లో కొంచెం ఇబ్బందిగా ఉన్నా ఒకటి రెండు వారాల అభ్యాసంతో సరియైన సమయంలో సరియైన స్వరం నడవడం మొదలవుతుంది.

(సశేషం)

## వినమ్రత

*పాండవులు రాజసూయ యాగాన్ని చేస్తూ ఆ కార్యక్రమంలో సర్వోత్తమమైన పదవిని చేపట్టవలసిందిగా శ్రీకృష్ణుని కోరటం జరిగింది. కృష్ణ పరమాత్మ హాజరైన వారందరి కాళ్ళు కడిగి, వారు భుజించిన ఎంగిలి ఆకులు ఎత్తిపారేసే పనిని చేపట్టడం జరిగింది. భగవంతుడంతటి వాడైనా సరే వినమ్రత, నిరహంకారాలను ఆశ్రయించి తీరవలసిందేనని పై సందర్భం మనకు తెలియచేస్తుంది.*

*- ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీ సావిత్రి*

**ప్రేమ పదిమందిని దగ్గర చేసి మనస్సుపై పన్నీటి జల్లు కురిపిస్తుంది**

గాయత్రీ చిత్రావళి - 12

# బంధనము నుండి విముక్తి




మనుష్యుడు అనేక బంధనాలలో బంధించబడి ఉన్నాడు. ఏ విధంగా వలలో చిక్కిన పక్షి తన స్థితికి దుఃఖిస్తూ ఉంటుందో, దాని నుండి తప్పించుకోవాలని అనుకున్నా తప్పించుకోలేక పోతుందో అదే విధంగా మనుష్యుడు తన పరిస్థితుల నుంచి తప్పించుకోలేక దుఃఖిస్తూ ఉంటాడు. తన చెడు అలవాట్ల దుష్పరిణామం అనుభవించే తీరాలి. వాటి నుండి తప్పించుకోవటం కుదరదు. మార్గాంతరం వెదుకుతాడు, కానీ దొరకదు. జైలులో బందీగా ఉన్న ఖైదీవలె విఫలమనోరథుడై ఉంటాడు, ముక్తి ద్వారం మూసుకుపోయి కనిపిస్తుంది.

ఈ బంధనాలేమిటి? ఎలా ఉన్నాయి? ఎలా బంధించబడ్డాడు? ఇది కూడా తెలియదు. ఆత్మజ్ఞాన ప్రకాశం దొరికినప్పుడే ఆ ముడులు కనిపిస్తాయి. రామాయణం ఉత్తర కాండలో జ్ఞానదీపవర్ణనలో గోస్వామి తులసీదాసు ఈ బంధించిన ముడులు (గ్రంథులు) విప్పే మార్గాన్ని చెప్పాడు. తన కుసంస్కారాలు, మలినమైన దృష్టికోణము, దుర్వ్యసనాలు, మాయ యొక్క ప్రలోభం, అవిద్య యొక్క అంధకారం కామక్రోధలోభ మదమోహాల దుష్ప్రభావం, చెడు పనులు, ఆదిగా గల కారణాలు, చిత్తము యొక్క మలినస్థితి అధమ జన్మకు, బంధనానికి ప్రధాన కారణము.

ప్రాణి ఏ సంకెళ్ళతో బంధించబడి, నరకయాతనలు అనుభవిస్తున్నాడో ఆ సంకెళ్ళు గట్టిలోహముతో చేసినవి, తేలికగా విరుగవు, యోగులు, యతులు, సాధువులు, తపస్వులు కూడా జారిపోయి ఆ ప్రలోభాల కుచక్రములో చిక్కుకుపోయారు. ఇంద్రుడు, చంద్రుడు వంటి ప్రముఖ దేవతలు వ్యాసుడు, విశ్వామిత్రుడు వంటి ప్రముఖ ఋషులు వీటిలో చిక్కుకొనగా లేనిది సాధారణ జీవులు వాటి పట్ల మోహితులు అగుటలో ఆశ్చర్యమేమున్నది?

మాతయొక్క కృపను వరంగా, సాధకుడు తన తపస్సు ద్వారా ఎప్పుడు ప్రాప్తించుకుంటాడో అప్పుడు ఆ దివ్యశక్తి సహాయం పొంది తద్వారా అనేక సంకెళ్ళను త్రెంచుకోగలుగుతాడు. కర్మబంధనం, భోగబంధనం, సంస్కారబంధనం, స్వభావబంధనం, మోహబంధనం మొదలైన సంకెళ్ళు మాత యొక్క దివ్యశక్తితో తెగిపోతాయి. సాధకునికి జీవన్ముక్తి యొక్క బ్రహ్మానందం సహజంగానే ప్రాప్తిస్తుంది. జీవితఖైదు తొలగిన వానికి, వల నుండి విడిచిపెట్టిన పక్షికి ఏ రీతిగా సుఖం లభిస్తుందో దానికి అనేక రెట్లు సుఖాన్ని అసంఖ్యాక జన్మల భవబంధనలు తొలగిన ప్రాణి పొందుతాడు. గాయత్రీమాత శరణాగతియే ఈ ఆనంద ప్రాప్తికి మార్గం.

– అనువాదం : డా॥ తుమ్మూరి

**పగ పదిమందిని దూరం చేసి నిప్పుల కుంపటిలోకి తోసివేస్తుంది**

## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-12

# మొలకెత్తుతున్న విత్తనాలు-2

### వయస్సు రహస్యం

శ్రీరామ్ ఇలా అడిగారు - "బాబా! మీ గురించి ఎన్నో విషయాలు వినవస్తున్నాయి. వాటి రహస్యం ఏమిటి?" బాబా ఇలా అన్నారు - "భగవానుని యొక్క ఈ ప్రపంచాన్ని మించిన అద్భుతం మరొకటి లేదు. ప్రజలు మా గురించి ఏమి చెప్తున్నారో మాకు తెలియదు. ఇక్కడి వచ్చే భక్తులందరికీ మేము భగవంతుని నుండి ఆశీస్సులు కోరుతాము. ఆ కోరిక ఫలిస్తే అది పరమేశ్వరుని కృప. ఫలించకపోతే ఆయన ఇష్టం. నాయనా! ఆయన ఇష్టం లేనిదే ఏమి జరగదు." ఆ తర్వాత తన వయస్సు గురించి ఇలా అన్నారు - "శరీరం మరణ ధర్మం కలిగినది. దాని వయస్సు అడగడం ఎందుకు? గంగా, యమునల మధ్యగల ఒక గ్రామంలో ఈ శరీరం పుట్టింది. ఆ గ్రామంలోని ప్రజలకు తిథులు, వారాలు తెలియవు. అక్కడి ప్రజలు చదువుకున్నవారు కారు. కనుక, శరీరానికి ఎంత వయస్సు వచ్చిందో తెలియదు."



ఈ సమాధానం వల్లనే జనం బాబా వయస్సును అంచనా వేస్తూ ఉంటారు. ఆ అంచనా అసలు వయస్సు కన్నా ఎక్కువగానే ఉండవచ్చు. ఆయన ఆ తర్వాత ఇలా అన్నారు - "నాకు నీ వయస్సే ఉండేది. అప్పుడే ఇల్లు వదలిపెట్టాను. నర్మదా నది ఒడ్డున చాలాకాలం ఉన్నాను. ద్వారక, రామేశ్వరం, పూరీ, బదరీనాథ్ వెళ్ళాను. తీర్థాలను సేవించాను. చివరికి గంగామాత ఒడ్డును ఎంపిక చేసుకున్నాను. యమునా మాత ఒడ్డుకు వెళ్ళమని మాత చెప్పింది. ఇక తిరగడం ఆగిపోయింది" కొద్దిగా ఆగి, బాబా ఇలా అన్నారు - "అయితే, నీ కోసం విధి మరో విధానాన్ని రచించింది. నీ గురుదేవులు తగు సమయంలో నీకు అంతా వివరిస్తారు" గురుదేవులతో తన సమావేశం ఎప్పుడు జరుగుతుందని అడగడం ఇక అనవసరమని శ్రీరామ్ భావించాడు. బాబా ఇచ్చిన ఉపదేశాన్ని, సంకేతాన్ని విని ఆ సాయంత్రమే తిరిగి వెళ్ళాడు.

### రాసలీల రహస్యం

శ్రీరామ్ ఆ రోజు రాత్రి బృందావనంలో ఆగాడు. అక్కడ ఉన్న ఒక తోటలో రాధాకృష్ణులు రాసలీల జరుపుతారని విన్నాడు. రాత్రి సమయంలో రాధాకృష్ణులు అక్కడ విశ్రాంతి తీసుకుంటారు. ఆ సమయంలో అక్కడికి ఎవ్వరు వెళ్ళరు. వెళ్ళిన వారికి అనర్థం జరుగుతుందని కూడా విన్నాడు. రాధాకృష్ణులు రోజూ రాసలీల జరపడం సరే; అయితే ఆ రాసలీల చూచినవారికి అనర్థం ఎందుకు జరుగుతుందని శ్రీరామ్‌కు అనుమానం కలిగింది. భగవంతుని దర్శనం పొందితే మంచే జరగాలి కదా. కౌమారంలో ఉన్న శ్రీరామ్ ఈ అనుమానాన్ని నివృత్తి చేసుకోవాలని అనుకున్నాడు.

ఆయన ఆ తోటవైపు వెళ్తూ ఉండగా, గోపాల్‌దాస్ అనే వైష్ణవ్ సంత్ కలిశారు. శ్రీరామ్ ఆయనను ఆ విషయం అడిగాడు. సాధు గోపాల్‌దాస్ ఇలా అన్నారు - "నిత్యం లీలా విహారం జరుగుతూనే ఉంటుంది. ఈ జగత్తు ఆయనదే కదా. బృందావనంలోని కణకణంలో ఆయన నృత్యం చేస్తున్నారు. ఈ విశ్వమంతా ఆయన నృత్యమే. ఇక్కడ అది మరింతగా ప్రత్యక్షం అవుతుంది. ఎందుకంటే సాధకుల చిత్తం ఇక్కడ మరింత గ్రహణ శీలం అవుతుంది. వారిలో గ్రహించే శక్తి పెరుగుతుంది" సాధువు డొంక తిరుగుడుగా మాట్లాడుతున్నారని శ్రీరామ్‌కు అనిపించింది. శ్రీరామ్ ఆయన మాటలను మధ్యలో ఆపి ఇలా అడిగారు- "రాధాకృష్ణులు తోటకు రాత్రిపూట నిజంగానే సశరీరంగా వస్తారా?"

సాధువు నవ్వి ఊరుకున్నారు. శ్రీరామ్ తిరిగి ఇలా అడిగారు- "ఆయన భగవంతుడు అయితే, ఆయన దర్శనం వల్ల కీడు ఎందుకు జరుగుతుంది?" ఆయన ఈ మాటలు చెప్పగానే, సాధువు మందిరం మెట్లవైపు చూపుతూ ఇలా అన్నారు- శ్రీకృష్ణుడు అలా వెళుతున్నాడు, చూడు; ఆయనతో రాధ కూడా ఉన్నది. శ్రీరామ్ మెట్లవైపు చూచాడు. నల్లని శ్రీకృష్ణుడు, తెల్లని రాధ మందిరం మెట్లు ఎక్కుతున్నారు. వారు వెనుదిరిగి సాధువు వైపు, శ్రీరామ్‌వైపు చూస్తున్నారు. కొద్ది క్షణాల పాటు చుట్టుప్రక్కల జనం, దుకాణాలు, ఇళ్ళు, వీధులు, అక్కడి సందడి అంతా అదృశ్యం అయింది. రాధాకృష్ణుల రూపాలే మిగిలాయి. కొద్ది క్షణాల పాటు బాహ్య స్పృహ లోపించింది. భావ సమాధి స్థితి ఏర్పడింది. ఆ తర్వాత అంతా మామూలు స్థితికి వచ్చింది. ఎదురుగా ఉన్నా గోపాల్‌దాస్ ఇలా అన్నారు "ఇలాంటి దృశ్యం మనలోపల కూర్చున్న భగవానుని బాహ్యరూపం. సాధన మరింత

**కష్టసుఖాలు జీవితాంతం మనలను వెన్నంటే ఉంటాయి**

ప్రగాఢం అయిన కొలది ఇలాంటి అనుభూతి కలుగుతూ ఉంటుంది. అయితే అంతటితో ఆగిపోకూడదు. సాధనను నిరంతరం కొనసాగించాలి"

సాధు గోపాల్‌దాస్ ఇలా స్పష్టం చేశారు– "భగవానుని దర్శనం ఏ విధంగాను హాని కలిగించదు. రాధాకృష్ణులు వచ్చి రాసలీల జరుపుతారనే మాటలో నిజం లేదు. అంతా బూటకం. ఈ విధంగా ఈ తోట మహిమను గానం చేస్తారు. ఈ సాకుతో జనం నుండి డబ్బు గుంజుతారు. హాని జరుగుతుందనే మాట ప్రచారం కావడంతో, ప్రజలు భయపడతారు. పగలు అక్కడికి వెళ్ళి కానుకలు సమర్పిస్తారు. నిజం తెలుసుకోవాలంటే ఒకరోజు రాత్రి ఆ తోటలోకి వెళ్ళి చూడు." సాధు గోపాల్‌దాస్ ఆ రహస్యాన్ని విప్పి చెప్పారు. స్వయంగా తెలుసుకోమని చెప్పారు. శ్రీరామ్ ఆ తోటవైపు నడిచాడు.

చీకటి పడడానికి ముందుగా శ్రీరామ్ ఆ తోటలోకి వెళ్ళాడు. ద్వారాన్ని మూసివేసే ముందు పండాలు (అర్చకులు) ఎవరైనా ఉన్నారా అని తోటలో కలయజూచాడు. శ్రీరామ్ ఒక చెట్టు గుబురులో దాక్కున్నాడు. ఎవ్వరూ లేరని వారికి అనిపించింది. శ్రీరామ్ ఆ గుబురు నుండి వెలికివచ్చాడు. రాధా కృష్ణులు విశ్రాంతి తీసుకుంటారని చెప్పబడిన గదివద్దకు చేరుకున్నాడు. ఆ గదికి సుమారు 20 అడుగుల దూరంలో ఒక చెట్టును ఆనుకుని కూర్చున్నాడు. గది తలుపు తెరచి ఉంది. చీకటి పడింది. రాత్రి రెండవ జాము ప్రారంభమయింది. వాతావరణం అత్యంత ప్రశాంతంగా ఉంది. పక్షుల కిలకిలరావాలు ఆగిపోయాయి. ఒక కోతి కిచకిచ వినబడింది. కీచురాళ్ళ ధ్వని తప్ప మరేది వినబడడం లేదు. రాత్రి మరింత దట్టం అవుతోంది. అర్ధరాత్రి దాటింది. శ్రీరామ్ బాసీపట్టు వేసుకుని కూర్చొని ఆ గదివైపు చూస్తున్నాడు. ఎవరైనా వస్తారేమోనని. ఇలా ఎదురు చూచి చూచి అలసి పోయాడు. నిద్రతో కళ్ళు మూతలు పడుతున్నాయి. నిద్ర పోగొట్టు కోవడానికి శ్రీరాం తోటలో ఉన్న నూతివద్దకు వెళ్ళాడు. చేదతో నీళ్ళు తోడి, చేతులు ముఖం కడుక్కున్నాడు. తిరిగి వచ్చి ఆ చెట్ల క్రిందనే కూర్చున్నాడు.

నీళ్ళు చేదడంలో, చేతులు ముఖం కడుక్కోవడంలో కొద్దిగా చప్పుడయింది. ఆ తర్వాత తోట బయట కీర్తన వినిపించింది. కొద్దిసేపటికి కీర్తన ఆగిపోయింది. ఈలోగా తోటలోపల కాలి మువ్వల ధ్వని వినిపించింది. ఎవరో నాట్యం చేస్తున్న పద ధ్వని వినిపించింది. కొంతసేపు ఆ ధ్వని సాగింది. ఆ తర్వాత ఆగిపోయింది. ఆ తర్వాత తోట బయట మరోమారు కీర్తన వినిపించింది. కొద్దిసేపు సాగి కీర్తన ఆగిపోయింది. ఉదయం అయిదు గంటల వరకు తోటలో ఒకోసారి మురళీనాదం వినిపిస్తోంది. ఒకోసారి తబలానాదం. ఒకోసారి హార్మోనియం సంగీతం. ఆ గదివద్ద మూడుసార్లు వెలుగు కనిపించింది. దీపపు వెలుగు అది. ఆ దీపాన్ని వెలిగిస్తున్న వ్యక్తి కూడా కనిపించాడు. అయిదారు నిమిషాలు వెలిగి, ఆ దీపం ఆరిపోయింది ఎవరో ఊది ఆర్పివేసినట్లు.

## రాత్రి జరిగిన సంఘటనలు

అయిదు గంటలకు ఆ గది దగ్గర ఇద్దరు వ్యక్తులు కనిపించారు. వారు గదిలోకి వెళ్ళారు. కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చారు. ఆ తర్వాత తోట బయట హారతి వందనం వినిపించింది. అనంతరం జనం రాసాగారు. తొమ్మి, పదిమంది జట్టులో శ్రీరామ్ చేరాడు, ఆ గదివరకు వెళ్ళారు. ఆ జట్టులోని వ్యక్తులు గదిలోకి వెళ్ళి గద్గదులు అయినారు. పరుపుపై ఉన్న దుప్పటి ముడతలు పడి ఉన్నది. ఎవరో పడుకుని వెళ్ళినట్లు. నూనె సీసా ఎత్తి చూచారు. సీసా మూత తెరచి ఉంది.

ఆ జట్టులో ఒకడు అన్నాడు "సాయంత్రం సీసాలో ఉంచిన నూనె తగ్గింది" రెండవవాడు అన్నాడు "ఇది చూడండి. కుంకుమ భరిణ తెరచి ఉంది. రాధ బొట్టు పెట్టుకుని ఉంటుంది" మూడవ వాడు అన్నాడు "అయ్యో! భగవానుడు తన పీతాంబరం మరచి పోయాడు" ఇలా ఆశ్చర్యం పెరిగిపోయింది. వీరు గత దినం సాయంత్రం ఆ గదిలోకి వెళ్ళారు. అప్పుడు అంతా సవ్యంగా ఉంది. దుప్పటికి ముడతలు లేవు. కుంకుమ భరిణ మూతమూసి ఉంది. సీసా నిండుగా నూనె ఉన్నది. ఇప్పటి పరిస్థితి చూస్తే, ఎవరో తల దువ్వుకున్నట్లు ఉంది. గతరాత్రి దర్శనం చేసుకున్న తర్వాత వీరు తోట బయటనే ఉన్నారు. ఇప్పుడు ఉదయం మొట్టమొదటి సందర్శకులు వీరే.

తోటలో రాధాకృష్ణుల విహారం వీరంతా వేసిన నాటకమని శ్రీరామ్‌కు స్పష్టంగా తెలిసింది. మధ్యమధ్యలో వినిపించే సంగీతం, ధ్వనులు, వెలుగు, ఆ గది చుట్టుప్రక్కల కనిపించిన జనం ఇదంతా తోటలోకి రాధాకృష్ణులు వచ్చారని అనిపించడానికి జరిగినవే. ఉదయం 5 గంటలకు ఆ వ్యక్తులే గదిలోని దృశ్యాన్ని మార్చారు. భగవానుడు నిజంగానే వచ్చాడని బయట ఉన్న భక్తులకు చెప్పారు. భక్తులు మందిరంలో వెండి నాణెములు అర్పించారు. పూజారులకు విడిగా దక్షిణ ఇచ్చారు.

శ్రీరామ్‌కు సాధు గోపాల్‌దాస్ మాటలు గుర్తుకువచ్చాయి. భగవానుడు అంతటా ఉన్నాడు. స్మరిస్తే, తన్మయత్వంతో పిలిస్తే ప్రత్యక్షం అవుతాడు. పిలవకపోతే ఎదురుగా వచ్చినా, గుర్తు

**చేస్తున్న శ్రమ భవిష్యత్తుకు పునాది అవుతుంది**

పట్టలేము. శ్రీరామ్ ఈ సంఘటన మొత్తాన్ని ప్రశాంతంగా చూచాడు. ఏమి మాట్లాడకుండా తోట బయటికి వచ్చాడు. ఈ బాలుడు కూడా భక్తులతోపాటు వచ్చాడని పూజారులు అనుకున్నారు. తాము ఆడిన నాటకాన్ని శ్రీరాం తన కళ్ళతో చూచాడని వారికి ఏం తెలుసు!

## భవిష్య దర్శనం

బృందావన యాత్ర పూర్తయింది. కరియా బాబాతో సమావేశం జరిగిన మథురలోని తోటలో శ్రీరామ్ ఒకరోజు ఆగాడు. గాయత్రీ మాత విగ్రహం అని చెప్పబడిన విగ్రహం ఎదుట పద్మాసనంలో కొద్దిసేపు కూర్చున్నాడు. మనస్సులో తరంగాలు ఎగసిపడసాగాయి. ఏదో సంకేతం అందుతున్నట్లు, ఏదో నిర్దేశం వస్తున్నట్లు అనిపించింది. కాలం పరుగులు తీస్తోంది. అతను పెద్దవాడు అవుతున్నాడు. 20-25-30-40 సంవత్సరాల వయస్సు దాటింది. 40 సంవత్సరాల వయస్సులో తాము ఆ స్థలంలోనే ఉన్నట్లు అనుభవమయింది. ఇక్కడ ఎందరో సాధన చేస్తున్నారు. హారతులు ఇస్తున్నారు. యజ్ఞాలు చేస్తున్నారు. జనం వస్తున్నారు, వెళుతున్నారు.

ఈ దృశ్యం కొద్దిసేపు అలాగే ఉన్నది. ఆ తర్వాత అదృశ్యం అయింది. (అనంతర కాలంలో 1953లో ఈ స్థలంలోనే గాయత్రీ తపోభూమి స్థాపన జరిగింది.) మరునాడు ఉదయం సంధ్యా వందనం ముగించుకుని, ద్వారకాధీశుని దర్శనం చేసుకుని, శ్రీరామ్ ఆగ్రా (ఆవల్‌ఖేడా)కు బయలుదేరాడు. తాయీజీకి ప్రసాదం తీసుకువెళ్ళే సమయానికి తన కుమారుడు తిరిగి వస్తున్నాడని అనిపించింది. ఆమె గుమ్మం వద్ద నిలబడి ఎదురయ్యింది. శ్రీరామ్ తల్లికి కాళ్ళకు నమస్కరించాడు. తల్లి ఆశీస్సులు ఇచ్చారు." నా పిల్లవాడు ఇప్పుడు పెద్దవాడు అయ్యాడు; కుర్రతనం పోయింది; బాధ్యతలు స్వీకరించే పెద్దరికం వచ్చింది. నా చింతను ద్వారకాధీశుడు తొలగించాడు అని ఆమె అనుకున్నది.

శ్రీరామ్ ఆవల్‌ఖేడాకు తిరిగి వచ్చిన తర్వాత జీవితం యథావిధిగా సాగిపోయింది. వ్యవసాయం. వంశపారంపర్యంగా వచ్చిన వృత్తి, భక్తుల రాకపోకలు పూర్వంవలె సాగుతున్నాయి. తండ్రిగారు లేని లోటు అందరినీ కలచివేస్తోంది. శ్రీరామ్‌కు తండ్రిగారి పని అప్పగించాలని సలహా ఇచ్చారు. కౌమార వయస్సు. ఆ వయస్సులో కంఠం నుండి మధురమైన స్వరం వస్తుంది. ఇప్పుడే ప్రారంభిస్తే యౌవనం వచ్చేసరికి స్థిరపడతాడు. ఆయన నోటి నుండి అమృతవాణివలె పురాణం వెలువడుతుంది. బంధు వర్గం అంతా ఇలా సలహా ఇస్తూ వచ్చారు. తల్లి కూడా మౌనంగా అందుకు ఆమోదించింది. కానీ, వ్యాసపీఠం ముందు కూర్చుని పురాణం చెప్పడానికి శ్రీరామ్ మనస్సు ఎన్నడూ ఇష్టపడలేదు. ఆయన దృష్టి దానిపై నిలవడం లేదు.

## శ్రీరామ్‌లో రగులుకొన్న ప్రతీకార జ్వాల

1919-20 తర్వాత మహాత్మాగాంధీ నాయకత్వంలో సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభమయింది. అప్పుడా ఉద్యమానికి లక్ష్యం పూర్ణ స్వరాజ్యం కాదు. కొందరు భారతీయులు ప్రభుత్వ వ్యవహారాలలో భాగస్వాములు అయ్యేందుకు వీలుగా కొన్ని రాజ్యాంగ సంస్కరణలు జరగాలన్నది అప్పటి లక్ష్యం. మహాత్మా గాంధీ భారతీయ ఆత్మకు వాణి అయ్యారు. సాటిలేని నాయకుడుగా ఆయన పేరు ప్రతిష్ఠలు గడించారు.

1919లో జలియన్‌వాలా బాగ్ హత్యాకాండ తర్వాత ఆయన ఆంగ్లేయ ప్రభుత్వాన్ని సైతానుగా వర్ణించారు. న్యాయస్థానాలను, పాఠశాలలను, కళాశాలలను బహిష్కరించవలసిందిగా ఆయన ప్రజలకు పిలుపు ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ పదవులకు రాజీనామా ఇవ్వాలని, ప్రభుత్వానికి పూర్తి సహాయ నిరాకరణ చేయాలని ఆయన కోరారు. ఆ సంవత్సరం మార్చి 30న, ఏప్రిల్ 16న దేశమంతటా సమ్మెలు జరిగాయి. సమ్మె దినాలలో పట్టణాలు అన్నింటిలో ప్రజా జీవనం స్తంభించిపోయింది. దుకాణాలు మూతపడ్డాయి. ఆంగ్ల అధికారులు నిస్సహాయులుగా చూస్తూ ఉండిపోయారు. సహాయనిరాకరణ అనే ఆయుధం ఎంత బలీయమైనదో ఈ సమ్మెలు తెలిపాయి.

సహాయ నిరాకరణ ఉద్యమం ముందుకు సాగింది. ఉగ్ర రూపాన్ని ధరించింది. సహాయ నిరాకరణ జరిపేవారిపట్ల ప్రభుత్వం కఠినవైఖరి అవలంభించింది. వేలాది మందిని పట్టుకుని జైళ్ళలో కుక్కారు. దారుణ దమనకాండ సాగింది. ప్రజలు ఆ దౌర్జన్యాలను చూస్తూ ఊరుకోలేకపోయారు. కొన్నిచోట్ల హింస చెలరేగింది.

మహాత్మాగాంధీ ఆ హింసను ఖండించారు. ఉద్యమకారులు చివరి వరకు అహింసను పాటించాలని ఆయన కోరారు. హింసా మార్గాన్ని స్వీకరించగానే, పరమాత్మ మనకు తన అండను దూరం చేస్తాడన్నది ఆయన విశ్వాసం. ఎట్టి పరిస్థితులలో అయినా అహింసను పాటిస్తే, జనులలో జనార్దనుడు మేలుకొంటాడని ఆయన హితవు చెప్పారు. సహాయ నిరాకరణ ఉద్యమం తన భావాలకు అనుగుణంగా సాగకపోవడంతో, ఆయన తన పొరపాటును గ్రహించారు. ప్రజలను అహింసకు తయారు చేయకుండా సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించడం

**జీవితంలో నేర్చుకున్న పాఠాలే మనిషిని అత్యున్నత స్థాయికి చేరుస్తాయి**

హిమాలయ మంత తప్పిదమని ఆయన భావించారు. ఆ పొరపాటును సవరించడానికై ఆయన ఉద్యమాన్ని ఉపసంహరించారు.

ఆ ఉద్యమం ద్వారా సంవత్సరంలో స్వరాజ్యం తెస్తానని మహాత్మాగాంధీ వాగ్దానం చేశారు. కానీ, ఆ వాగ్దానం నెరవేరలేదు. 1942 నాటి పూర్ణ స్వరాజ్యం వరకు, క్విట్ ఇండియా (భారత్ నుండి వైదొలగండి) భావన వరకు నాటి ఉద్యమం చేరలేక పోయింది. స్వరాజ్యాన్ని కోరేందుకై ఆనాడు భారత ప్రజల భాగస్వామ్యాన్ని స్వీకరించవలసి ఉంది. గాంధీజీ ఉద్యమాన్ని ఉపసంహరించినా, అది విఫలమయిందని ప్రజలు భావించారు. ఆ భావన కొంతవరకు సరైనదే. అయితే ప్రభుత్వ దమనకాండ, తుపాకులు, జైళ్ళ భయం ప్రజల మనస్సుల నుండి తొలగించింది ఆ ఉద్యమం. ఆ భయం తొలగిపోవడంతో తాము ఏదో రోజున వైదొలగవలసి ఉంటుందనే భావం ఆంగ్లేయులకు కలిగి ఉండవచ్చు. ప్రజల భావాలను అణచి వేయడానికై ఆంగ్లేయులు తమ దమనకాండను తీవ్రతరం చేశారు. ప్రజలలో ప్రతీకార భావాలు కూడా బలపడ్డాయి.

ఆంగ్లేయుల పట్ల రగులుకొంటున్న ప్రతీకార భావన యువతరాన్ని, స్త్రీలను ప్రభావితం చేసింది. ఆవల్‌ఖేడా గ్రామంలోని యువకులలో ఈ ఉద్రేకం శ్రీరామ్ మనస్సులో మొట్టమొదట కనిపించింది.

మథుర-బృందావన యాత్ర నుండి తిరిగి రాగానే, శ్రీరామ్‌కు గాంధీజీని ఖైదు చేశారనే వార్త తెలిసింది. ఆ అరెస్టుకు విరుద్ధంగా ర్యాలీలు సాగాయి. మథుర-బృందావన యాత్రలోని మధురం, పవిత్రం అయిన జ్ఞాపకాలను కొంత కాలం ప్రక్కన పెట్టి, శ్రీరామ్ ప్రభాతభేరీలను నిర్వహించసాగాడు. యువకులు ర్యాలీలలో పాల్గొనడాన్ని గ్రామంలోని పెద్దలు అడ్డుకున్నారు, మీరంతా పిల్లలు "పోలీసులు ఎప్పుడు వస్తారో తెలియదు, కనుక మీరంతా ఇళ్ళకు తిరిగి వెళ్ళండి" అని వారు ఒత్తిడి చేసేవారు. అయితే, "పిల్లలమైన మాకు కూడా దేశం పట్ల కొంత కర్తవ్యం ఉన్నది; మేము మా కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహించడానికై మాకు ఆశీస్సులు ఇవ్వండి" అని శ్రీరామ్ వారిని కోరాడు.

గాంధీజీకి ఆరునెలలు ఖైదు పడిందని కొన్ని రోజుల తర్వాత వార్త వచ్చింది. ఆయనపై రాజద్రోహ నేరం ఆరోపించబడింది. కేసు విచారణ జరుగుతోంది. ఒక సభ జరుగుతూ ఉండగా ఈ వార్త తెలిసింది. ఆ సభలో శ్రీరామ్ కూడా ఉన్నాడు. "మా మీద కూడా కేసులు పెట్టండి; పాపాత్ముల పాలన నశించాలి" అని శ్రీరామ్ వెంటనే నినాదం చేశాడు. 10-12 సంవత్సరాల బాలకుడు వ్యక్తం చేసిన ఈ భావాలు సభలో పాల్గొన్న పెద్దలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. వారు ఆమోదం తెలిపారు. తాను బాలసేనను నిర్మాణం చేస్తానని, ఆంగ్ల పాలనకు వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగిస్తారని శ్రీరామ్ ఆ సభలోనే ప్రకటించాడు.

## బాలసేన నిర్మాణం

శ్రీరామ్ నెలరోజులలో తన వయస్సు పిల్లలు 9-10 మందిని సమీకరించాడు. పిల్లలు ర్యాలీలను నిర్వహించసాగారు. ప్రభాత భేరి తర్వాత పిల్లలంతా గ్రామం బయట ఉన్న హనుమాన్ మందిరానికి వెళ్ళేవారు. హనుమంతుని విగ్రహానికి నమస్కరించి వ్యాయామం చేసేవారు. స్వరాజ్య సమయంలో గెలవాలంటే శరీరం దృఢంగా ఉండాలి; శరీరం బలహీనంగా ఉంటే, పోలీసుల లాఠీ దెబ్బలను తట్టుకోలేదు; ఒక్క దెబ్బకే పడిపోతారు; కనుక శరీరం బలంగా ఉండాలి అని స్వరాజ్య ఉద్యమ నాయకుడు చరణ్ భయ్యా ఇచ్చిన ఉపదేశాన్ని గ్రామంలోని యువకులు అమలు చేశారు. పిల్లలు స్వరాజ్య సమరానికి తయారవుతూ ఉండడం చూచి, చరణ్ భయ్యా, గ్రామంలోని మరికొందరు మందిర ప్రాంగణంలోనే పాలు, ఫలాహారం అందించే ఏర్పాటు చేశారు. నానబెట్టిన శనగలు, బెల్లం ఉపాహారంగా ఇచ్చేవారు.

ఈ బాలసేన వివిధ సమయాలలో సాహస కృత్యాలు చేసి చూపింది. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ ఈ సేన ప్రత్యక్షం అయ్యేది. ఆగ్రాలో సైనిక స్థావరం ఉంది. ఆంగ్ల సైన్యాలు అక్కడ ఉండేవి. పాలకులకన్నా ఈ సైనికులు మరింతగా గర్వం ప్రదర్శించేవారు. వీరు ప్రజలపై అత్యాచారాలు జరిపేవారు. ప్రజల చేత వెట్టి చాకిరీ చేయించేవారు. వినోదం కోసం ప్రజల చేత పోకిరి పనులు చేయించేవారు. సామాన్యప్రజలు వారి అక్రమాలకు భయపడి ఆ స్థావరం సమీపానికి కూడా వెళ్ళేవారు కాదు. రోడ్డు మీద తెల్ల సిపాయిలు వెళుతూ ఉంటే, వారిని చూడగానే జనం దాక్కొనేవారు. ఈ ఆఫీసర్ల అక్రమాల కథలు పరిసర గ్రామాలకు వ్యాపించేవి. ఆవల్‌ఖేడాలో కూడా దెయ్యాల కథలవలె ఆఫీసర్ల అక్రమాల కథలు వినిపించేవి.

బాలసేనలో కూడా ఈ అక్రమాలపై చర్చ జరిగేది. సైనికుల అత్యాచారాలను చూస్తూ ఊరుకోకూడదని సంకల్పం తీసుకున్నారు. "వాటిని ప్రతిఘటిస్తాం, వాటిని ఆపలేకపోతే ప్రతీకారం తీర్చుకుంటాం, చేతులు ముడుచుకుని కూర్చోము" అని బాల సైనికులు సంకల్పం చేసేవారు.

*(సశేషం)*

*- అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**అందరు మనవాళ్ళనుకుంటే అది భ్రమే**

## మస్తిష్కమే కల్పవృక్షం - 8

# అలౌకిక కళాకారుని అద్భుత రచన



*(గత సంచిక తరువాయి...)*

కేటర్‌వరిలోని టామ్స్ క్రేకర్ 3 నెలలో బైబిలును కంఠస్తం చేసి అద్భుతమైన ఉదాహరణను నెలకొల్పాడు.

1724వ సం॥లో జన్మించి 1812లో మరణించిన స్కాట్లాండుకు చెందిన ప్రఖ్యాత కవి డంకన్ మైక్ ఇంటాయర్ ఆ రోజుల్లో ప్రఖ్యాత కవిగా దేశంలోనే కాక యూరప్ అంతా ప్రసిద్ధి పొందాడు. కానీ అతనికి చదవటం కాని రాయటం కాని రాదు. కేవలం వినటం, అర్థం చేసుకోవడం వలననే అతను ప్రతిభను వికసింపచేసుకున్నాడు.

గ్రీకు పోర్సన్ అనే వ్యక్తికి మిల్టన్ యొక్క రచనలన్నీ గుర్తుండేవి. అతను వాటిని మామూలుగానే కాక ఉల్టాచేసి కూడా వినిపించే వాడు. లాక్రోజ్ అనే వ్యక్తి తన స్మరణ శక్తిని అద్భుతంగా ప్రదర్శించి చూసే వారిని ఆశ్చర్యపరిచేవాడు. అపరిచితమైన 12 భాషలలో 12 కవితలను విని మరుక్షణమే వాటిని విన్నది విన్నట్లుగా చెప్పేవాడు.

విక్టర్ హ్యూగో రచనలను ఎంతో ఇష్టంగా అనేకసార్లు చదవడం వలన గమవేషరుద్ద్ అన్నింటినీ గుర్తుంచుకుని అడిగిన వెంటనే పుస్తకంలోని ఏ పేజీనుండైనా ఆరంభించి ఎన్ని పేజిలైనా వినిపించేవాడు.

**జ్ఞాపకశక్తి నిధులుగా మారటం మాయ కాదు వరము కాదు. ఇది ఏ పనిలోనైనా అభిరుచిని కలిగి ఉండటం, జాగ్రత్తగా అర్థం చేసుకోవడం, మనోయోగంతో దానిని మస్తిష్కంలో భద్రపరుచుకునే పద్ధతిపై ఆధారపడి ఉంటుంది. గుర్తుకు తెచ్చుకునే ప్రక్రియ కూడా కష్టమైనది కాదు. సర్కస్‌లో పనిచేసే వారు, జంతువుల శిక్షణకు ఎంత ప్రయత్నిస్తారో అంతే ప్రయత్నాన్ని మస్తిష్కసాధనకు వినియోగిస్తే ఎంత మందబుద్ధులైనా కాళిదాసులాగా గొప్ప ప్రతిభావంతులు కావచ్చు.**

పోర్సన్ గ్రీకుభాషలో అద్వితీయమైన పండితుడు. అతను గ్రీకు భాషలోని సమస్త పుస్తకాలను, షేక్స్‌పియర్ నాటకాలను కూడా కంఠస్తం చేశాడు. బ్రిటీష్ సంగ్రహాలయ సహాయక అధ్యక్షులు రిచర్డ్ మార్నెట్ 12 ఏళ్ళ వరకు సంగ్రహాలయంలోని ముద్రిత పుస్తక విభాగానికి అధ్యక్షుడుగా ఉండేవాడు. ఆ పుస్తకాలయంలో వేలకొలది పుస్తకాల అలమార్లు, వాటిలో లక్షల సంఖ్యలో పుస్తకాలుంటాయి. గార్నెట్ కుర్చీలో కూర్చొని పుస్తకాల గురించి చెప్పటమే కాక పుస్తకాలలోని విషయాలను గురించి కూడా చెప్పేవాడు.

చిన్నతనంలో జ్ఞాపకశక్తి ఎక్కువగా ఉండి, వయస్సు ఎక్కువైన కొద్దీ జ్ఞాపకశక్తి తగ్గుతుందనే అభిప్రాయం ఉన్నప్పటికీ, అది నిజం కాదు. చిన్న వయసులో మస్తిష్కంపై ఎక్కువ బరువు బాధ్యతలుండవు. ఆలోచనలు తక్కువగా ఉంటాయి. ఘటనలు, సంవేదనలు, సమస్యలు కూడా తక్కువగా ఉంటాయి. ఫలితంగా ఒత్తిడి తక్కువగా ఉండి, ఏది ఆలోచించాలన్నా, గుర్తుంచు కోవాలన్నా తేలికగా వీలవుతుంది. కానీ పెద్దవారైన కొద్దీ, కార్యక్షేత్రాలు విస్తరించి, జ్ఞాపకం ఉంచుకోవడం, నిర్ణయ భారం కూడా ఎక్కువ అవుతుంది. ఇటువంటి స్థితిలో ఎంతో పని చేస్తున్నప్పటికీ, కొన్ని అసంపూర్ణంగా ఉండటం ప్రయత్న లోపం కాదు. సరైన పద్ధతిలో పూర్తి చేసిన దానిపై దృష్టిని ఉంచక, పూర్తి కాని దానిని మస్తిష్క బలహీనతగా, జ్ఞాపకశక్తి లోపంగా భావించబడింది. ఇటువంటి వాటివలన బుద్ధిబలం తగ్గిందనే ఆలోచనతో బాధపడటం జరుగుతోంది కాని నిజానికి ఆ విధంగా జరగదు.

ఇంధనం లేకపోతే పొయ్యి చల్లారిపోతుంది. మస్తిష్కంలోని నాడులకు కూడా సరైన రీతిలో పనిచేసేందుకు ఆక్సిజన్ కావాలి. చిన్నతనంలో మస్తిష్కానికి ఆహారం (ఆక్సిజన్) బాగా లభిస్తుంది. పిల్లల జ్ఞాపకశక్తి తీవ్రంగా ఉంటుంది. వారు వారి పాఠాలను తేలికగా గుర్తుచేసుకుంటారు. వయస్సు పెరిగే కొద్దీ కోమలత్వం తగ్గి కఠినత్వం పెరుగుతుంది. దీనివలన ఆక్సిజన్ ఉత్పాదక, వితరణ తగ్గుతూ అవయవాలలో కోమలత బాల్యంలో ఉన్నట్లుగా కాక వయస్సు పెరిగిన కొద్దీ తగ్గుతూ ఉంటుంది. **ఆక్సిజన్ ప్రవాహం మస్తిష్క నాడులకు పూర్తిగా చేరటంలో కలిగే వ్యవధి వలన ఆయువుతోపాటుగా స్మరణశక్తి కూడా తగ్గుతుంది.** అందువలన స్మృతులు పెరిగినప్పటికీ, జ్ఞాపకశక్తి విషయంలో పిల్లలతో పోలిస్తే వయస్సు పెరిగిన వారిలో జ్ఞాపకశక్తి బలహీన పడుతుంది. వృద్ధాప్యంలో రక్తనాళాలు గట్టిపడి రక్తప్రసరణ బాగా జరగకపోవటం వలన మెదడులోని నాడులకు చాలినంతగా

**ఎప్పుడు ఏది అవసరమో అదే మాట్లాడాలి**

ఆక్సిజన్ లభించకపోవటం వలన దుర్బలమవుతుంది. ఫలితంగా ముసలివారికి జ్ఞాపకశక్తి రోజు రోజుకీ క్షీణించి, దైనందిన జీవితంలో ఉపయోగించే వాటిని కూడా మర్చిపోతుంటారు. పరిచయస్తుల పేర్లు కూడా గుర్తుండవు.

మేధా సామ్రాజ్యాన్ని సరైన పద్ధతిలో నడపటానికి నేర్పరులైన కర్మచారులతో కూడిన సైన్యం నియమించబడ్డది. ఇవే నెర్వ్ సెల్స్. వీటి సంఖ్య సుమారుగా 14 వందల కోట్లుగా అంచనా వేయబడింది. ఇవి చాలా అల్పంగా ఉన్నప్పటికి నిర్వహించే మహత్తర కార్యాలను చేయడం చూస్తే "అణోరణీయాన్ మహతో మహీయాన్" అనే ఈశ్వరుని వర్ణన జ్ఞాపకం వస్తుంది. ఈ కోశికలు అంగుళంలో వెయ్యో భాగం కంటే తక్కువగా ఉండి, బరువు ఒక ఔన్సులో 10 వేల కోట్ల వంతు ఉంటుంది.

సైన్యంలోని సభ్యులందరు విభిన్నమైన పనులు చేయవలసి ఉంటుంది. సైనికులు పరస్పరం కలిసి పనిచేయటం, ఒకరికొకరు అవసరమైన సాధనాలు సమకూర్చుకోవటంలో సన్నిహితంగా ఉంటారు. సరిగ్గా ఇదే పద్ధతిలో మెదడులోని కోశికలు పనిచేస్తాయి. వీటిని పరస్పరం కలిపి ఉంచే పనిని నెర్వు ఫైబర్స్ చేస్తాయి. వీటిలో విద్యుత్ ప్రవహిస్తూ ఉంటుంది. వీటికి ఇన్సులేషన్ కూడా పూర్తిగా ఉంటుంది. ప్రతి నాడి, తంతువు కూడా ముఖ్యమైనవే. అయినప్పటికి అవి అన్నీ కలిసి వాటి పనిని చేయవలసి ఉంటుంది. వీటి సంయుక్త శక్తి వల్లనే విభిన్నమైన మానసిక ప్రయత్నాలు జరుగుతాయి. ఇంద్రియాల నుండి ఏ సూచనలు మస్తిష్కానికి చేరినా, దానిని ఏ విధంగా ఉపయోగించాలనే విషయాన్ని మస్తిష్కమనే మేజిస్ట్రేటు తక్షణం చేయవలసి ఉంటుంది. ఇది ప్రయత్నం లేకుండా జరగదు. దానికై సాక్షులు, వకీళ్ళు, ఋజువులు, ఉదాహరణలు, చట్టాలను పర్యవేక్షణ చేయవలసి ఉంటుంది. ఈ పనిలో నాడీతంత్రులు సంగ్రహించిన అనుభవం పనికి వస్తుంది. విభిన్న వ్యక్తులలోని నాడులు భిన్న పద్ధతులలో అనుభవాలను, అభ్యాసాలను ప్రోగుచేసుకుంటాయి. ఇందువలన వాటి నిర్ణయాలు వేరువేరుగా ఉంటాయి. అందువలననే ఒకే ప్రశ్నకు అనేక వ్యక్తుల నిర్ణయాలు అనేక రకాలుగా ఉంటాయి. ఇది నాడుల సమూహం సంగ్రహించిన అనుభవాలు, అభ్యాసాల మీద ఆధారపడి ఉంటుంది. ఈ నాడులు చిన్నచిన్న సమూహాలుగా ఉండి, పరస్పర సహాయంతో పని పూర్తిచేసే శక్తిని, అభ్యాసాన్ని కలిగి ఉంటాయి.

టేప్ రికార్డర్‌పై కొన్ని స్వరాలను టేప్ చేయడం జరుగుతుంది. అవసరాన్ని అనుసరించి దానిని ఆన్‌చేసి మళ్ళీ వినవచ్చు. మస్తిష్కం కూడా ఒక విధమైన టేప్ రికార్డరే. దీనిలో అసంఖ్యాకమైన ఘటనలు, స్మృతుల రూపంలో నమోదు (రికార్డు) చేయబడతాయి. అవసరమైనప్పుడు వాటిని మళ్ళీ పైకి తీయవచ్చు. ఈ స్మృతులు ధ్వని, చిత్రం, సంవేదనల సమ్మిశ్రణ రూపంలో ఉంటాయి. టేప్ రికార్డర్ కేవలం ధ్వనిని మాత్రమే రికార్డు చేస్తుంది. కానీ మస్తిష్కంలో స్మృతులతోపాటు దృశ్యం కూడా రికార్డు అవుతుంది. ఇంతేకాక ఆ సమయంలో కలిగిన భావాలు, సంవేదనలు కూడా రికార్డు అవుతాయి. సమయానుసారంగా ఈ చిత్రాలు తిరిగి వస్తుంటాయి. 10 రోజుల క్రితం జరిగిన ఘటనలను విస్తృతంగా వర్ణించవచ్చు. 10 సం॥ తర్వాత ఈ విధంగా చేయలేరు. ఎందుకంటే అది రికార్డు చేయబడిన సమయంలో అంత ప్రాముఖ్యం కలిగినదైతే అంత గాఢమైన ముద్రను వేస్తుంది. అంత బాగా గుర్తుంటుంది.

స్మృతులు ముద్రిస్తున్నప్పుడు మస్తిష్క స్థితి ఏ విధంగా ఉంటుందనేది ముఖ్యమైన విషయం. స్మృతులు ఎంత గాఢంగా ముద్రించబడ్డాయనేది కూడా ఈ విషయంపై ఆధారపడి ఉంటుంది. తేలికగా ముద్రించబడిన ఘటనలు గాఢంగా ముద్రించబడిన వాటితో పోలిస్తే తొందరగా చెరిగిపోతాయి. కొందరి మస్తిష్కాలు జన్మతః మన్నికగల వాటిని మాత్రమే నోట్ చేయగలుగుతాయి. కొన్నిసార్లు శారీరిక కష్టం లేక మానసిక ఉద్వేగం వలన మానసిక చైతన్యం ఉదాసీనతతో ఉంటుంది. ఇటువంటి దశలో పొందిన జ్ఞానం నోట్ చేయబడకపోవచ్చు అందువలన తేలికగా గుర్తుకు తెచ్చుకోవడం సాధ్యం కాదు.

విజ్ఞానవేత్తలు మస్తిష్కం యొక్క స్మరణశక్తికి ఆధారం విద్యుత్‌గా భావిస్తారు. ఇది సంవాద వాహినీ నాడులలో గతిశీలంగా (active) ఉంటుంది. కేవలం స్మృతులను ముద్రించటం, మళ్ళీ గుర్తుకు తెచ్చుకోవడమే కాక, తన పనిని సమర్థవంతంగా చేయగలిగే యోగ్యతను కలిగించేందుకు కూడా ఈ విద్యుత్ ధార ప్రధాన భూమిక వహిస్తుంది. విద్యుత్ విజ్ఞాన శాస్త్ర విద్యార్థులకు ఆవర్తన శీలమైన విద్యుత్ చక్రం యొక్క రివాల్వింగ్ సర్క్యూట్ క్రియప్రక్రియలో పరిచయం ఉంటుంది. నాడులలో కొంత విద్యుత్ కూడా తన కార్యక్షేత్రంలో పని చేస్తుంటుంది. ఈ గతిచక్రంలో ఎంత విద్యుత్ ప్రవాహం, పరిభ్రమణలో ఎంత వేగం ఉన్నదనే దానిపై స్మృతుల స్థాపన ఎంత గాఢంగా ఉంటుందనే విషయం ఆధారపడి ఉంటుంది. ఈ విద్యుత్ స్వయంగా చలనం కలిగి స్వయంగా నిర్మితమవుతుంది. మస్తిష్కనాడుల నిర్మాణంలో సోడియమ్ అయానులు (ions) / పొటాషియమ్ అయానులు విస్తృతంగా పనిచేస్తాయి. వీనిలోని మార్పులు, చేర్పులు శరీరంలోని

**మన జీవితానికి కర్త, కర్మ, క్రియ అంతా మనమే**

ఇతర అవయవాల మాదిరిగానే ఉంటుంది. దీనిలోని సహజమైన ఉత్తేజం వలన మస్తిష్కంలో విద్యుత్ ధార ఉత్పన్నమై, పనిచేస్తూ ఉంటుంది. ఇది చాలా పలుచగా ఉన్నప్పటికీ జీవసత్తా పూర్తిగా నశించేవరకు దీని శక్తి పూర్తిగా అంతమయిపోదు.

బుద్ధి తీక్షణతను పెంపొందించుకునేందుకై సామాన్యంగా ప్రతిపాదింపబడే సిద్ధాంతం ఏమిటంటే ఏ విషయంపై ఎక్కువగా దృష్టిని కేంద్రీకరిస్తే ఆ విషయం వికాసం పొందుతుందని, ఏ విషయాన్ని ఉపేక్షిస్తే ఆ విషయం మర్చిపోతామని భావిస్తారు. ఇది సామాన్యమైన ఆరోగ్య శిక్షణ నుండి యశస్సు, తేజస్సు, స్మృతుల వరకు అన్నింటికి వర్తిస్తుంది. ఘటనల పట్ల, మానసిక ఏకాగ్రత పట్ల అన్యమనస్కంగా ఉన్నట్లయితే ప్రాముఖ్యం లేనిదనే భావనతో స్మృతి పథంలో ఎక్కువకాలం నిలవదు. దీనికి విరుద్ధంగా తన్మయత్వంతో, ఏకాగ్రచిత్తంతో అర్థం చేసుకునేందుకు, చూసేందుకు ప్రయత్నిస్తే అవి చాలాకాలం వరకు స్మృతిపథంలో నిలుస్తాయి. చాలావరకు ముఖ్యమైన ఘటనలు మానవులకు జీవితాంతం గుర్తుంటాయి. ప్రాముఖ్యతలేని ఘటనలు కొద్దిరోజులలోనే స్మృతిపథం నుండి జారిపోతాయి.

మానవుల మస్తిష్క నిర్మాణంలో భేదం లేనప్పటికీ వాటిలో స్థూల, సూక్ష్మ అంతరాలను గమనించవచ్చు. అవి కూడా జన్మతః సంక్రమించినవి కాక పరిస్థితుల వలన ఏర్పడతాయి. ఏ విధంగా వ్యాయామం, భోజనం మొదలైన వాటివలన శరీరాన్ని దృఢంగా చేసుకోవచ్చో, అదేవిధంగా అభ్యాసంతో మేథాశక్తిని పెంపొందించుకోవచ్చు.

మనోవైజ్ఞానికుడు కార్లసిర్ కథనం ప్రకారం సగటు వ్యక్తులు వారి జ్ఞాపక శక్తిలో కేవలం పదిశాతం మాత్రమే వినియోగిస్తారు. 60 శాతం నిద్రాణస్థితిలో, అస్తవ్యస్థ స్థితిలో ఉంటుంది. ఫలితంగా మానవులు మందబుద్ధులుగా, మూర్ఖులుగా తయారవుతారు. కానీ ప్రయత్నం చేసినట్లయితే మానవులు వారి బుద్ధిశక్తిని బలోపేతం చేసుకోగలుగుతారు. బుద్ధిసూక్ష్మత కలిగినవారు భవిష్యత్తులో అధికమైన మేథాశక్తిని పొందగలిగేందుకు అన్ని అవకాశాలు ఉంటాయి.

**విస్మృతికిగల మూడు ముఖ్య కారణాలు: 1) విషయాలను గుర్తుంచుకోవాలనే ఇచ్ఛ లేకపోవటం, 2) విషయాన్ని మానసికంగా అర్థం చేసుకునేందుకు ప్రయత్నించకపోవటం, 3) విషయాల పట్ల అయిష్టం, ఉదాసీనత, వాటి ప్రాముఖ్యతను స్వీకరించకపోవటం.** ఇటువంటి మానసిక స్థితివలన చూసినది, విన్నది గాఢంగా ముద్రపడక అసంపూర్ణంగా, అస్పష్టంగా ఉంటుంది. ఇష్టంలేని కారణాన, ఆలోచింపగల శక్తిగల కణాలలో లోతుగా ప్రవేశించలేకపోవటం వలన విస్మరణ గతిలోపడి గుర్తును కోల్పోతుంది.

ధ్యానం చేయటం వలన మస్తిష్కంలోని విద్యుత్ ఉత్తేజం పొంది, స్మరణ శక్తికి లోపం ఉండదు. దీనికై ధ్యాన అభ్యాసాలలో మనకు ఉపయోగపడే వాటిని ఎన్నుకోవాలి. ఏకాగ్రతను పెంపొందింపచేసే అన్ని అభ్యాసాలు మనోబలాన్ని పెంచి, జ్ఞాపకం ఉంచుకునే శక్తిని కలిగిస్తాయి.

ఆరంభంలో మస్తిష్కంలోని సురక్షిత భాగాల గురించి చర్చించటం జరిగింది. వాటిని కనుక జాగృతం చేయకలిగితే కేవలం అద్భుతమైన జ్ఞాపకశక్తిని పొందగలగటమే కాక మస్తిష్కంలో మనకు తెలిసితెలియని కేంద్రాలతో సంబంధం కలిగి ఎన్నో శక్తులను, సిద్ధులను పొందవచ్చు.

ఉన్నత ఆధ్యాత్మిక ప్రయోజనాల కోసం ఈ భాగాలను తెరిచి, వాటివలన లభ్యమయ్యే శక్తిని అసాధారణ కార్యాలను సాధించే ప్రయత్నాలను యోగులు, తపస్వులు చేస్తారు.

స్మృతి, విస్మృతుల గురించి చర్చించే బదులు జాగృతి, సుషుప్తుల ఆధారంగా ఆలోచించడం అవసరం. ఉదాసీనత, నిరుత్సాహం, అజాగ్రత్తవంటి మానసిక స్థితులవలన మర్చిపోవడం జరుగుతుంది. కష్టాలు కలిగినప్పుడు, మానసిక శక్తిని కలిగించే ఆహారాన్ని ఇవ్వటం అసంగతం కాకపోయినప్పటికీ, ఆలోచనా విధానంపై ఆవరించిన శిథిలతను దూరం చేయటం ఉపయోగకరమవుతుంది. దీనికై ధ్యాన, ధారణలలోని అన్ని పద్ధతులను కావలసినంతగా ఉపయోగించటం లాభదాయకమవుతుంది. ఉపాసనలో ధ్యాన, ధారణలపై దృష్టిని కేంద్రీకరించటం వలన అనేక ఆధ్యాత్మిక లాభాలే కాక మస్తిష్కంలోని విభిన్న శక్తులు జాగృతమవుతాయి.

– అనువాదం: *శ్రీమతి ఎ.ఆర్. నిర్మల*

## వినయం

*తథాగతుడు బోధి వృక్షానికి నమస్కరిస్తూ ఉండగా ఒక శిష్యుడు వృక్షానికి ఇంత గౌరవాన్ని ఇవ్వటం ఏమిటి అని ప్రశ్నిస్తాడు. బుద్ధుడు చిరునవ్వుతో, "వినయంతో నమస్కరించే వాడు ఎప్పుడూ గొప్పవాడు కాగలుగుతాడు. ఈ పరంపరను అహంకారంతో మీరు విస్మరించకుండా ఉండటానికి నేనీవిధంగా నమస్కరించటం అవసరమయింది. ఈశ్వరీయ మార్గంలో అడుగిడే మీరందరు వినయాన్ని ఆశ్రయించి అహంకారాన్ని విడనాడండి" అని శిష్యుడిని ఆదేశిస్తాడు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**ఈ ప్రపంచం మనతోనే ప్రారంభం కాలేదు, మనతోనే అంతమై పోదు**

గాయత్రీ జయంతి ప్రత్యేకం

# గాయత్రీ పంచముఖి - ఏకముఖి

జపం, ధ్యానం, స్తోత్రం, పూజ, హవనముల వల్ల శరీర శుద్ధి, మానసిక విశ్రాంతి కలుగుతుంది. వీటి తరువాత ఏమిటి? వీటిపైన ఇంకొక అంతస్తు ఉన్నది. ఇక్కడకు చేరే మార్గము తెలుసుకోవాలి. ఈ మార్గము వైపు నడవటానికి కావలసిన తత్పరత, దృఢత, క్షమత సంపాదించుకోవాలి.

గాయత్రి పరబ్రహ్మ యొక్క విశ్వవ్యాప్తమైన శక్తి దీనికి రూపం లేదు. ఏదైనా రూపం ఇచ్చినా అది ప్రకాశరూపం కావచ్చు. గాయత్రి యొక్క దేవత సవిత, సవిత అంటే సూర్యప్రకాశ పుంజం. సాధకునిలో గాయత్రీ మహాశక్తి అవతరించినప్పుడు, ప్రారంభములో ఈ ప్రకాశము అనేక దివ్యకాంతులతో, అనేక దివ్యరూపములలో గోచరిస్తుంది. ఆత్మిక ప్రగతి ఊర్ధ్వముఖమైనప్పుడు, అంతరాత్మకు ఈ ప్రకాశము అనుభూతియైనప్పుడు బ్రహ్మానందం, పరమానందం అనుభవమవుతుంది. చకోరపక్షి రాత్రంతా చంద్రుని చూస్తూనే ఉంటుంది. అలాగే సాధకునికి ఆ దివ్య ప్రకాశము చూస్తుండాలని, ఆనందంలో మునిగిపోవాలనిపిస్తుంది.

సాధకునిలో బ్రహ్మజ్ఞానము యొక్క తత్వదర్శనము జరుగుతుంది. ఆదర్శవంతమైన క్రియాకలాపాలలో జీవించాలనే ఆకాంక్ష మొదలవుతుంది. మాయ, మోహం, స్వార్థపరత్వం యొక్క అజ్ఞానం వీడి, విశాల దృష్టికోణముతో ఆలోచించటం, మహాత్ముల సాహస మార్గముల పయనించటం చేస్తాడు. ప్రారంభమున ఉపాసన సాకార రూపముతోనే సాధ్యము, నిరాకార సాధన చాలా పైకి వెళ్ళిన తరువాతనే వస్తుంది. ఈ సందర్భములోనే గాయత్రీ మహాశక్తి యొక్క ఆకృతి నిర్ధారించబడినది.

సామాన్యంగా ఏకముఖము, రెండు భుజములు కలిగిన ప్రతిమను పూజలో ఉపయోగిస్తారు. గాయత్రిని తల్లివలె భావించటానికి, సాధకునికివలె కాళ్ళు, చేతులు కలిగిన ఆకృతి అవసరము. అందువల్ల పూజలో ధ్యానములో ఎల్లప్పుడు ఏక ముఖం, రెండు భుజములు కలిగిన, చేతులలో కమండలం, పుస్తకము ధరించిన హంసవాహిని గాయత్రీ మాత యొక్క ప్రయోగం జరుగుతుంది. కాని కొన్నిచోట్ల పంచముఖ ప్రతిమలు, చిత్రములు చూడవచ్చు. వీటిని పూజలో, ధ్యానములో ఉపయోగించినప్పటికి దీనిలో మహత్వపూర్ణమైన శిక్షణ, సందేశములు, నిర్దేశములు నిండి ఉన్నవి. మనము వీటిని చూచి అర్థము చేసుకోవాలి.

గాయత్రి యొక్క పంచముఖములు జీవుని కప్పి ఉన్న పంచ కోశములు, పంచ ఆవరణములు. దశ భుజములు దశ సిద్ధులు, అనుభూతులు. గాయత్రీ మహాశక్తితో చేరి ఉన్న పంచభౌతిక, పంచ ఆధ్యాత్మిక శక్తుల సంకేతములే ఈ దశ భుజములు, ఈ మహాశక్తి అవతరణ ఎక్కడ జరిగినా, అక్కడ ఈ పది అనుభూతులు, విశేషాలు, సంపదలు నిశ్చిత రూపంలో అనుభవానికి వస్తాయి. **సాధన అంటే నియమితమైన స్థలములో కూర్చుని జపము, పూజ చేయటం మాత్రమే కాదు, జీవనమును సాధనామయం చేసి తన గుణ కర్మ స్వభావములను ఎంతో ఎత్తుకు తీసికొని వెళ్ళాలి.** అక్కడ ప్రత్యక్షంగా ఈ అనుభూతులు దృష్టిగోచరం అవుతాయి. వీటి సంకేతములు పంచముఖి మాత యొక్క ప్రతిమ దశ భుజములలో చూపించబడినవి. భుజములు శక్తి సామర్ధ్యాలకి ప్రతీకలు. శక్తిని సంప్రాప్తించుకొనటమే సాధన యొక్క ఉద్దేశ్యం. జీవన సాధన ద్వారా ఈ దశ సిద్ధులు, దశ శక్తులు ప్రాప్తించటం మొదలయితే గాయత్రీ ఉపాసకుడు ఉచ్ఛస్థరీయ సాధనా మార్గములో సఫలతా పూర్వకముగా ముందుకు వెళ్తున్నట్లు తెలుసుకోవచ్చు.

జీవికి పంచ శరీరములున్నాయి. మనకు ఒకే శరీరము కనిపిస్తున్నప్పటికి, మిగిలిన నాలుగు శరీరములు ప్రత్యక్షంగా దృష్టిగోచరము కానప్పటికి వాటి సామర్థ్యములు ఒకదానిని మించి ఒకటి ఉంటాయి. ఈ శరీరములను వికశింపచేసుకొన్నట్లయితే, తుచ్ఛుడు మహామానవుడుగాను, ఆత్మ పరమాత్మగాను అవగలదు.

జీవుడు ధరించి ఉన్న పంచకోశముల పేర్లు 1) అన్నమయ కోశం 2) ప్రాణమయకోశం 3) మనోమయకోశం 4) విజ్ఞాన మయకోశం 5) ఆనందమయకోశం. వీటి సంక్షిప్త వివరణ ఈ క్రింద ఇవ్వబడింది.

### 1. అన్నమయ కోశం

గాయత్రి పంచముఖములలో, ఆత్మ యొక్క పంచకోశములలో మొదటిది అన్నమయ కోశం. అన్నమంటే పృథ్వి యొక్క రసము. పృథ్వి నుండి జలము, ఫలములు, కూరగాయలు, గడ్డి మొదలైన పదార్థములు ఉత్పన్నమవుతాయి. వీటి వల్లనే శరీర నిర్మాణము జరుగుతుంది. అన్నం వల్లనే దేహం పెరుగుతుంది. పుష్టిగా తయారవుతుంది. అన్నం వలన ఉత్పన్నమైన శరీరమును అన్నమయకోశమని పిలువబడుతుంది.

**ఆకలిగా ఉన్నవాడికి అన్నంపెట్టి ఆదరించాలి**

ఇక్కడ ఒక మాట గుర్తుంచుకోవాలి. **రక్త మాంసములతో నిర్మించబడి మనకు కనుపించే శరీరము అన్నమయ శరీరము కాదు. కాని ఇది అన్నమయకోశ ఆధీనములో ఉన్నది.** మృత్యువు సంభవించినప్పుడు దేహం నశించిపోయిన్పటికి అన్నమయ కోశము నాశనము కాదు. అది జీవునితోనే ఉంటుంది. భౌతిక శరీర సంచాలనము జరిపేది అన్నమయకోశమే, దీనిని సూక్ష్మ శరీరమని కూడా అంటారు.

రోగము వచ్చినప్పుడు డాక్టర్లు మందుల ద్వారా, ఇంజక్షన్ ద్వారా రోగ నివారణ చేస్తారు. ఇటువంటి పద్ధతుల ద్వారా స్థూలశరీరమునకు వచ్చిన రోగములు మాత్రమే నివారణ అవుతాయి. కాని అనేక రోగములు అన్నమయకోశ వికృతి వల్ల ఉత్పన్నమవుతాయి. వీటిని నివారించటంలో శరీర చికిత్సకులు అసమర్థులు. వీటి నివారణ అన్నమయకోశ సాధన ద్వారా మాత్రమే సంభవము.

శరీరము అన్నం వల్ల తయారవుతుంది. అన్నం వల్ల పెరుగుతుంది. అన్నంలో సూక్ష్మజీవన తత్వమున్నది. దానివల్ల అన్నమయకోశం తయారవుతుంది. జీవునికి ఎలాగ పంచ కోశములు ఉన్నాయో, అలాగే అన్నమునకు మూడు కోశములు ఉన్నాయి. వాటి పేర్లు స్థూల, సూక్ష్మ, కారణ శరీరములు (కోశములు). స్థూలశరీరములో బరువు, రుచి; సూక్ష్మ శరీరములో ప్రభావము, గుణము; కారణ శరీరములో సంస్కారము ఉంటాయి. మాంసము మొదలైన పదార్థములు తినటానికి రుచిగా ఉండవచ్చు. కాని వీటి సూక్ష్మ సంస్కారముల వలన అన్నమయ కోశము వికృతమవుతుంది. దీని పరిణామము ఆకస్మిక రోగములుగా, జన్మజన్మాంతరముల వరకు కురూపతగా ఉంటుంది. అందువల్ల ఆత్మ విద్యాజ్ఞాత ఎల్లప్పుడు సాత్విక సుసంస్కార ఆహారం తీసుకోవాలి.

అన్నమయకోశ పుష్టికి అనేక సాధనలు గత సంచికలలో ఇవ్వబడ్డాయి. సత్వగుణము కలిగిన ఆహారము తీసుకొనడం వలన ఈ కోశము వృద్ధి చెందుతుంది. కష్టపడి సంపాయించిన ధనము తోనే ఆహారము తీసుకోవాలి. స్వచ్ఛమైన మనస్సుతో తయారు చేయబడిన, శాంత చిత్తముతో, నియమిత సమయమున, తగు మాత్రమున తీసుకోబడిన సాత్విక ఆహారము వల్ల అన్నమయ కోశమునకు ఉన్నతి లభిస్తుంది.

అన్నమయకోశ సాధనల వలన మనిషి రోగం లేకుండా దీర్ఘజీవిగాను, సుందరమైన, ఆకర్షణీయమైన రూపంతో, ప్రభావ శాలిగా తయారవుతాడు. ఏ పనిచేసినా సఫలత పొందుతాడు.

## 2. ప్రాణమయ కోశం

ప్రాణశక్తి సామర్థ్యానికి ప్రతీక. ఈ మహాశక్తి వల్లనే విద్య, తెలివితేటలు, దూరదృష్టి, సాహసం, ధైర్యం, పరాక్రమం, పురుషార్థం లభిస్తాయి. ఆధ్యాత్మిక భాషలో దీనినే ప్రాణశక్తి అంటారు.

ప్రాణవంతులైనవారి వాణి చాలా మధురంగా ఉంటుంది. వినేవారి మానసిక తలుపులు తెరుచుకుంటాయి. నలువైపులా నిరాశజనకమైన అంధకారం ఉన్నప్పటికి, ప్రాణశక్తివంతులలో ఆశాజ్యోతి వెలుగుతూనే ఉంటుంది. మరుభూమిని పూదోటగా చెయ్యాలనే ప్రయత్నం, అసంభవాన్ని సంభవం చేసే సామర్థ్యం కేవలం ప్రాణవంతులకు మాత్రమే సంభవం. ఎవరిలో అయితే ప్రాణశక్తి స్వల్పంగా ఉందో, వారు పరాధీనులవుతారు. తమ కష్టాలకు ఇతరులను తప్పుపడతారు. తమ సామర్థ్యంపై వారికి విశ్వాసం ఉండదు. నాయకులపై, ఆఫీసర్లపై, ధనికులపై, సిద్ధ పురుషులపై, దైవీశక్తుల సహాయముపైన మాత్రమే వారి ఆశలు కేంద్రీకృతమవుతాయి.

ప్రాణశక్తి ద్వారానే శ్రద్ధ, నిష్ఠ, దృఢత, ఏకాగ్రత ప్రాప్తిస్తాయి. ఇదే భవబంధాలను త్రెంచి ఆత్మను పరమాత్మతో కలుపుతాయి. ప్రపంచములో సుఖ సాధనములను సంపాదించేందుకు వివేకము, ప్రయత్నము, పురుషార్థముల ఆవశ్యకత ఉన్నది. ముక్తికొరకు వీటి అవసరము ఎంతైనా ఉన్నది.

ముక్తి అనేది సాహసి, సూరవీరులకు మాత్రమే సాధ్యము. భగవంతుడు ఎవరికి బంధము కాని, ముక్తిగాని ఇవ్వడు. స్వర్గము, ముక్తి అనేవి బలహీనులకు ప్రాప్తించవు.

ఎలాగయితే గాయత్రీశక్తి సర్వత్రా వ్యాపించి ఉన్నదో, అలాగే ప్రాణం యొక్క చైతన్య సముద్రం సర్వత్రా నిండి ఉన్నది. ఎలాగయితే సాధనలలో గాయత్రీ శక్తిని లాక్కొని తనలో ధారణ చేసుకోవచ్చో, అలాగే ప్రాణమయ కోశమును చైతన్య వంతము చేయుటకు, విశ్వవ్యాప్తి ప్రాణతత్వమును కావలసినంతగా లాక్కొనవచ్చును. ఈ భాండారము ఎంత పెద్దది అవుతుందో దానికి తగినట్లుగా ప్రాపంచిక, ఆధ్యాత్మిక సంపత్తి ప్రాప్తిస్తాయి.

స్ఫూర్తి, ఉత్సాహం, దృఢత, సాహసం, ధైర్యము. క్రియాశీలత, కష్టముల ఓర్చుకొను శక్తి, బుద్ధి సూక్ష్మత మొదలైనవి ప్రాణశక్తి రూపమైన పూలచెట్టు యొక్క చిన్న చిన్న పుష్పములు.

మేరుదండం కుడి ఎడమ ప్రక్కల నాడీ గుచ్ఛములలో మొదటి శృంఖలములను ఇడ, పింగళ అని యోగములో అంటారు. రక్త ప్రసరణ, శ్వాసక్రియ, జీర్ణక్రియ మొదలైన కార్యక్రమముల బాధ్యత

**కడుపు నిండిన వాడికి విందు భోజనం పెడితే ఏం లాభం?**

ముందు చెప్పబడిన నాడీగుచ్ఛములపై ప్రధానముగా ఉన్నది. ప్రాణమయకోశ సాధనతో ఇడా పింగళ నాడులు బలమయి, దీనికి సంబంధించిన శరీరములోని వికారములు దూరమయి ఆనందమయమైన స్వాస్థత ప్రాప్తిస్తుంది.

శ్వాస తీసుకునేటప్పుడు నాశికల ద్వారా ప్రాణతత్వములో ఒక అంశమును ఆక్సిజన్ రూపములో తీసుకుంటాము. విశ్వ వ్యాప్తమైన, సచేతనమైన ప్రాణమును వైజ్ఞానిక పద్ధతిలో అధికముగా తీసుకొనగలిగినట్లయితే భౌతిక శరీరము అత్యంత శక్తివంతమవుతుంది. ఇటువంటి వ్యక్తి ఎంత కష్టసాధ్యమైన కార్యమయినా తేలికగా పూర్తి చేస్తాడు.

ప్రాణశక్తి లౌకిక జీవనములో ఎంత అవసరమో ఆధ్యాత్మిక జీవనములో కూడా అంతే అవసరము. షట్చక్రభేదనము, బ్రహ్మ గ్రంథి, విష్ణుగ్రంధి, రుద్రగ్రంథి విమోచనము, కుండలిని జాగరణ, తంత్రోక్తసాధన మొదలైన ఉచ్ఛస్తరీయమైన సాధనలు ప్రాణశక్తి అధికముగా గలవానికి మాత్రమే సాధ్యము.

ప్రాణశక్తి అభివర్ధమునకు 24 రకముల ప్రాణయామ పద్ధతులు, మరియు ఇతర పద్ధతులు కలవు. సాధకులకు అనుభవము గల మార్గదర్శకుడు, సాధకుని అంతరంగ పరిస్థితి అనుసరించి అభ్యాసము చేయిస్తారు.

## 3. మనోమయ కోశం

దీనిని గాయత్రి యొక్క తృతీయ ముఖం అని కూడా అంటారు. మానవుడిని పతితుడిని చెయ్యాలన్నా, భూసురునిగా మార్చాలన్నా, అది మనస్సు యొక్క లీలయే. మనస్సులో ప్రచండమైన ప్రేరకశక్తి ఉన్నది. మనస్సు ఈ ప్రేరకశక్తితో కల్పనా చిత్రాలను సజీవము చేస్తుంటే, మనిషి చిన్నపిల్లవాడిలాగా దాని కొరకు పరిగెత్తటం మొదలు పెడతాడు. ఈ విధముగా మనస్సులో ఎటువంటి కల్పనలు, ఇచ్ఛలు, కోరికలు, ఆకాంక్షలు, తృష్ణలు లేస్తుంటాయో, ఆ దిశలోనే శరీరము వెళ్ళవలసి వస్తుంది.

ఇంద్రియ భోగములోను, అహంకార తృప్తిలోను మనస్సు సుఖాన్ని వెదకుతుంది. ఉచితానుచితములు పట్టనప్పుడు మనస్సు చెడు మార్గమున పయనించినట్లే. కాని మనస్సు బుద్ధి వశంలో ఉన్నట్లయితే ఇలా జరుగదు.

మనస్సు వశంలో ఉంచుకోవటం అంటే బుద్ధి యొక్క నియంత్రణలో ఉండటమే. బుద్ధి ఏ విషయములో ఔచిత్యం అనుభవిస్తుందో, ఆత్మలాభమును అర్థము చేసుకొని దానికి తగిన విధముగా కల్పనలు చేయటం, ప్రణాళికలు వేయటం, ప్రేరణ ఇచ్చే పని మనస్సు చేయటానికి తయారయినప్పుడు మనస్సు వశంలో ఉన్నట్లే. ప్రతిక్షణము అనవసర ఆలోచనలు, నిరర్థకమైన స్మృతులు, కల్పనలు నియంత్రణ లేని మనస్సు యొక్క చేష్టలు.

**మనస్సు యొక్క ఏకాగ్రత, తన్మయత్వంలో ఉన్న ప్రచండశక్తికి సమమైన శక్తి ఈ ప్రపంచంలో లేదు.**

సూర్యుని కిరణములు భూతద్దము ద్వారా ఏకత్రితము చేసినట్లయితే మొదట పొగ తరువాత అగ్ని పుడుతుంది. **మనస్సులోని చిందరవందరగా ఉన్న ఆలోచనలు, కల్పనలు, ఆకాంక్షలు, ప్రేరణ శక్తిని ఏకాగ్రము చేసినట్లయితే దాని ఫలితములు చాలా ఆశ్చర్యముగా ఉంటాయి.**

వశములో ఉన్న మనస్సు ఒక శక్తివంతమైన అస్త్రము, దానిని ఏ దిశలో ప్రయోగిస్తే అక్కడ ఆశ్చర్యకరమైన ఫలితాలు వస్తాయి. దానిని ప్రపంచములోని ఏ కార్యమునకైనా ఉపయోగించినప్పుడు, అక్కడ సఫలత లభిస్తుంది. ధనం ఐశ్వర్యం, నేతృత్వం, అన్వేషణ, ఏ అభీష్టమైనా సిద్ధిస్తుంది. ఇవి వశంలో ఉన్న మనస్సు యొక్క ప్రయోగం వలన ప్రాప్తిస్తాయి.

మనస్సు భౌతికమైన కోరికలు మాత్రమే కాదు, పారమార్థిక ఆకాంక్షలను కూడా పూర్తిచేస్తుంది. సమాధి సుఖం మనోలయం ద్వారా జరిగే చమత్కారము.

గీతలో శ్రీకృష్ణ భగవానుడు అర్జునుడికి మనస్సును వశం చేసుకునే రెండు ఉపాయాలు చెప్పాడు.

1. అభ్యాసము 2. వైరాగ్యము-అభ్యాసం అంటే యోగ సాధన ద్వారా మనస్సును అధీనంలో ఉంచుకోవటం. వైరాగ్యం అంటే వ్యావహారిక జీవనము సంయమంతోను, నియమంతోను ఉంచుకోవడం. బద్ధకం, దుర్వ్యయం, దురాచారం, సమయ దురుపయోగం వలన సామాన్య జీవనము అధోగతి పాలవుతుంది. లాభం, మోహం, క్రోధం, తృష్ణ మొదలైన వాటి వల్ల మానసిక పతనము జరుగుతుంది.

శారీరిక, మానసిక, సామాజిక చెడుల నుంచి తప్పించుకోవటం కొరకు ఎప్పుడు సరళముగా, ఆదర్శవాదిగా శాంతిమయ జీవనకళనే వైరాగ్యం అంటారు. కొందరు వైరాగ్యం అనే పేరుతో ఇల్లు వదిలి రకరకాల వేషధారణ వేస్తూ, అటు ఇటు తిరుగుతుంటారు. చివరికి కష్టాలపాలవుతారు.

అభ్యాసము కొరకు యోగశాస్త్రములో అనేక సాధనల వర్ణనలు ఉన్నాయి. వీటిని మనోలయ యోగమంటారు. దీనిలో

**ప్రాణం ఉన్నంతవరకు మన పని మనం చేసుకుంటూ పోవాలి**

అంతర్గతంగా 1) ధ్యానం 2) జపం 3) త్రాటకం 4) తన్మాత్ర సాధన ఈ నాలుగు పద్ధతులకు మహత్వపూర్ణమైన స్థానమున్నది.

## 4. విజ్ఞానమయ కోశం

అన్నమయ ప్రాణమయ, మనోమయ కోశముల తరువాత నాలుగవది విజ్ఞానమయ కోశం దీనినే గాయత్రి యొక్క నాలుగవ ముఖమంటారు. ఆత్మోన్నతికి విజ్ఞానమయ కోశ సాధన నాలుగవ భూమిక అవుతుంది.

విజ్ఞానమంటే విశేషమైన జ్ఞానం. సాధారణ జ్ఞానం ద్వారా మన శారీరిక, వ్యాపారిక, సామాజిక, కళాత్మక సమస్యలను అర్థము చేసుకుంటాము. స్కూళ్ళలో ఈ జ్ఞానము చెప్పబడుతుంది. ఎవరి దగ్గర ఈ జ్ఞానము ఎక్కువగా ఉంటుందో వారు సామాన్య జీవనములో ఉన్నతి, యశస్వి, సంపన్నుడు, ఐశ్వర్యవంతుడు అవుతాడు.

జ్ఞానమంటే తెలుసుకోవటం, విజ్ఞానమంటే అర్థ ధారణము, మాన్యత, అనుభూతి. ఆత్మవిద్యలో జిజ్ఞాస ఉన్నవారికి ఆత్మ అమరమని, శరీరము కన్నా భిన్నమని, ఈశ్వరుని అంగమని, సచ్చిదానంద స్వరూపమని తెలుసు. కాని ఈ తెలియటం కొంచెం కూడా అనుభూతిలో ఉండటం లేదు. శారీరిక లాభం కొరకు ఆత్మలాభాన్ని ఉపేక్షించటం ప్రతిక్షణం జరుగుతున్నది. మరి ఆత్మయొక్క అమరత్వం, శరీరము యొక్క భిన్నత, ఈశ్వరుని అంశంపై శ్రద్ధ, విశ్వాసం ఏమయినాయి?

సామాన్యంగా శరీరాన్నే "నేను" గా భావిస్తుంటారు. అలాగే పరిచయం చేస్తారు. కాని విజ్ఞానం ఈ అజ్ఞాన రూపమైన అంధకారం నుండి రక్షిస్తుంది. ఏ మనోభూమిలో ప్రవేశించి జీవి "నేను ఆత్మను, శరీరాన్ని కాదు" అనేది అనుభవంలోనికి వస్తుందో దీనినే విజ్ఞానమయకోశం అంటారు. అన్నమయకోశంలో జీవి ఉన్నప్పుడు – పురుషుడు, స్త్రీ, మనిషి, లావు, సన్నం, నల్లగా, తెల్లగా మొదలైన శారీరిక భేదాలని గుర్తిస్తాడు. ప్రాణమయకోశంలో జీవి ఉన్నప్పుడు వ్యక్తులను గుణములను బట్టి గుర్తిస్తాడు. శిల్పి, సంగీతజ్ఞుడు, వైజ్ఞానికుడు, మూర్ఖుడు, వక్త మొదలైనవి. జీవి మనోమయకోశంలో ఉన్నప్పుడు వ్యక్తులను స్వభావములను బట్టి గుర్తిస్తాడు. లోభి, దొంగ, నాస్తికుడు, ఆస్తికుడు, ఉదారవంతుడు, సంయమము గలవాడు, దయగలవాడు, మొదలైన ధర్మమునకు, ఔచిత్యము సంబంధించిన మాన్యతను బట్టి వ్యక్తులను గుర్తించటం జరుగుతుంది. జీవి విజ్ఞానమయకోశంలో ప్రవేశించినప్పుడు "నేను శరీరము కన్నా, గుణము కన్నా, స్వభావము కన్నా చాలా ఉన్నతము "నేను ఈశ్వరుని రాజకుమారుడను. అవినాశి ఆత్మను" అనే అనుభవం కలుగుతుంది.

విజ్ఞానమయకోశ జాగరణ ద్వారా సాధకునికి స్వర్గము నందు, ముక్తి వలన కలిగే ఆనందం శరీరంలో ఉండగానే లభిస్తాయి. వీటి కొరకు వేరే లోకమునకు వెళ్ళనక్కరలేదు. మృత్యువు కొరకు వేచి ఉండనవసరము లేదు.

విజ్ఞానమయ కోశ సాధనలో 1) సోహం సాధన (అజపజపం) 2) ఆత్మానుభూతి 3) స్వర సంయమము 4) గ్రంథి భేదనం ఈ నాలుగు అపశ్చర్యలు చేయవలసి ఉంటుంది.

*(సశేషం)*

---

## బిచ్చగాళ్ళ మధ్య రాణి

*కాశీనరేంద్రుని భార్య గొప్ప సౌందర్యవతి, ప్రతిభాశాలి అయిన స్త్రీ, ఒకరోజు ఉదయాన్నే పరిచారికలతో కలిసి గంగాస్నానానికి వెళ్ళి అలవాటులేని కారణంగా చలికి విపరీతంగా వణకసాగింది. పరిచారికలు ఆమెను ఒడ్డుకు తెచ్చి, దగ్గరలోనున్నా కుటీరాలను పీకి, చలి మంట వేసి చలిబారినుండి రక్షించారు. విషయాన్ని విన్నరాజు రాణిని దోషిగా దర్బారులోనికి పిలిపించి, బిచ్చగాళ్ళ దుస్తులను ధరింపచేసి భిక్షాటన చేసి జీవించమని, తనను చలి బారి నుండి రక్షించటానికి మండించిన కుటీరాలను లభించిన ధనంతో పునర్నిర్మాణం గావించి, ఆ పిమ్మట తిరిగిరమ్మని ఆదేశించాడు. ఆమె రాజు ఆజ్ఞను తూ.చా. తప్పక పాటించి, శిక్షాకాలం పూర్తికాగానే తిరిగివచ్చింది. రాజు ఆమెను ఆదరంతో చేరదీసి, దేవీ! ఈ రాజ్యం అంతా మన కుటుంబమే. ఈ కుటుంబానికి మనం పెద్దవాళ్ళము. స్వార్థానికి, సుఖానికి బానిసలు కాకుండా మనం ఏ ఆదర్శాలైతే పాటిస్తామో అవే రాజ్యంలో పాటించబడతాయి. నీవల్ల తప్పు జరిగింది. దానికి నీవు ఆనందంగా ప్రాయశ్చిత్తం చేసుకున్నావు. ప్రజల విశ్వాసాన్ని పొందడమే కాకుండా ఈవిధంగా శ్రేష్ఠ సాంప్రదాయాన్ని కూడా పోషించగలిగావు. ధన్యురాలివని అభినందిస్తాడు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీ సావిత్రి*

---

**కష్టాలను ఎదుర్కోవడం ఆపేస్తే రావలసిన విజయాలు ఆగిపోతాయి**

గాయత్రీ జయంతి ప్రత్యేకం

# తారక మంత్రం - గాయత్రీ మంత్రం

గాయత్రీ మంత్రాన్ని తారక మంత్రం అని కూడా అంటారు. ఎన్నో సాధనా గ్రంథాల్లో దీన్ని ఈ పేరుతోనే పేర్కొన్నారు. తారక అంటే తరింపజేసేది, దాటించేది, మునగకుండా తేలుతూ ఉండేట్టు చేసేది. లోతుగా ఉన్న నీటి ప్రవాహం నుండి రక్షించి దాటించేదాన్ని తారకం అంటారు. చాలామంది ఈ భవసాగరంలో మునిగిపోతుంటారు. కొద్దిమంది మాత్రమే తేలుతుంటారు. ఈ విధంగా తరింపచేయగల సాధనని తారకం అంటారు. గాయత్రీ మంత్రంలో ఈ సామర్థ్యం ఉంది కాబట్టే దీన్ని తారక మంత్రం అన్నారు.

గాయత్రీ మంత్రం ఎందుకు తారకమైందో తెలుసుకునే ముందు, మనిషిలోని సమర్థత- అసమర్థత, సాఫల్యం-వైఫల్యం, జీవిత ఉద్దేశపూర్తికి అవసరమైన సార్థకత-నిరర్థకతను నిర్ధారించే శక్తి ఏమిటి అనేది తెలుసుకోవాలి. **ఒక్కమాటలో తెలుసుకోవాలంటే ప్రాణశక్తే మనిషిలోని జీవనీ శక్తి.** ఇది తగ్గితే మనిషి అవసరమైనంత పరాక్రమాన్ని ప్రదర్శించ లేక, సగంలోనే ఆపేసి నిరాశ చెందుతాడు. భౌతిక, ఆధ్యాత్మిక క్షేత్రాల్లో కోరుకున్నది దక్కించుకోవడానికి అవసరమైన సామర్థ్యం ఉండి తీరాలి. లేని పక్షంలో లక్ష్యాన్ని ఛేదించడం, కోరుకున్నది దక్కించుకోవడం అసాధ్యమే. గొప్ప పని చేయాలంటే దానికి కావలసిన వనరులు సమకూర్చుకొని తీరాలి. భౌతిక వస్తువుల కన్నా వ్యక్తిత్వంలో ప్రఖరత, ఓజస్సు ఉండడం మరింత ముఖ్యం అని వేరే చెప్పనక్కర్లేదు.

పరికరాలను ఉపయోగించుకోవడానికి కూడా శౌర్యం, ధైర్యం, సంతులన చాలా అవసరం. చేతిలో మంచి తుపాకీ ఉన్నా, మనస్సులో పిరికితనం, తడబాటు ఉంటే ఆ తుపాకీ మాత్రం ఏం చేయగలదు? అసలు పేలదు, పేలినా గురి తప్పుతుంది, శత్రువు సునాయాసంగా చేతిలోంచి దానిని లాక్కుని దాడి చేస్తాడు. అదే ధైర్యవంతులైతే, కర్రలతోనే దుండగులను సమర్థవంతంగా ఎదుర్కొంటారు. 'సాహసవంతులకు ఈశ్వరుడు సహకరిస్తాడు' అని ఊరికే అనలేదు. **అన్ని విజయాలకి మూలం ప్రాణశక్తి సమకూర్చి పెట్టే ధైర్యం, దృఢత్వం, తపన, సంసిద్ధతలు. ఇదే సత్యం. ఈ విభూతులన్నీ ప్రాణశక్తికి సహచరులు.**

దీపంలో నూనెలాగా మనిషి కళ్ళల్లో, వాక్కులో, భావాల్లో, బుద్ధిలో, ఆలోచనల్లో ప్రకటమయ్యే తేజస్సే ప్రాణం. మనిషి జీవితంలోని అసలైన శక్తి ఇదే. ఈ ఒక్క ప్రత్యేకత వల్లనే లెక్కలేనన్ని సౌకర్యాలు, సానుకూలతలు వాటంతటవే పుట్టి, కూడగట్టుకుని, ఆకర్షించబడుతూ ఉంటాయి. ఈ విభూతి లేని వారి సంపదలను బలవంతులు అపహరించుకుంటారు. బలహీనుడిని గుర్రం ఎత్తి పడేస్తుంది. బలహీనుల సంపదలు ఇతరులకి వెళ్ళిపోతాయి.

సంరక్షించుకోగల సామర్థ్యం లేని వారు సముపార్జించుకున్న వేటినీ తమ దగ్గర నిలుపుకోలేరు. దౌర్బల్యాల దగ్గర విభూతులు నిలవవు. ఈ తథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తెలివైన వారు తమ సమర్థత, ప్రాణశక్తులను నిలుపుకోవడానికి, పెంపొందించుకోవడానికి భౌతిక, ఆధ్యాత్మిక ప్రయత్నాలు చేస్తూ ఉండాలి. ఆధ్యాత్మిక ప్రయత్నాలతో **ప్రాణశక్తిని సంస్కరించే అత్యుత్తమ ప్రక్రియ గాయత్రీ ఉపాసన.** దాని నామకరణం కూడా ఈ ఆధారంగానే జరిగింది.

**ప్రాణశక్తే శరీరంలో ఆరోగ్యం, ఆయుష్షు, స్థిరత్వం, రూప లావణ్యంగా ప్రకాశిస్తుంది. అదే మనస్సులో తెలివి, మేధ, ప్రజ్ఞలుగా ప్రతిష్ఠితమై ఉంటుంది. శౌర్యం, ధైర్యం, నిష్ఠ, దృఢత్వం, తపన, సంయమనం, సహృదయత, ఔదార్యం, దూరదృష్టి, వివేకాలను బట్టి ప్రాణశక్తి స్థాయి పరిగణించబడుతుంది. వ్యక్తిత్వంలోని సంపూర్ణ తేజస్సుకి ఆధారం ప్రాణశక్తి.** శాస్త్రకారులు దీని గొప్పతనాన్ని ముక్తకంఠంతో ఎలుగెత్తి చాటారు. ఈ సృష్టిలోని సర్వోత్తమ ప్రఖరత గురించి తెలుపుతూ మనుషులకు ఈ శక్తి కేంద్రం గురించి ఎరుకతో ఉండమని హెచ్చరించారు. జీవిత లక్ష్యాన్ని పొందాలంటే ఈ శక్తి భాండాగారాన్ని గుర్తుంచుకుని, దాన్ని సముపార్జించుకుని, వికసింపజేసుకునే ప్రయత్నం చేస్తూ ఉండాలని సూచించారు.

**గాయత్రీ సాధన మనిషిని ప్రాణంతో నింపి, అందులో ప్రఖరతను పెంపొందిస్తుంది. గాయత్రి అంటేనే ప్రాణాలను రక్షించేది అని అర్థం. ఈ విధంగా ప్రాణవంతులై, ఎన్నో ప్రఖర శక్తులు లభించడం వల్ల అడుగడుగునా విజయం సాధిస్తారు.** సమాజంలో విపత్తులు, లోటు, శోకం సంతాపాలకు కారణం ప్రాణలేమి. బలహీనులను అన్ని వైపులనుండి ఆక్రమిస్తారు, దైవం కూడా వారిని ఆపదలపాలు చేస్తుంది. అలాంటి వారికి అదృష్టం కూడా కలిసిరాదు. శవం మీదకి కాకులు, రాబందులు వచ్చి పడ్డట్టుగానే తత్త్వహీనుడైన మనిషి పరిస్థితి ఉంటుంది. కాబట్టి బుద్ధిమంతులు ప్రాణాన్ని ఆశ్రయించి తీరాలి.

**ప్రాణో వై బలం. ప్రాణో వై అమృతం ।**
**ఆయుర్వః ప్రాణః రాజా వై ప్రాణః ॥ - బృహదారణ్యకం**

ప్రాణమే బలము, ప్రాణమే అమృతం. ప్రాణమే ఆయువు, ప్రాణమే రాజు.

**ప్రతి కష్టం వెనుక ఒక బహుమతి ఉంటుంది**

**యో వై ప్రాణః సా ప్రజ్ఞ, యా వా ప్రజ్ఞ స ప్రాణః**
**- సాంఖ్యాయనం**

ఏది ప్రాణమో అదే ప్రజ్ఞ. ఏది ప్రజ్ఞో అదే ప్రాణం.

**యావద్ధయాస్మిన్ శరీరే ప్రాణోవసతి తావదాయుః. - కౌషీతకి**

శరీరంలో ప్రాణమున్నంత వరకే జీవితం ఉంటుంది.

**ప్రాణో వై శుశర్మ సుప్రతిష్ఠాన్ - శతపథ**

ఈ శరీర రూప నావకు ప్రాణమే సుప్రతిష్ఠ.

**ఏతావజ్జన్మసాఫల్యం దేహినామిహ దేహిషు ।**
**ప్రాణైరర్థైర్ధియా వాచా శ్రేయ ఏవాచరేత్సదా ।**

ప్రాణము, ధనము, బుద్ధి, వాక్కులతో శ్రేయస్కరమైన పనులు చేయడంలోనే దేహధారులకు జన్మ సాఫల్యం.

**యా తే తనూర్వాచి ప్రతిష్ఠితా యా శ్రోత్రే యా చ చక్షుషి।**
**యా చ మనసి సంతతాశివాం తాం కురుమోత్క్రమీః ॥**

హే ప్రాణమా! వాక్కులో, చెవుల్లో, కళ్ళల్లో, మనస్సులో ఉన్న నీవు వాటిని కళ్యాణప్రదం గావించు. మా దేహాన్ని విడిచి వెళ్ళకు.

**ప్రాణస్యేద వశే సర్వం త్రిదివేయత్ ప్రతిష్ఠితమ్ ।**
**మాతేవ పుత్రాన్ రక్షస్వ ప్రజ్ఞాం చ విదేహిన ఇతి ॥**

హే ప్రాణమా! ప్రపంచంలో, స్వర్గంలో ఉన్నవన్నీ నిన్ను ఆశ్రయించినవే. కాబట్టి ప్రాణమా, నీవు తల్లిదండ్రులలాగా మా సంరక్షకుడివి కమ్ము, మాకు ధనము, బుద్ధి ఇవ్వు.

వ్యక్తి యొక్క వ్యక్తిత్వమే కాక సృష్టిలోని ప్రతి కణము ఆ ప్రాణశక్తి యొక్క తేజస్సుతోనే వెలుగుతోంది. **జీవితం, వెలుగు, ఉత్సాహం, ఆనందం, అందం ఎంత ఎక్కువ ఉంటే అక్కడ అంత ప్రాణం ఉందని అర్థం చేసుకోవాలి.** నిర్మాణ సామర్థ్యం ప్రాణంలో మాత్రమే ఉంది. సృష్టి, ఆవిష్కరణ, నిర్మాణం, వ్యాప్తి, వికాసక్రమం ఏవైతే కొనసాగుతున్నాయో వాటికి మూలం పరబ్రహ్మ యొక్క పరాచైతన్యమే. చైతన్యంలాగానే పంచ జడతత్త్వాలు సక్రియంగా ఉండడానికి ఆధారం ప్రాణం. దీని నుండే పరమాణువులు తమ సామర్థ్యాన్ని గ్రహిస్తాయి, దాని ప్రేరణతోనే అవి తమ అక్షంలో, కక్ష్యలలో పరిభ్రమిస్తూ ఉంటాయి. బ్రహ్మాండంలోని గ్రహ నక్షత్రాలన్నిటి గతివిధులు ఈ ప్రాణశక్తి నుండే ప్రేరితులవుతాయి.

**ప్రాణాద్ధేయ వ ఖల్విమాన భూతాని జాయన్తే ।**
**ప్రాణాని జాతాని జీవన్తి ప్రాణ ప్రయస్త్యభి సంవిశాన్తితి ॥**
**- తైత్తరీయ ఉపనిషత్తు**

ప్రాణశక్తి నుండే ప్రాణులన్నీ పుడతాయి. పుట్టాక ప్రాణంతోనే జీవిస్తాయి. చివరికి ఆ ప్రాణంలోనే ప్రవేశిస్తాయి.

**సర్వాణి హవా ఇమాని భూతాని ప్రాణమేవ ।**
**భిషం విషన్తి, ప్రాణమయుమ్యుంజిం హతే ॥**
**- ఛాందోగ్యఉపనిషత్తు**

ప్రాణులన్నీ ప్రాణం నుండి ఉత్పన్నమై, ఆ ప్రాణంలోనే లీనమైపోతాయి.

**అపశ్యం గోపామనిపద్యమానమా, చ పరా చ పథిభిశ్చరన్తం ।**
**స సధ్రీచీః స విషూచీర్వసా న ఆవరీవర్తి భువనేశ్వన్తః ॥**
**- ఋగ్వేదం 1.164.31**

**నేను ప్రాణాల్ని చూసాను, సాక్షాత్కరించుకున్నాను. ఈ ప్రాణమే అన్ని ఇంద్రియాలకు రక్షణ కల్పిస్తుంది. ఇది ఎన్నటికీ నాశనం కాదు. ఇది వేరు వేరు మార్గాల ద్వారా, అంటే నాడుల నుండి వస్తూ, పోతూ ఉంటుంది. ముఖం, నాసిక ద్వారా క్షణక్షణం శరీరంలో ప్రవేశిస్తూ, బయటికి వెళ్తూ ఉంటుంది. శరీరంలో ఈ ప్రాణం వాయు రూపంలో ఉన్నప్పటికీ, అధిదైవిక రూపంలో ఇది సూర్యుడు.**

ప్రపంచమంతా వ్యాపించి ఉన్న ఈ ప్రాణశక్తి ఎక్కడ ఎక్కువగా సంతరించుకుని ఉంటుందో అక్కడ ఎక్కువ జీవం కనిపిస్తుంది. ఈ ప్రాణతత్త్వం ఎక్కువ ఉన్నందువల్లనే మనిషి మిగిలిన ప్రాణులకంటే ఎంతో తెలివి, బుద్ధి, సద్గుణాలు, సామర్థ్యాలు, సభ్యత కలిగి ఉంటాడు. ఈ మహాశక్తిని సామాన్య ప్రాకృతిక వస్తువులను ఉపయోగించుకోవటానికి మాత్రమే పరిమితం చేస్తే నరపశువుల వలె సామాన్య జీవితం గడపగలడు. కాని ఆధ్యాత్మిక విజ్ఞానంతో దాని పరిమాణాన్ని పెంచితే సాధారణ స్థాయి నుండి అత్యుత్తమ శిఖరాలను చేరుకోగలడు. న్యూన స్థితిలో పడుంటే జీవితంలో సునాయాసంగా లభించే ఆనందం, ఉల్లాసం దూరమవుతాయి. మనోవికారాలు, వాటి దురదృష్టకర ప్రతిక్రియల వల్ల కలిగే కష్ట నష్టాలను సహించడమే నరకం. భూమిమీద చాలామంది మనుష్యులు శారీరిక నరకాన్ని అనుభవిస్తూనే జీవితాన్ని గడుపుతుంటారు. ఆంతరిక దౌర్బల్యాల వల్ల ఎన్నో గొప్ప విజయాలను కోల్పోతారు. ఈ స్థితిని వదిలించుకోవాలంటే ప్రాణశక్తిని సంపాదించుకోవడం ఎంతైనా అవసరం.

**గాయత్రీ మహామంత్రం ద్వారా ఈ ప్రాణతత్త్వాన్ని కావలసినంత సంపాదించుకోవచ్చు. దీనితో మనిషి తాను దైవీ జీవితాన్ని గడుపుతూ, భవసాగరాన్ని దాటి, ఇతరులను కూడా తరింప జేయగలడు. ఈ గొప్పతనం, సామర్థ్యం వల్లనే గాయత్రీ మంత్రాన్ని తారక మంత్రం అన్నారు.** పద్ధతిగా మంత్రాన్ని ఆశ్రయించిన వారికి వెంటనే ఈ సమగ్ర జీవనీశక్తి అభివృద్ధి చెందడం కనిపిస్తుంది. వెలుగు పెరుగుతున్నకొద్దీ చీకటి తగ్గిపోతూ ఉంటుంది. అలాగే ఆంతరిక సామర్థ్యం పెరుగుతున్న కొద్దీ దుఃఖ దారిద్రాలకు నిలయంగా కనిపించే జీవితం, ప్రపంచాన్ని భవసాగరంగా చిత్రీకరించే నరక వాతావరణం కూడా అంతమై పోతుంది.

*- అఖండజ్యోతి, ఫిబ్రవరి 1984*

*అనువాదం: శ్రీ ఎం.వి.ప్రసాద్, జయలక్ష్మి*

**విజయం కష్టపడే వారి నుంచి ఎక్కువకాలం తప్పించుకోలేదు**

కఠోపనిషత్తు-5

# ప్రథమ అధ్యాయం-ప్రథమ వల్లీ

*(గత సంచిక తరువాయి...)*

## సాధనకు అవరోధాలు

వాల్మీకి రామాయణంలో హనుమంతుని పాత్ర ద్వారా సాధకుడు ఏమి నాటుకోవాలి? ఎలా నాటుకోవాలి? అనేది చెప్పాడు. వాల్మీకి మారుతి ద్వారానే కాక చాలాచోట్ల ఎలా నాటుకోవాలి? ఏమి నాటుకోవాలి? అనేది చెబుతాడు. మనము ఆ పుస్తకమునైతే చదువుతాము కానీ అలా నాటుకోము. నాటుకోవడము కూడా మనకి రాదు. హనుమంతుడు ఏమని చెప్పాడంటే – రామకార్యము అన్నా, ఆత్మజ్ఞానానికి చేసే ప్రయత్నం అన్నా ఒక్కటే అని.

### 1. మైనాకుడు

హనుమంతుడు సీతని వెదకటానికి బయలుదేరినప్పుడు మొట్టమొదట అడ్డుతగిలేది ఎవరు? మైనాకుడు. మైనాకుడు అంటే ఎవరు? వాయుదేవుని స్నేహితుడు. అంటే మనిషిలో ఉండే జీన్స్. ఆ జీన్స్ రామకార్యం సాధించడానికి వెళుతున్న హనుమంతుడికి అడ్డు తగులుతాయి. దీని అర్థము మనిషిలో ఉండే ఆలోచనలే అతనికి అడ్డు తగులుతాయి అని. తల్లిదండ్రుల ఆలోచనా విధానములో వారికి ఏది సరైదనిపిస్తే, పిల్లలకి కూడా అదే సరైనది అనిపిస్తుంది.

ఉదాహరణకి ఎడమ చేతితో వడ్డించకూడదు. పూర్వ కాలములో ఎడమచేతితో కొన్ని పనులు చేసేవారు కాదు. ముఖ్యముగా భోజనము చెయ్యడం, వడ్డించడం, ఇతరులకి ఏదైనా ఇవ్వడము లాంటి పనులు చేసేవారు కాదు. కానీ ఈనాడు ఎడమ చేతిని అన్ని పనులకు ఉపయోగించరాదు అనే విషయమే తెలియదు.

**కనుక మనకు సాధనలో ముందుకు వెళ్ళడానికి ఏమి అడ్డు తగులుతున్నాయి అంటే జీన్స్.**

### 2. సురస

సముద్రమును దాటుతున్నప్పుడు హనుమంతుని మార్గములో మైనాకుడు తర్వాత అడ్డు తగిలేది – సురస. మన శరీరములో ఒక్కొక్క ఇంద్రియము ఒక్కొక్క దేవత ఆధీనములో ఉంటుంది. ఉదా॥ కళ్ళు. కుడి కన్ను–సూర్యుని ఆధీనములో, ఎడమ కన్ను–చంద్రుని ఆధీనములో, శ్వాస–వాయుదేవుని ఆధీనములో ఉంటాయి. అలాగే మిగతావి కూడా. ఆ దేవతల యొక్క ముఖ్యమైన పని ఏమిటంటే ఆ ఇంద్రియాలు సరిగ్గా పనిచేసేటట్లు చూడటం. అనగా ఆ ఇంద్రియాలను ఉపయోగించి మన చేత పనులను చేయించాలి. అలా చెయ్యడానికి ఆ పనిలో రుచి ఉండాలి. రసము ఉండాలి. కనుక సురస ఎవరు? చేసే పనిలో ఉన్న రుచి, రసం సురస. అందుచేత దేవతలకి తల్లిలాంటిది అయిన సురస హనుమంతుని పరీక్షించడానికి వస్తుంది. ఆమె హనుమంతుని మ్రింగడానికి నోరు తెరుస్తుంది. అప్పుడు హనుమంతుడు తన శరీరమును పెంచుతాడు. ఆవిడ ఇంకా పెద్దగా నోరు తెరుస్తుంది. మారుతి తన శరీరమును ఇంకా పెంచుతాడు. చివరకు మారుతి ఆమె నోటిలోనికి ప్రవేశించి తన శరీరమును అకస్మాత్తుగా తగ్గించి బయటకు వస్తాడు.

**కనుక మనకు సాధనలో ముందుకు వెళ్ళడానికి ఏమి అడ్డు తగులుతున్నాయి అంటే మితిమీరిన కోరికలు.**

ఇక్కడ గమనించవలసినదేమిటంటే మన కోరికలు తగ్గాలని. ఉదాహరణకు మన దగ్గర ఒక వస్తువు ఉంటే, బజారులో దానికన్నా మెరుగైన వస్తువు వస్తే, అది కావాలనిపిస్తుంది. ఇంక దానికి అంతేమున్నది? అంటే మన ఇంద్రియాలు కోరిన వస్తువులని సమకూర్చి వాటిని తృప్తిపరుస్తున్నాము. రామాయణములో అది తప్పు అని చెబుతున్నాడు. కోరికలు ఉండటము తప్పు కాదు. కానీ ఒక హద్దు ఉండాలి. హనుమంతుడు సురస నోటిలోంచి తన శరీరమును తగ్గించి బయటకు వస్తాడు. ఈ సంఘటన కోరికలను అదుపులో ఉంచుకోవాలని తెలియజేస్తుంది.

### 3. సింహిక

సింహిక కూడా హనుమంతుని మార్గములో అడ్డు వస్తుంది. సింహిక ఎవరు? సింహిక మన పూర్వజన్మ ప్రారబ్ధమునకు సంకేతము. ఇది ప్రతి విషయములోను మనిషికి అడ్డు తగులుతుంది. ఉదాహరణకు గురువుల పని చెయ్యడానికి అనేకమంది బయటకు వెళ్తున్నారు. కాని నేను అలా వెళ్ళి పనులు చెయ్యలేకపోతున్నాను అని అంటారు చాలామంది. దీనికి కారణము పూర్వజన్మ వాసనలు అడ్డు తగలటమే. మనిషిలో పూర్వజన్మ సంస్కారాలు ఉంటాయి. ఇవి మనిషి ముందుకు వెళ్ళడానికి లేదా వెనక్కి వెళ్ళడానికి కారణం అవుతాయి.

**కనుక మనకు సాధనలో ముందుకు వెళ్ళడానికి ఏమి అడ్డు తగులుతున్నాయంటే ప్రారబ్ధములు.**

ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుంది

పై మూడు సంఘటనలు మనిషి మూడు అవరోధాలను దాటాలని సూచిస్తాయి. మనము ఎప్పుడైతే ఈ మూడు అవరోధాలను అధిగమిస్తాయో అప్పుడు ఆధ్యాత్మిక జగత్తులోకి అడుగు పెడతాము.

## సాధనకు లక్ష్యం ముఖ్యం

హనుమంతుడు పుట్టిన దగ్గర నుండి దేవతల అనుగ్రహము కలిగినవాడే, సర్వశక్తిమంతుడే, సర్వసమర్థుడే. సాధారణ వ్యక్తి కాదు. చిన్నప్పుడే సూర్యబింబమును మ్రింగటానికి ప్రయత్నిస్తాడు. కాని సాధ్యపడలేదు. రామునితో కలవనంతవరకు అతని శక్తి ఎందుకు పనికిరాలేదు. రామకార్యము చేయనంతవరకు అతని శక్తి ఎందుకు ఉపయోగపడలేదు. రామునితో కలసి తర్వాత రామకార్యము కోసము తన శక్తినంతటిని ఉపయోగిస్తాడు. రాముని శక్తి హనుమంతుని వరించింది. అందుకనే భగవంతుడైన రామునికన్నా, హనుమంతునికి ఎక్కువమంది భక్తులున్నారు. ఈ విషయములో సందేహము లేదు కదా! అయితే ఉపనిషత్తులు చదివినంతమాత్రాన మనకి ఆ శక్తులు వస్తాయా? రావు. ఎందుకంటే అవి మనలను ఎటు వైపుకి తీసుకువెళ్తున్నాయి? అన్నది అంత స్పష్టముగా తెలియదు కనుక. సాధనకు లక్ష్యం ముఖ్యం. దీనికి అనేక ఉదాహరణలు ఉన్నాయి.

ఒక వ్యక్తి బొంబాయికి వస్తూ తన స్నేహితుడికి ఫోన్ చేస్తాడు. ఏమని? నాకు బొంబాయి సరిగ్గా తెలియదు. నువ్వు స్టేషన్‌కి కారు పంపిస్తే నేను నీ దగ్గరకు రాగలను అని. సరే ఆ స్నేహితుడు కారు పంపిస్తాడు. అయితే ఇక్కడ ఒక సమస్య వచ్చింది. కారు నడిపే వ్యక్తికి కారు నడపడమొచ్చు. నియమాలు తెలుసు. అయితే ఈ వచ్చిన వ్యక్తిని ఎక్కడికి తీసుకువెళ్ళాలో మాత్రము తెలియదు. ఎందుకంటే బొంబాయికి వచ్చిన ఈ క్రొత్త వ్యక్తి కారు నడిపే వ్యక్తికి తను ఎక్కడికి వెళ్ళాల్లో చెప్పలేదు. అతను అడుగలేదు. ఇతను కారు ఎక్కి కూర్చున్నాడు. అతను నడుపుతున్నాడు. అలా వెళుతూనే ఉన్నారు. చివరికి పెట్రోలు అయిపోయింది. లక్ష్యం మాత్రము చేరలేదు.

ఇక్కడ కారు ఎక్కాము అంటే మనము పుట్టామని; పెట్రోలు అయిపోయింది అంటే మనము చనిపోయామని అర్థము. డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ కారు నడిపినట్లే మనిషి తన జీవితములో కొన్ని నిబంధనలను పాటించాలి. చిన్నప్పుడు చదువుకోవాలి. తర్వాత ఉద్యోగము సంపాదించాలి. ఆ తర్వాత పెళ్ళి చేసుకోవాలి. అప్పుడు భార్యాబిడ్డలను పోషించాలి. నియమ బద్ధంగా జీవించడానికి ఇదంతా అవసరము. సమాజము ఏర్పరచు కున్నాడు మనిషి. సమాజము ఉన్నది కనుకే మనము మిగతా జంతువులకన్నా పరిణామక్రమంలో తొందరగా ముందుకు వెళ్ళగలుగుతున్నాము. ఎదగగలుగుతున్నాము, సమాజము ఉన్నది కనుకే సరిగ్గా ఎదిగాడు మనిషి. ఇంతచేసి చివరికి మనిషి చనిపోతాడు. ఇల్లు కడతాడు. ఉద్యోగము చేశాడు. పెళ్ళి చేసుకున్నాడు. చివరికి చనిపోయాడు. అయితే ఈ జీవితములో నువ్వు ఎక్కడికి చేరుకున్నావు? ఈ ప్రశ్న కూడా మనకి రాదు. ఆ ప్రశ్నని మనము వేసుకుందాము.

తెలివైనవాడిననుకుంటున్న మనిషి లక్ష్యరహితమైన జీవితం జీవించడము లేదా? మానవ జీవితానికి ఒక లక్ష్యమున్నది. ఆ లక్ష్యమును సాధిస్తే మూడు రకాలైన శక్తులు వస్తాయి. అవి 1) సర్వజ్ఞత్వం 2) సర్వసమర్థత 3) సర్వవ్యాపకత్వం. ఈ విషయాన్ని నేర్చుకునేందుకు కఠోపనిషత్తులోని ప్రథమ అధ్యాయంలోని 7 శ్లోకాలు బాగా ఉపయోగపడతాయి. అందులోని 5వ శ్లోకం మొత్తం ఆధ్యాత్మిక విజ్ఞానానికి పునాది.

## శిష్యుల స్థాయిలు - నచికేతుని విశ్లేషణ

**మంత్రము 5 :**

**బహూనామేమి ప్రథమో బహూనామేమి మధ్యమః ।**
**కిం స్విద్యమస్య కర్తవ్యం యన్మయాద్య కరిష్యతి ॥**

భావము: నచికేతుడు తండ్రి మాట విని ఏకాంతమున ఇట్లు ఆలోచించెను. నేను నా తండ్రికి గల పుత్రులలో, శిష్యులలో, ప్రథముడనై ఉన్నాను. అనేక పుత్రులలో, శిష్యులలో మధ్యముడనై ఉన్నాను. అంతేకాని అథముడుగా మాత్రము లేను. అట్టి గుణవంతుడనైన నన్ను యమునకు ఇచ్చెదనని నా తండ్రి అనుట కోపవశముననే. యమునకు నావలన సిద్ధించు ప్రయోజనమేమి కలదు?

చాలా విషయాలలో నేను ప్రథముడిని, చాలా విషయాలలో నేను మధ్యముడిని, కాని కనిష్ఠుడిని మాత్రము కాదు అని అనుకుంటాడు నచికేతుడు.

ఒక్క ఆధ్యాత్మిక విద్యయే కాదు, ఏ విద్య నేర్చుకున్నప్పటికి కూడా పై వాక్యము ఒక పరీక్ష అవ్వాలి. ఆధ్యాత్మిక జగత్తుకి పునాది ఏమిటంటే గురువు ఏది చెబితే అది చెయ్యడం. గురువుని ప్రశ్నించకూడదు. మీ యొక్క ఇంగితమునుగాని, పని చేయడములో మీ వీలుగాని గురువు దగ్గర ఎత్తకూడదు. ఈ శ్లోకములో మూడు స్థాయిల శిష్యుల గురించి చెబుతున్నాడు.

### 1. ప్రథమస్థాయి

మొదట ప్రథముడి గురించి అనగా మొదటి రకం శిష్యుని గురించి ఏమి చెబుతున్నాడంటే గురువు మనసులో ఏమున్నదో ముందే గ్రహించుకుని, గురువు దాన్ని వాక్కు రూపములో చెప్పకుండానే చెయ్యగలగడము. గురువు తన ఆలోచనలు వాక్కు

**ఏదైనా తెగిందాకా లాగకూడదు**

రూపములో చెప్పకపోయినా గురువుకి ఏది అవసరమౌతుందో అది తెలుసుకొని దానిని చెయ్యాలి. నేను అలాంటివారిలో ప్రథముడిని అని అనుకుంటాడు నచికేతుడు.

### 2. ద్వితీయస్థాయి

మధ్యముడంటే ఎలాంటి వాడంటే – గురువు పని చెప్పాక చెయ్యగలిగేవాడు. నచికేతుడు నేను గురువు ఒక పనిని చెప్పాక ఆ చెప్పిన పనిని చెప్పినట్లే తూ.చా. తప్పకుండా చేస్తాను కనుక నేను మధ్యముడిని అని అనుకుంటాడు.

### 3. తృతీయస్థాయి

మూడవ రకము శిష్యులు ఎవరంటే – గురువు చెప్పినా చెయ్యని వ్యక్తులు. ఇక్కడ ఈ శ్లోకమునుబట్టి మనము ఏ స్థితిలో ఉన్నామో జాగ్రత్తగా అర్థము చేసుకోండి.

కఠోపనిషత్తులో నచికేతునియొక్క సమస్యను అర్థము చేసుకోండి. చాలా వాటిలో నేను మధ్యముడిని, కొన్నిటిలో నేను ప్రథముడిని అని అనుకున్నాడు నచికేతుడు. అంటే ఏమిటి? మధ్యముడు అంటే – చెబితే చేయడము. ప్రథముడు అనగా చెప్పకుండా చెయ్యడము. ఇక్కడ నచికేతుడు తను ఏమైనా తప్పును చేశానా అని తనను తాను విశ్లేషించుకుంటున్నాడు. నచికేతుడుకి తన గురువు (తండ్రి) తనను ఎవరికి దానము ఇస్తున్నాడో ముందుగా తెలియదు. ప్రథముడైన శిష్యుడికి అది ముందుగానే తెలిసుండాలి లేదా ఊహించాలి. వాజశ్రవసుడు పిల్లవానిని యమునికి దానమిస్తానన్నాడు. ఆ విషయము పిల్లవానికి తెలియదు. అందుకని తండ్రిని తనను ఎవరికి దానమిస్తున్నాడో చెప్పమని వెంటబడి అడుగుతాడు. తండ్రి విసిగిపోయి చివరకు నిన్ను యముడికి దానమిస్తాను అని చెబుతాడు.

పూర్వకాలములో చాలావరకు తండ్రే గురువుగా ఉండేవాడు. అప్పుడు ఉపాధ్యాయుడి యొక్క కుమారుడు కూడా శిష్యుడే అవుతాడు గదా! అలాంటి పరిస్థితే వచ్చింది నచికేతుడుకి, వాజశ్రవసుడుకి. అందుచేత ముందు నచికేతుడు ఏడుస్తాడు. ఎందుకు? నేను నా తండ్రిని, గురువుని నన్ను ఎవరికి దాన మిచ్చాడో అడగవలసిన పరిస్థితి వచ్చిందని ఏడుస్తాడు. తండ్రి తనను ఎవరికి దానమిచ్చాడో తెలియదు. తండ్రి ఏమి చెప్పాడు? నేను నిన్ను యముడికి దానమిస్తున్నాను అని చెప్పాడు. గురువు అయిన తండ్రి చెప్పింది చెయ్యాలిగదా! వెంటనే యముడి దగ్గరికి వెళ్ళాలి. నచికేతుడు దానికేమి బాధ పడలేదు. వెంటనే నేను యముని దగ్గరికి వెళతాను, అయితే దీని వలన నాకేమి లాభము? తండ్రి తనను ఎందుకు యముడికి దానమిచ్చాడు? దానివలన అతనికేమి లాభము? అని ఆలోచించాడుగాని విషయము అర్థము కాలేదు. కనుక నేను ఖచ్చితముగా అథముడిని అయినాను అని అనుకుంటాడు.

### హిరణ్యాక్ష, హిరణ్యకశిపుల దృష్టికోణము

ఇక్కడ శిష్యుడి యొక్క బాధ మీకు అర్థము కావాలి. గురు – శిష్య సంబంధము మీకు అర్థము కావాలి. ఆ గురుశిష్య సంబంధాలు మనము ఈనాడు పూర్తిగా మరచిపోయాము. అందుచేత ఈ స్థితిలో మనకు 'హిరణ్యాక్ష, హిరణ్యకశిపుల' స్థితి వస్తుంది. గురువు దగ్గరికి వెళ్ళినా మీకు ఏ దృష్టి వస్తుంది అంటే గురువు డబ్బున్న వాళ్ళని గమనిస్తున్నాడుతప్ప, డబ్బులేనివాళ్ళని చూడటం లేదని. ఇది తప్పు అభిప్రాయము. ఇది హిరణ్యాక్ష దృష్టి.

సత్యసాయిబాబా మీద కూడా ఒక విమర్శ వచ్చింది. ఒక విమర్శకుడు 'భారతదేశములో ప్రజాస్వామ్యమున్నది. కనుక సత్యసాయి అందరిని సమానముగా చూడాలిగాని కొందరికి ప్రాధాన్యమిచ్చి, కొందరిని దూరముగా ఉంచుతున్నాడు, అది తప్పు' అని అన్నాడు. అయితే ప్రజాస్వామ్యములో ప్రజలద్వారా ఎన్నుకోబడిన ముఖ్యమంత్రి మంత్రులందరిని సమానముగా చూస్తున్నాడా? చూడటము లేదు. చూడలేదు కూడా. ఎందుకంటే ఎవరికి ఇచ్చే ప్రాధాన్యత వారికియ్యాలి. ఈ నియమము ఎవరికైనా ఒకటే. మరి సాయిని విమర్శించిన వ్యక్తికి ఈ విషయము మాత్రము స్ఫురణకు రాలేదు. సత్యసాయిని విమర్శించిన వ్యక్తే స్వయముగా ముఖ్యమంత్రి దగ్గరికి వెళ్ళలేదు. మరి అలాంటి వ్యక్తి సత్యసాయిని విమర్శిస్తే; టి.వి. వారు దాన్ని గొప్పగా ప్రచారము చేశారు. అది మన అజ్ఞానానికి సంకేతము కాదా? అది మూర్ఖత్వముకాదా!

సమాజ వ్యవస్థలో ఏ విద్యావిధానము ఉండాలి? ఎలా ఉండాలి? మొదలైన విషయాలనుగురించి చర్చించి, నిర్ణయించేందుకు విద్యాశాఖ మంత్రిగా పెద్దగా చదువుకోనివారిని నియమించవచ్చు. విద్యావ్యవస్థ కూడా ఎందుకు అలాంటి అర్హత లేని వ్యక్తిని నియమించారు? అని ప్రశ్నించదు. ఎదురు చెప్పదు. ఎందుకు ఎదురు చెప్పలేదంటే వారికి అనేకమంది అధికారుల నుండి అనేక ఒత్తిడులు వస్తాయి కనుక. అనర్హుడైనా అతను చెప్పింది వింటారు, ఎదురు ప్రశ్న వెయ్యరు. ఆయన చెప్పింది అమలు జరుపుతారు.

హిరణ్యకశిపుడు తప్పు చేస్తుంటే ఋషులు ఏమి మాట్లాడారు? మౌనంగా ఉన్నారు. ఇక్కడా అంతే. ఎవరైనా వినే వారికి ఏదైన చెప్పగలరుగాని, వినని వారికి ఏమి చెప్పలేరుగా?

ఉపనిషత్తులకి మొత్తము ఆధారమైన ఈ శ్లోకమును ఎవరు అంతగా పట్టించుకోలేదు. గురువులు చెప్పిన పనికి మనము ప్రథములుగా ఉంటున్నామా? మధ్యములుగా ఉంటున్నామా? లేక కనిష్ఠులుగా ఉంటున్నామా? అన్నది గమనించుకోండి.

**భార్యభర్తలు అన్ని విషయాలు ఒకరితో ఒకరు పంచుకోవాలి**

ఒకవేళ గురువు చెప్పిన పని చెయ్యడము మొదలు పెట్టినా; 'ఎలా చెయ్యాలి' అనే అనుమానము వస్తే దానికి జవాబు తర్వాత శ్లోకములో చెబుతున్నాడు.

## గురువు చెప్పిన పని 'ఎలా చెయ్యాలి?'

**మంత్రము 6 :**

**అనుపశ్య యథాపూర్వే ప్రతిపశ్య తథాపరే ।**
**సస్యమివ మర్త్యః పచ్యతే సస్యమివా జాయతే పునః ॥**

**భావము:** *ప్రాచీన పురుషులగు నీ పితామహ ప్రపితామహాదులు ఏ విధముగా వ్యవహరించుచున్నారో దానిని ఆలోచింపుము. నేటి సత్పురుషులు ఏ విధముగా ప్రవర్తించుచున్నారో గమనింపుము. అసత్యము వలన ఎవరును జరామరణములను జయించి శాశ్వతుడై ఉండలేదు. ప్రాచీనులు అసత్యమాడలేదు. నేటి వారును అసత్యమాడుటలేదు. కనుక సత్యమును పాటించి నన్ను యముని వద్దకు పంపుము.*

మీరు ప్రథములుగా ఉండాలన్నా, మధ్యములుగా ఉండాలన్నా ఇదివరకు శిష్యులు వారి గురువులకి ఎలా పని చేశారో తెలియాలి. గురువు–శిష్యుడికి; శిష్యుడు – గురువుకి ఏమి చేయాలనేది కూడా ఈనాటి వారికి తెలియదు. ఒక ఆశ్రమము ఉంటే ఆ ఆశ్రమములో పని చేస్తే గురువుకి సేవ చేస్తున్నట్లేనని, అది సరిపోతుంది అని అనుకుంటున్నారు. ఆశ్రమములో పని చెయ్యండి. దానములు ఇవ్వండి. కానీ అదే గురుసేవ కాదు.

**గురువుకి వ్యక్తిగతముగా సేవ చేయడం, ఆశ్రమంలో సేవ చేయడం గురుసేవ క్రిందికే వస్తాయికాని, అసలు పని పరిణామక్రమానికి అనుగుణ్యంగా గురువు చెప్పిన పనులు చెయ్యడము.**

గురువు ఏమి చెయ్యాలనుకుంటున్నాడు? ఆ పనినెలా చెయ్యాలనుకుంటున్నాడు? అన్నది ప్రథముడిగా ఉన్న శిష్యుడికే తెలుస్తుంది. అందుకే గురువు ఏమి కావాలనుకుంటాడు? అన్నది యమ – నచికేత సంవాదములో తెలుస్తుంది.

## కేవల కుంభక స్థితి

**మంత్రము 7 :**

**వైశ్వానరః ప్రవిశత్యతిథిర్బ్రాహ్మణో గృహాన్ ।**
**తస్యైతాం శాన్తిం కుర్వన్తి హర వైవస్వతోదకమ్ ॥**

భావము: అగ్ని అతిథియగు బ్రాహ్మణరూపమున గృహములను ప్రవేశించును. అర్ఘ్య పాద్యాదులనిచ్చి అతిథిని శాంతింప చేయవలెను. ఈ అతిథిని సత్కరించుటకు జలము తెమ్ము.

ఈ శ్లోకములో నుండి ఒక సాధన చెప్పాను. రాత్రి మీరు నిద్ర పోతున్నప్పుడు మీరు నిజముగానే భావనాత్మకముగా చనిపోండి. కేవల కుంభక స్థితిలో ఉండండి. ప్రాణాయామములో అతి ముఖ్యమైన సాధన ఇదే. అదితప్ప అన్నీ చేస్తారు. సాధనలు ఎన్ని వెఱ్ఱితలలు వేస్తున్నాయో!! ప్రాణాయామములో కుంభకము చాలా ముఖ్యము. అయితే దీన్ని ఒక అనుభవజ్ఞుడైన సాధకుని దగ్గరే నేర్చుకోవాలి. స్వయముగా పుస్తకములు చదివి చేయడం అంత తెలివైన పనికాదు.

**ప్రాణాయామములో సాధించవలసిన స్థితి కేవల కుంభక స్థితి. కేవల కుంభకము అంటే శ్వాస లోపలికి వెళ్ళదు, బయటికి రాదు.**

అయితే రమణమహర్షి ఈ సాధనకు ఒక చిన్న తేలిక విధానమును అభివృద్ధి చేశారు. అదేమిటంటే 'నీ శరీరము, నీ ఇంద్రియాలు సరిగ్గా పనిచేస్తే నువ్వు కేవల కుంభకములోకి వెళతావు. పని చెయ్యకపోతే నిద్ర బాగా పడుతుంది.' అయితే యోగసాధకులు చాలాబాగా నిద్ర పోతారు. యోగుల నిద్రకి, సామాన్య మానవుల నిద్రకి చాలా భేదమున్నది.

రమణమహర్షి చిన్నప్పుడు ఇంకా యోగి కాకముందు, ఆయన స్నేహితులలో ఎవరికైనా ఆయన మీద కోపముంటే ఆయన నిద్ర పోతున్నప్పుడు వచ్చి ఆయనను కొట్టేవారు. అయినా ఆయనకు అది తెలిసేది కాదు. అంత గాఢంగా నిద్ర పోయేవాడు.

కేవలకుంభక సాధనతో మీ కొచ్చే లాభము ఇదే. కనుక రాత్రి పడుకునేటప్పుడు హృదయము మీద దృష్టి ఉంచుకుని మీరు శ్వాసని నియంత్రించేందుకు ప్రయత్నించండి. అభ్యాసము చెయ్యగా చెయ్యగా ఆ స్థితి అదే వస్తుంది. మరణిస్తున్న వ్యక్తి తన సమస్యల గురించి ఆలోచించదుగా! మీరు దాన్ని అభ్యాసములో పెట్టండి. అది ఎలా చెయ్యాలో 7 వ శ్లోకము చెబుతుంది.

## సాధన

**రాత్రి పడుకునేముందు రాగిచెంబులోని నీటిలో తులసి దళము వేసి ఆ నీటిని మీ పడక ప్రక్కనే అందుబాటులో పెట్టుకోండి. నిద్ర పోయేటప్పుడు మీ దృష్టి హృదయం మీద ఉండాలి. తర్వాత మీరు ఆలోచనారహిత స్థితిలో ఉండాలి. చనిపోయిన వ్యక్తి యొక్క మానసికస్థితి రావాలి. ఆ స్థితిలోకి వెళ్ళి నిద్రపోవాలి. మరునాడు మెలకువ రాగానే రాగిచెంబులో ఉన్న నీరు త్రాగండి.**

ఇది ఒక అద్భుతమైన సాధనా విధానము.

*(సశేషం)*

*– డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణగారి ఉపన్యాసముల నుండి*
*సేకరణ: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**భార్యభర్తలు ఒకరికి ఒకరుగా జీవించాలి**

జీవజగత్తు

# చిన్న శరీరంలో దాగి ఉన్న అనన్య గుణసంపద

శరీర ఆకృతి చిన్నదిగా ఉన్నంతమాత్రాన వాటి గొప్పతనం గురించి తేలికగా అంచనా వేయటం పెద్దతప్పు. ఎందుకంటే ఆ చిన్న శరీరాలలో ఎలాంటి గొప్ప గుణాలున్నాయో ఎవరికి తెలుసు? ఉదాహరణకు చీమలనే తీసికొందాము. ఈభూమి మీద అతిచిన్న ప్రాణి అయినప్పటికి వాటి తెలివితేటలు గమనిస్తే మాత్రం ఎంతో ఆశ్చర్యమేస్తుంది, ప్రపంచంలో విశిష్టజీవిగా పేరు గాంచింది. కర్మనిష్టలో, బుద్ధిబలంలో, సామూహిక జీవనశైలివంటి ఎన్నో సద్గుణాలతో పాటు ఎన్నో విచిత్రాలతో కూడిన వాటి ప్రపంచం చూస్తే ఎవరికైన అత్యంత ఆశ్చర్యం కలగక మానదు.

ప్రపంచం మొత్తంమీద సుమారుగా 3500 రకాల చీమల జాతులున్నట్లు కనుగోవటం జరిగింది. చీమలలో శరీరపరంగా తేడాలున్నప్పటికి వాటి ప్రవర్తన, అలవాట్లు ఒకే విధంగా ఉన్నట్లు గమనించుట జరిగింది. ఇవి 1 మి.మీ. నుండి 4 సెం.మీ. వరకు ఉన్నట్లు తేలింది. మనం చూసే గండు చీమలు నల్లగాను, చెట్లు మీద ఉండే ఎర్రచీమలు, చలిచీమలు, చిన్న పురుగులను తినే ఎర్రటి చీమలు, తియ్యటి పదార్థాలు అంటే బెల్లం, పంచదార చూట్టూ మూగే చిన్న నల్లచీమలు మొదలైన జాతులు, ఆహార ఉనికిని గమనించుటలో అసాధారణ శక్తిగలవి. అతిచిన్న శరీరంతో ఉన్నప్పటికి శక్తియుక్తులలో మిగిలిన ప్రాణులతో ఏమాత్రం తీసిపోనివి అని అనుకోవటంలో ఏమాత్రం అతిశయోక్తి కాదు. ఎందుకంటే ఇవి తమ శరీర బరువు కంటే 50 రెట్ల బరువుగల ఆహార పదార్థాలను అవలీలగా ఎత్తుకొనిపోగలిగే సామర్థ్యం కలిగిఉంటాయి. మనిషి తన బరువుతో రెండింతలు మాత్రమే బరువుని ఎత్తగలడు.

చీమల యొక్క అత్యంత సమర్థత్వం, వాటి సామాజిక జీవనశైలి, సముదాయంలో ఒక్కోదానిలో 5 లక్షల చీమల వరకు కలసిమెలసి జీవించుట వలన వీటిని సామాజిక జీవులుగా పేర్కొనవచ్చు. వీటి నివాసం ఎన్నో రకాలుగా ఉండి ఎక్కడైనా తమ ఇంటిని నిర్మించుకోగలవు. ఇళ్ళ పునాదుల్లో, గోడల సందుల్లో, చెట్ల బెరడుల్లో, భూమిలో, రాళ్ళ క్రింద, పడిపోయిన వృక్షాల క్రింద ఇవి నివాసాలను ఏర్పాటు చేసుకొంటాయి. సుప్రసిద్ధమైన ఎర్రచీమలు మాత్రం ఎతైన చెట్లు పైభాగాలలో నివశిస్తాయి. చీమల పిల్లలు (ప్యూపాలు) ద్వారా విడవబడే జిగురు పదార్థాన్ని దారాలుగా అల్లి దగ్గరలోని ఆకులుతో అతికించి తమ నివాసాలను నిర్మించుకొంటాయి. ఆఫ్రికాలో ఉండే దర్జీచీమలు, మన దేశంలో ఉన్న ఎర్రచీమలలో ఒక జాతివి, కాని ఇవి తమ నివాసాలను వృక్షముల కొమ్మలను వంచి అతికించుకోగల సామర్థ్యం గలవి.

వృక్షాల మీద నివసించే నల్ల చీమలు చిన్న కొమ్మలమీద, రెమ్మల మీద పెద్ద పెద్ద గూళ్ళను నిర్మించగలవు. ఈ గూళ్ళను దాదాపుగా 10 మీటర్లు ఎత్తుగల వృక్షాలమీద నిర్మిస్తాయి. వీటిని దూరం నుండి చూస్తే ఇసుకతో నిర్మించినట్లు కన్పిస్తాయిగాని వాస్తవంగా ఇవి ఆకులతోనే నిర్మించబడతాయి. వీటి శరీరం నుండి వెలువడే జిగురు పదార్థంతో వాన నీరు చొరబడని విధంగా తమ గూళ్ళను నిర్మించుకొంటాయి. పక్షుల గూళ్ళలాగా నిర్మించిన వీటిలో తమ జీవితాలు సాగిస్తూ వాటి పిల్లలను క్రూరమైన శత్రు చీమల నుండి రక్షించుకొనుటమేగాక కొన్ని పక్షులకు కూడా ఆశ్రయమిస్తాయి. ఈ పక్షుల వల్ల చీమలకు ఎలాంటి లాభం లేనప్పటికి ఆ పక్షులను ఎందువల్ల తమ గూళ్ళల్లో ఉంచుకొంటాయి అనేది అంతు చిక్కని రహస్యం.

వైజ్ఞానికుల దృష్ట్యా చీమలపుట్టుక దాదాపు 90 కోట్ల సంవత్సరాల నుండి ప్రపంచంలో ఉన్నట్లుగా చెప్తారు. కొన్ని జాతులు (చీమలు) భూమిలోపల విశాల బిలాల్ని నిర్మించి వాటిలో లక్షల కోట్ల సంఖ్యలో నివసిస్తాయి. ఇవి మూడు వర్గాలుగా ఏర్పడి వేరువేరు పనులు చేయుటకు నియమించబడుతాయి. అన్నిటికంటే పెద్ద చీమను రాణి చీమ అంటారు. ఈ రాణి చీమకు కేవలం వేల సంఖ్యలో గుడ్లు పెట్టడమే పని. పిల్ల చీమలు గ్రుడ్లు నుండి బయటకు వచ్చేవరకు రాణి చీమ ఎలాంటి ఆహారం తీసుకోదు. తన శరీరములోని క్రొవ్వుని కరిగింపచేసుకొని శక్తిని పొందుతుంది. ఇది అధిక సమయం వరకు తన నుండి క్రొత్తరాణి చీమలను, బలమైన శ్రామిక చీమలను, ఇతర మగ, ఆడజాతి చీమలను పుట్టిస్తుంది.

చీమల ప్రపంచంలో మగచీమలు కేవలం సంతాన సాఫల్యం కొరకే పరిమితం. రాణి చీమతో సంపర్కం పొందిన పిదప చనిపోతాయి. రాణి చీమ ప్రతిసంవత్సరం వేల, లక్షల సంఖ్యలో గ్రుడ్లు పెడుతుంది. వాటిలో ఆడ చీమలు పెరిగి పెద్దవయి

**భార్యభర్తలలో ఒకరిపై ఒకరు పెత్తనం చెలాయించాలనే ధోరణి కూడదు**

అవికూడా గుడ్లు పెట్టే స్థితికి వస్తే వాటిసంతానంతో ఈ ప్రపంచం అంతా చీమలతో నిండిపోయి ఉండేవి. అలా జరగకుండా ఉండటానికి ప్రకృతి మాత ఒక నియమం విధించింది. ఎలానంటే రాణిచీమ నుండి వెలువడే ఒక రకమైన స్రావం ఆడచీమలు తినగానే సంతానహీనంగా అంటే గ్రుడ్లు పెట్టకుండా (వంధ్యత్వం) అయిపోతాయి. ఆ విధంగా వీటి పుట్టుకమీద ప్రకృతి నియంత్రణ ఏర్పరచుట జరిగింది. ఆడ చీమలు గ్రుడ్లు పెట్టకుండా జీవితాంతం రాణి సేవలో నిమగ్నమై పోతాయి.

చీమల సమాజంలో పిల్లచీమల ఆలన-పాలనతోపాటు, రక్షణ వ్యవస్థ, శ్రమించి పనిచేయుట, అన్ని పనులు ఆడశ్రామిక చీమలు బాధ్యత తీసుకుంటాయి. వీటిలో కొన్ని సంరక్షణ పనులు, మరికొన్ని గూళ్ళను (తమ స్థావరాలను) శుభ్రంగా ఉంచుటకు బాధ్యత తీసుకుంటాయి. రాణి చీమ ఆహారం తీసుకోవాలనుకుంటే శ్రామిక చీమలు ఆహార నిల్వల నుండి అత్యంత శ్రేష్టమైన రుచికరమైన పదార్థాలను ముక్కలు చేసి రాణి చీమకు తినిపిస్తాయి. శ్రామిక చీమలు ముఖ్య కర్తవ్యం ఆహార సంపాదన దానితో పాటు చీమ పిల్లల పోషణ భారం, గ్రుడ్ల నుండి బయటకు వచ్చిన లార్వా - ప్యూపా దశలోని పిల్లలను జాగ్రత్తగా కాపాడుకునే పనికూడా శ్రామిక చీమలు తీసుకొంటాయి. ఈ శ్రామిక చీమలలో పెద్ద తలలతో కూడిన బలమైన చీమలు సైనిక పనులు, గూటి రక్షణ విధులు నిర్వహిస్తాయి. ఏదైనా పెద్ద ఆహారం లభించినప్పుడు చిన్న ముక్కలుగా చేయటంలో సహాయపడతాయి.

చీమలు పాలు ఇచ్చే కొన్ని ప్రాణులను పెంచిపోషిస్తాయి. ఇది వింటానికి విడ్డూరంగా ఉన్నప్పటికి సత్యం ఏమిటనగా ఎపిడస్ అనే ఒకరకమైన తేనె పురుగులను పోషించి వాటి శరీరాలను పిండుట ద్వారా లభించే హనీడ్యూలాంటి తియ్యటి రసాన్ని ఇవి చాలా ఇష్టంగా త్రాగుతాయి. ఏ విధంగానైతే రైతులు ఆవుల పొదుగు నుండి పాలు పిండుతారో ఆ విధంగా ఈ చీమలు ఎపిడస్ తేనే పురుగులను పిండి తియ్యటి రసాన్ని సేకరించు కొంటాయి.

ఎనిటస్ అనే చీమ జాతులు పశ్చిమార్ధగోళం వేడి దేశాలలో నివసిస్తాయి. ఇవి తోటపనిని అంటే తమకు కావలసిన బూజు లాంటి ఆహార పదార్థాన్ని సాగుచేస్తాయి. శ్రామిక చీమలు ఈ తోటపని కొరకు విశేషమైన శ్రమ పూర్తి తన్మయత్వంతో చేస్తాయి. తమ తోట కొరకు పూలలోని పరాగ కణాలను ఎండి చీకిపోయిన పూరేక ముక్కలను సేకరించి తోటలో నింపి, వాటి ద్వారా తయారయ్యే ఒక బూజులాంటి పదార్థాన్ని తమ ఆహారంగా వాడుకొంటాయి.

ఇంతచిన్న ప్రాణుల బుద్ధికుశలతను, కార్యసిద్ధిని, పని తనాన్ని చూసినప్పుడు మానవుడు ఎంతో ఆశ్యర్యానికి లోనుగాక తప్పదు. ఇవి తమ సందేశాలను ఇతర చీమలకు అందించే విధానంలో కూడా ఎంతో అనుభవం సంపాదించాయి. చీమలు తమ శరీరం వెనక భాగం నుండి ఒకరకమైన వాసనగల పదార్థాన్ని విడుదల చేయుటవల్ల, ఆ వాసనను గ్రహించిన ఇతర చీమలు అక్కడ దగ్గరలోనే ఆహారం ఉందనే సంకేతం ద్వారా తెలుసుకొని అక్కడికి చేరపోతాయి. శత్రువుల దాడి విషయంలోకూడా ఎన్నో రకాల సంకేతాల ద్వారా తెలుసుకొని తగిన జాగ్రత్తలు తీసుకొంటాయి. ఒక చీమ రెండో చీమకు ఎదురైనప్పుడు తల భాగంలో ఉన్న ఏంటినాలతో వాసన గ్రహించి గుర్తుపడతాయి.

చీమల గురించి ఉత్సాహకమైన విషయాలు తెలుసు కొన్నప్పటికి, అతి ప్రమాదకరమైన చీమలు గురించి కూడా తెలుసుకొంటేగాని వాటి చరిత్ర సంపూర్ణం కాలేదు. అసిటాన్, డారిలస్ జాతి చీమలు ఇతర చీమలవలె ఇంటిని నిర్మించుటగాని, బిలాలలో నివసించుటగాని చేయవు. ఇవి జీవితాంతం ఆహార సంపాదన కొరకు తిరుగుతాయి. దక్షిణ అమెరికాలో వీటిని సోల్జర్ చీమలు అని, ఆఫ్రికాలో డ్రైవర్ చీమలను అని పిలుస్తారు. కోటానుకోట్ల సంఖ్యలో ఉండే ఇవి యుద్ధదళాలవలె సమూహాలుగా ప్రయాణిస్తూ ఎప్పుడూ వేటాడేలాగా ఉంటాయి. ఎరుపు లేక నలుపు రంగుతో ఉండే ఈ చీమలు దండు బయలు దేరితే వర్షం కురుస్తున్న శబ్దంలాంటి ధ్వనితో వెళుతూ దారిలో ఎదురైయ్యే ఏ వస్తువుని గాని లేక ఏప్రాణినిగాని క్షణాలలో గుటుక్కుమనిపిస్తూ సాగిపోతూ ఉంటాయి.

ఈ చీమల దళాలను ముందువరుసలో ఉండి నడిపిస్తూ మార్గదర్శిక చీమలు ఏదైనా జంతువు జాడను కనిపెడితే, వెంటనే మొత్తం దళం ఆ జంతువుని చుట్టిముట్టి క్షణంలో అస్థిపంజరంగా మార్చి నామరూపాలు లేకుండా చేయగలవు. కోట్ల సంఖ్యలో వస్తున్న ఈ చీమలదండుని చూచి పెద్దజంతువులు సహితం పరుగులు పెడతాయి. మొసళ్ళు, లేక గాయపడి నడవలేని సింహాన్ని కూడా మట్టుపెట్టగలవు. ఆఫ్రికాలోని గ్రామాలవైపు ఈ దండు కదిలితే గ్రామవాసులు, ఇళ్ళను, వస్తువులను వదిలి ప్రాణాలను దక్కించుకోటానికి పరుగులు పెడతారు. పరుగెత్తలేని చిన్నపిల్లలు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు గ్రామాల్లో మిగిలితే అందరిని

**ప్రేమ, నమ్మకం, గౌరవం, చనువు - కుటుంబానికి మూలస్థంభాలు**

భోంచేయటమేగాక, ఇంటిలో నిల్వ ఉంచుకున్న ఏ రకం ధాన్య గింజలు అయినా గింజ మిగలకుండా తినిపోతాయి. కొంతమంది తెలివిగల గ్రామీణులు వానశబ్దం వినగానే చీమలదండు వస్తుందని గమనించి గ్రామానికి నాలుగు ప్రక్కల నిప్పు రగిలించి పెద్ద మంటలు పెడతారు. చీమలదండు మంటను చూసి అటుపోకుండా దారి మార్చుకొన్నప్పుడు గ్రామస్తులు ఊపిరి పీల్చుకుంటారు.

అమెరికాలోని సోల్జర్ చీమలు చిన్న ప్రాణులను మాత్రమే తింటాయి. వీటిని లీజనం చీమలు అనికూడా పిలుస్తారు. ఇవి మధ్య దక్షిణ అమెరికా, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో కూడా కన్పిస్తాయి. వేల సంఖ్యలో సమూహాలుగా రావటం గమనించిన ప్రజలు వెంటనే ఇళ్ళను వదిలి వెళ్ళిపోతారు. ఈ చీమలు ఇళ్ళ లోని ఎలుకలను, బొద్దింకలను, ఇతర పురుగులును తినివేస్తాయి.

ఇతర చీమలవలె వీటిలో ఉన్న రాణి చీమ లక్షలసంఖ్యలో గ్రుడ్లు పెట్టి వాటి ద్వారా పుట్టిన చీమలు త్వరగా పెరిగి దండులో చేరిపోతాయి. రాణి చీమ గ్రుడ్లు పెట్టే సమయానికి ముందు రాణి చీమ తన శరీరం నుండి వెలువడే స్రావాల ద్వారా సుందరమైన నివాసాన్ని నిర్మింపచేసుకుంటుంది. లక్షల సంఖ్యలో ఉన్న చీమలు ఒకదానికొకటి అతి దగ్గరగా అతుక్కుని వంపుగా ఉన్న రాతిబండల క్రింద వ్రేలాడే బంతివంటి ఇంటిని నిర్మించుకొని దానిలోపల నాలుగు ప్రక్కల విశాలమైన దారులుగా నిర్మించి, వాటిలో రాణి చీమలు దర్జాగా పచార్లు చేస్తాయి. గ్రుడ్లు పెట్టి లక్షల సంఖ్యలో చీమలను తయారుచేస్తాయి. ఆ విధంగా లక్షలలో పుట్టి పెరిగే చీమలు ఇతర దళాలతో కలసి ఆహారం అన్వేషణలో సాగిపోతాయి. దారిలో నీటి ప్రవాహం ఎదురైతే ఇవన్నీ బంతిలాగా ఒకదానికొకటి అతుక్కుపోయి. ఆప్రవాహంలో దొర్లుకుంటూ ప్రయాణించి అవలీలగా ఆవలి ఒడ్డుకు చేరుకుంటాయి.

చీమలకు శత్రువులు కూడా తక్కువేమికాదు, బల్లులు, తొండలు, పక్షులు మొదలైన వాటి బారినపడతాయి. అప్పుడు తమను తాము రక్షించుట కొరకు వాటిని కరచి, కుట్టి వాటినుండి తప్పించుకొంటాయి. ఇంకొన్ని చీమలు యాసిడ్ లాంటి విషాన్ని విరజిమ్మి శత్రువుబారినుండి తప్పించుకుంటాయి.

అన్నింటికంటే ముఖ్యమైన చీమల గుణాలు శ్రద్ధతో పని చేయటం, కర్తవ్యదీక్ష, సామాజిక జీవనం, ఐకమత్యం, ఉన్న ఆహారాన్ని పంచుకొని తినటం. ఈ పద్ధతిని చూసి మనిషి ఎంతో వాటినుండి నేర్చుకోవలసి ఉంటుంది. పొట్టనిండా ఆహారం తిన్న చీమ వద్దకు ఆకలిగా ఉన్న చీమ ఎదురై వాసన ద్వారా సైగచేసి ఆహారం కోరితే రెండవది తన దగ్గర నుండి కొంత పదార్థాన్ని ఇచ్చి దాని ఆకలిని తీరుస్తుంది.

అంతులేని తెలివి, జ్ఞానంగల ఈ చిన్నప్రాణి మానవునికి సభ్యత, సువ్యవస్థిత, సామాజిక జీవనం మొదలైన ఎన్నో విషయాలు నోరు విప్పిచెప్పకనే వాటి ఆచరణ విధానం ద్వారా తెలియచెప్తున్నాయి. చిన్న ప్రాణి అయినప్పటికి వీటిమీద ఆ పరమాత్మ ప్రేమ ఏ మాత్రము తక్కువగాదు. వీటినుండి పాఠం నేర్చుకోవాలంటే మనిషికి మొదటి షరతుగా వినమ్రత అవసరం. దీని ద్వారా మాత్రమే ఈ చిన్న ప్రాణి నుండి కూడా మనం ఎంతో కొంత నేర్చుకోగలము.

*– అఖండజ్యోతి, మార్చి 2000*
*అనువాదం : జి. చెన్నకేశవరావు*

## హెన్రీఫోర్డు

*హెన్రీఫోర్డు అమెరికాలోని ఒక చిన్న గ్రామం గ్రీన్‌ఫీల్డులో జన్మించారు. ఆర్థిక పరిస్థితులు బాగోలేనందున 12 సంవత్సరాల వయస్సులోనే నౌకరీ చేస్తూ కుటుంబానికి సహాయపడుతూ రాత్రిపూట పాడైపోయిన ఇంజనులను రిపేరు చేయగా వచ్చిన డబ్బులతో చదువుకొంటూ ఉండేవాడు. ఉద్దేశ్యపూర్వకమైన కార్యక్రమాలతో ఆ కుర్రవాడు ఏర్పరచు కొన్న దినచర్య, దీక్ష అతన్ని ఒక మంచి మెకానిక్ గాను, చక్కని ఇంజనీరుగాను చేశాయి. అంతేగాక మోటార్లు తయారుచేసే కొత్త కార్యక్రమాన్ని కూడా ఇతడు చేపట్టి సాఫల్యాన్ని సాధించాడు. అలాగే నీటి మీద పయనించే మంచి వాహనాన్ని తయారుచేశాడు. అమెరికాలో హెన్రీఫోర్డు యొక్క కార్ఖానా ప్రథమ శ్రేణికి చెందినది. దానిలో 50,000 మంది కార్మికులు పనిచేసేవారు. ప్రతి నిముషానికి ఒక మోటారు వాహనం తయారయేది. శ్రామికుల సౌకర్యం పట్ల ఇతడు చూపే శ్రద్ధ అపూర్వమైనది. జాతి, మత, కుల, లింగ భేదాలు లేకుండా ఫోర్డు ఫౌండేషన్ ద్వారా అనేక పారమార్థిక కార్యక్రమాలు జరుపుతూ సంపాదించిన డబ్బులో అధికశాతం లోక కళ్యాణానికే వినియోగించేవాడు. పూరి గుడిసెలో జన్మించి అతి ఉన్నతమైన సంపదకు అధిపతియైనా, మహాపురుషుడు చలించడు అని నూటికి నూరుపాళ్ళు ఋజువు చేసిన వ్యక్తి హెన్రీఫోర్డు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*
*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

**జీవితంలో పైకి ఎదగాలన్న తపన ఉండాలి**

# మైఖేల్ ఫేరడే - పుస్తకాలను బైండింగ్ చేయుపని నుండి పైకి ఎదిగిన మహావిజ్ఞాని

మైఖేల్ ఫేరడే ఒక పేదవాని పుత్రుడుగా జన్మించిన కారణంగా ప్రారంభంలో పుస్తకాలకు అట్టలు వేసి-బైండింగ్ చేయు దుకాణంలో అతి తక్కువ జీవితం మీద పని చేసేవాడు. బైండింగ్ చేయటానికి వచ్చే పుస్తకాలలో, విజ్ఞానానికి సంబంధించిన వాటిని చదువుకోవటం అతనికి ఎంతో ఇష్టంగా ఉండేది. దొరికిన పుస్తకాల అధ్యయనంలో ఫేరడే మునిగిపోయేవాడు, పుస్తకం పూర్తి అయ్యేంత వరకు వదిలేవాడు కాదు.

ఇప్పుడతనికి నిజమైన జ్ఞానం తెలుసుకోవాలనే కోరిక పెరిగి పోసాగింది. విజ్ఞానాన్ని పూర్తిగా తెలుసుకోవాలనే ఆకాంక్ష అతని హృదయంలో నిలచిపోయింది, కాని దానిని పొందుటకు అతని వద్ద ఎలాంటి సాధనలు కాని, అవకాశాలు కాని లేనందున ఎంతో నిరాశ చెందేవాడు.

ఒకరోజు రాయల్ కెమికల్ సొసైటీలో ప్రఖ్యాతశాస్త్రవేత్త సర్, 'హెమ్ప్రీదేవీ' ఉపన్యాసముందని ప్రకటన వెలువడింది. అందులో ముఖ్యంగా విజ్ఞానానికి సంబంధించిన విషయాల గురించి మాట్లాడతారని తెలిసి ఫేరడే ఎంతో ఆనందంగా ఎంతో గొప్పపేరున్న వైజ్ఞానిక శాస్త్రవేత్త ఉపన్యాసం వినటానికి బయలుదేరి ఒక నోట్ బుక్ పెన్సిల్‌తో ఆయన ఉపన్యాసాన్ని వ్రాసుకొనటానికి వెళ్ళాడు.

'హెమ్ప్రీదేవీ' ఉపన్యాసం ఫేరడేకు ఎంతో నచ్చింది. ఒక్క మాట కూడా వదలకుండా ఆ ఉపన్యాసం మొత్తాన్ని గబ-గబ నోట్ బుక్కులో వ్రాసాడు. దేవీకి తాను వ్రాసిన పుస్తకాన్ని చూపగా, దాన్ని చదివిన దేవీ ఎంతో ఆశ్చర్యానికి లోనైనాడు. ఇంత వేగంగా తాను మాట్లాడిన వైజ్ఞానిక విషయాలను, ఒక్కటి కూడా వదలకుండా వ్రాసిన 'ఫేరడే' ఏకాగ్రత గమనించి, ఇతడు ఎప్పటికైనా మంచి 'జ్ఞాత' అవగలడని విశ్వసించి అతనితో, నీ ఏకాగ్రత, విజ్ఞానం మీద నీకున్న ఉత్సాహం గమనించి నేనెంతో ఆనందిస్తున్నాను... నీవు నానుండి ఏం ఆశిస్తున్నావని అడిగాడు. దానికి జవాబుగా 'వైజ్ఞానిక విషయాల గురించి బాగా అధ్యయనం చేయాలనే కోరికగా ఉందని, తనను శిష్యునిగా స్వీకరించి ప్రయోగశాలలో ఏదైనా పని ఇస్తే, తన జీవితాంతం మీకు ఋణపడి ఉంటానని, ఫేరడే ఆయనకు విన్నవించుకున్నాడు.

దేవీ అతని కోర్కెను మన్నించి తన ప్రయోగశాలలో చేర్చుకొన్నాడు. ఫేరడే తన్మయత్వంతో పనిలో మునిగిపోయి, క్రొత్త-క్రొత్త విజ్ఞాన పుస్తకాలను ఏకాగ్రతతో అధ్యయనంతోపాటు, తన గురువు యొక్క వైజ్ఞానిక ఉపన్యాసాలను వింటూ తనలోని జ్ఞానానికి పదునుపెట్టుకొంటూ తనలోని జ్ఞాన పిపాసను తీర్చుకోగలిగాడు. అతనికి ఇటువంటి గ్రంథాలను పేదరికం కారణంగా అధ్యయనం చేయటానికి అవకాశం ఇప్పటివరకు లభించలేదు. అయితే 'దేవీ' కారణంగా ఇప్పుడు లభించిన ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగపరచుకోగలిగాడు. చాలా మందికి సహజంగా పెద్ద వయసు వచ్చాకనే అధ్యయనంతోపాటు, యోగ్యతలు కూడా లభిస్తాయి కాని ఫేరడేకు ఇంత చిన్న వయసు లోనే ఈ అవకాశం లభించినందున, ఎంతో తన్మయత్వంతో, ఏకాగ్రతతో అధ్యయనం కొనసాగించుటతో, అతని జిజ్ఞాసతో పాటు, బుద్ధి కూడా సంపూర్ణంగా వికసించింది.

అంతేగాక ఒకరోజు అతని జీవితం గొప్ప మలుపు తిరిగే అవకాశం రానే వచ్చింది. ఒకరోజు రాత్రి సమయంలో దేవీ తన ప్రయోగశాలలో ఏదో ద్రావణాన్ని (solution) తయారుచేస్తున్నాడు. దైవయోగం వల్ల ఆయనకు ఏదో పనిబడి బయటకు వెళ్ళవలసి వచ్చింది. కాని ద్రావణాన్ని ఆపకుండా కదుపుతూ ఉంటేనే ప్రయోగం సఫలమవుతుంది. అప్పుడు ఆయన ఫేరడేకు ఈ పని అప్పగిస్తూ 'నేను ఈ ద్రావణంతో ఒక క్రొత్త ప్రయోగం చేయబోతున్నాను, అందుకు దీన్ని చేతితో కదుపుతూ ఉండాలి. నీవు దీనిని నేను వచ్చేంతవరకు కదుపుతూ ఉండు. నేను త్వరగానే వస్తానని చెప్పి, పని అప్పగించి బైటకు వెళ్ళాడు.

ఫేరడే ఆ ద్రావణాన్ని కదిపే పని ప్రారంభించాడు. అయితే గంట సమయం గడచిపోయినా దేవీ తిరిగి రాలేదు. ఇతను ఆయన కొరకు ఎదురుచూస్తూ పనిచేస్తూనే ఉన్నాడు. గంటలు గడచిపోతున్నాయి. ఫేరడే చెయ్యి ఆ సొల్యూషన్‌ని కదుపుతోనే ఉన్నది. నిద్ర ముంచుకు వచ్చినా, పనిలోనే నిమగ్నమై పోయాడు. సమయం గడచిపోతుంది. రాత్రి మొత్తం చూస్తూ ఉండగానే జరిగిపోయింది. ప్రాతఃకాలపు సూర్యోదయపు బంగారు వెలుగు కిరణాలు భూమి మీద పరచుకొనే సమయానికి దేవీ వచ్చాడు. ఆయన తన్మయత్వంతో, ఏకాగ్రతతో పనిచేస్తున్న ఫేరడేని గమనించాడు. తన పనిలో ఏ మాత్రం లోటు రానివ్వకుండా, ఆ ద్రావణాన్ని కదుపటంలో నిమగ్నమై, రాత్రంతా మేలుకొని ఉన్న తన యువ శిష్యుణ్ణి చూసి నిర్ఘాంతపోయాడు. అతనికి

**పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమి లేదు**

విజ్ఞానపరంగా ఉన్న లక్ష్యాన్ని, ఏకాగ్రతను గమనించాడు. తన పని కొరకు శారీరిక బాధను కూడా లెక్కచేయని ఆ కుర్రవాని లక్ష్యాన్ని గమనించిన డేవీ ఎప్పటికైనా ఇతను పైకి ఎదిగి గొప్ప వ్యక్తిగా మారగల గుణం ఉందని, ఇంత శ్రమతో పనిచేయు అతని ఆజ్ఞాపాలన, లగ్నంకాగల, ఉత్సాహంగల మనసున్న వ్యక్తిని ఎందుకు పైకి ఎదిగే అవకాశం కలిగించకూడదని ఆలోచించిన డేవీకి మైఖేల్ ఫేరడే మీద వాత్సల్యం పొంగిపోయింది.

ఆయన ఫేరడేతో 'నీలో విజ్ఞానపరంగా తెలుసుకోవాలనే నిజమైన ఆకాంక్షతోపాటు, లోతైన గురి ఉంది. సంపూర్ణ నిష్ఠతోపాటు లగ్నం-ఉత్సాహం కలగలసి నీలో ఒక అంగంగా మారాయి. ఉత్సాహంతో కష్టపడే నీ గుణం, నిన్ను వైజ్ఞానిక రంగంలో ఏదో ఒక గొప్ప కార్యాన్ని చేయుటకు పురిగొల్పగలదు. దృఢ సంకల్పంతో నీవు ఏదో ఒక రోజు ఉన్నత శిఖరాలను తప్పక అందుకోగలవు. నా నుండి కొద్ది-కొద్దిగా విజ్ఞానాన్ని తెలుసుకొంటూ ఉండు. నేను నిన్ను ఉన్నత శిఖరాలను అందుకొన్న వైజ్ఞానికుల సరసన చూడదలచుకొన్నాను అని చెప్పాడు.

ఫేరడేకు తన చిరకాల వాంఛ తీరుతున్నందుకు ఎంతో సంతోషించాడు. ఆయన ఫేరడేకు అన్నింటిని విజ్ఞానపరంగా బోధించుట జరిగింది. ఫేరడే ఎంతో ఉత్సాహంగా, తన్మయత్వంతో విజ్ఞానగ్రంథాలను ఏకాగ్రతతో మథించాడు. తన శక్తి మొత్తాన్ని దీనిలోనే వినియోగించాడు. దాంతో ఆశ్చర్యజనకమైన ఎన్నో యోగ్యతలను ప్రాప్తించుకోగలిగి, చివరకు తన పరిశ్రమతో బహుమూల్య పరిణామాలను బయటకు తీయగలిగాడు.

అందులో కొన్ని-డైనమో ద్వారా కరెంట్‌ను ఉత్పత్తి చేయగలిగాడు. అయస్కాంత శక్తితో విద్యుత్‌ని కనుగొనటమే గాక, అందుకనుగుణ్యమైన సిద్ధాంతాలను, ఎలక్ట్రానిక్స్ నియమాలను తెలుసుకొని మొదటిసారిగా విద్యుత్ బల్బుని వెలిగించి చూపించ గలిగాడు. రసాయన శాస్త్రంలో, భౌతిక శాస్త్రంలో రెండింటిలో కూడా ఇప్పటికీ ఫేరడేను గౌరవపూర్వకంగా స్మరించుకొంటూ ఉంటారు.

ఒకప్పుడు పుస్తకాలకు అట్టలతో బైండింగ్ పనిచేయు వ్యక్తి తరువాత ఉన్నతమైన వైజ్ఞానికుడు అయ్యాడు. ఉత్సాహపూర్వక కార్యాన్ని ఎవరు ప్రారంభించినా, వారు చివరకు ఉత్తమ ఫలాన్ని తప్పక అందుకోగలరు.

*- పూజ్యగురుదేవుల వాఙ్మయం 57 నుండి*
*అనువాదం: జి. చెన్నకేశవరావు*

---

## సాదా జీవనం - ఉన్నత ఆలోచనలు

*కాబా (మక్కాయందలి ఒక పవిత్ర స్థానం) ప్రాంతము నుండి ఒక ఫకీరు తన కొరకు ఒక ఆశ్రమాన్ని నిర్మించుకొనుటకై కావలసిన ధనాన్ని సేకరించుటకు బయలుదేరాడు. యాత్ర చేస్తూ చేస్తూ ఒకరోజు అతడు రాబియా ఇంటికి చేరుకున్నాడు. రాబియా ఫకీరుకు స్వాగత సత్కారాలు చేసింది. తన చేతితో వంటచేసి ఫకీరుకు తినిపించింది. ఫకీరు నిద్రించుటకై చెక్క మంచంపై పరుపు, కంబళి పరచి, తాను నేలపై ఒక దుప్పటి పరచుకొని నిద్రించింది. ఫకీరుగారికి పరుపుపై నిద్ర పట్టలేదు. కారణం అతనికి మెత్తటి పరుపుపై నిద్రించుట ఇదే మొదటిసారి. కాని దీనికి భిన్నంగా రాబియా నిద్రకు ఉపక్రమించగానే గాఢనిద్రలోనికి జారుకుంది. ఫకీరు రాత్రంతా పక్క మీద నిద్రపట్టక దొర్లుతూ ఉన్నాడు. కానీ రాబియాకు నేలపై పడుకున్నా నిద్ర ఎలా పట్టింది? అనే ఆలోచనలో పడ్డాడు. తెల్లవారగానే రాబియాను అదే ప్రశ్నించాడు. రాబియా ఇట్లు జవాబిచ్చింది "మహాత్మా! నా ఈ చిన్న కుటీరం నాకు మహలులా కన్పిస్తుంది. నా కుటీరంలో రోజూ ఒక్క భక్తుడైనా భోజనం చేస్తే గొప్ప అదృష్టంగా భావిస్తాను. నాకు నిద్రపట్టగానే, నేను పరుపుపై పడుకున్నానా లేక దుప్పటి పరచుకొని పడుకున్నానా? అనేది నాకు తలంపునకు రాదు. నేను పగలంతా సత్కర్మల గురించి స్మరిస్తాను, రాత్రి విశ్రాంతిగా నిద్రిస్తాను. ఫకీరు తన ప్రయాణానికి సిద్ధం కాగానే రాబియా ఇట్లన్నది "నేను కూడా ధన సేకరణకై మీ వెంట రానా?" అప్పుడు ఫకీరుకు జ్ఞానోదయమై ఇలా చెప్పాడు "ప్రపంచంలో సుఖం ఎక్కడ ఉన్నదో నాకు తెలియజేశావు. ఇప్పుడు నాకు ఏ ఆశ్రమంతో పనిలేదు, అవసరం కూడా లేదు." ఫకీరు కాబాకు తిరిగి వెళ్ళి తన వద్ద ప్రోగుబడిన ధనాన్ని పేదలకు పంచి, ఒక చిన్న కుటీరాన్ని నిర్మించుకొని ప్రశాంతంగా నివసించసాగాడు.*

*- అఖండజ్యోతి మార్చి, 2013*
*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**సహనం ఎదుగుదలకు ఆలంబన**



## ఆదిశక్తి యొక్క లీలాకథలు - 36

# సాధకునిలో అంతర్వివేకము ఎప్పుడు జాగృతము కాగలదు?

ఆదిశక్తి లీలాకథలోని పంక్తులు కర్మశృంఖలాలకు సంబంధించిన రహస్యములను బహిర్గతము చేస్తాయి. జీవనమనే వనములో భ్రమతో కొట్టుమిట్టాడుతూ తిరుగుతూ ఉండే జీవుడు ఈ కర్మశృంఖలాలతోనే బంధించబడుతున్నాడు. పశుపక్ష్యాదులు మొదలుకొని క్రిమికీటకాల యోనులలోనో లేదా దేవ, దానవ, గంధర్వ, యక్ష, రాక్షస యోనులలో ఎప్పుడైనా సరే జన్మించడమనేది జీవుని కర్మపాశముతోనే ముడిపడి ఉంటుంది. ఈ విధముగా లక్షోపలక్షల యోనులలో భ్రమిస్తూ వెదుకులాడుతూ తిరగటం మినహా జీవునకు లభ్యమయ్యేదేదీ ఉండదు. ఈవిధమైన వెదుకులాటలన్నీ నశించిపోగల అవకాశము ఒక్క మానవజన్మకు మాత్రమే లభిస్తుంది. దుర్లభమైన ఈ మానవ జీవితములో మానవుడు ఆదిశక్తియైన మహామాయను పిలవడము నేర్చుకొని, 'అమ్మా! అమ్మా!' అని కనుక పిలిస్తే మానవ జీవితము మోక్షమునకు మహాద్వారంగా తయారౌతుంది. అయితే ఇదంతా జరగటము అంత తేలికైన పనికాదు. ఇక్కడ నేను-నాది-నీది అనే తేడా అతడి అంతరంగమును ముక్కలుచేస్తూ ఉంటుంది. అతడి ఆలోచనలు పదే పదే మోహమనే బురదలో కూరుకుపోతూ ఉంటాయి. మోహమనే బురదలో చిక్కుకుపోయి, అతడు ఈ మానవ జీవితమనే సదవకాశమును మాటిమాటికీ చేజార్చు కుంటున్నాడు.

ఈ మోహం అతడిని సద్గురువు నుండి, లీలామయి అయిన అమ్మ నుండి వేరుచేస్తుందన్న విషయము తెలుసుకున్నప్పుడు ఎంతో ఆశ్చర్యము కలుగుతుంది. సద్గురువు యొక్క సన్నిధిలో కూడా అతని ప్రాపంచిక వాంఛలు నశించవు. గురుధామంలో కూడా ప్రాపంచిక విషయవాసనలు అతడిని పట్టి పీడిస్తాయి. బాంధవ్య బంధనములు పదే పదే అతడి ఆలోచనా చేతనత్వమును భ్రమింపజేస్తాయి. అటు ఇటు తిరుగాడజేస్తాయి. ఈ క్రమములో అతడు తన సద్గురువు నుండి కూడా విముఖుడు అవుతాడు. ఎల్లప్పుడూ తన పట్ల దయామృతమును వర్షింపజేసే సద్గురువు అతడికి పరాయివానిగాను, ఎప్పటికీ తనది కానటువంటి ఈ ప్రపంచము అతడికి సర్వస్వముగాను కనిపిస్తాయి. ఈ విధమైన వ్యతిరేకత (తారుమారు) అతడిని నిరంతరము భ్రమింపజేస్తూ, అటు-ఇటూ వెదుకులాడుతూ తిరిగేవిధంగా తయారుచేస్తుంది. ప్రతి జన్మలో దానికి సంబంధించిన జీవితములోను, భ్రమతో కూడిన ఈ వెదుకులాట అతనిని వదిలిపెట్టదు.

మహారాజు సురథుడు ప్రస్తుతము ఈ స్థితిని ఎదుర్కొన వలసిన పరిస్థితి కలిగిందని ఆదిశక్తి యొక్క లీలాగాథ మనకు తెలియజేస్తున్నది. మమతాబద్ధుడైన సురథమహారాజు 'ఇంతకు పూర్వము పూర్వీకులు పరిపాలించిన నగరములో ఈనాడు నేను' లేనే అని ఆలోచిస్తున్నాడు. ఇటువంటి ఆలోచనల కారణముగా మేధా ఋషి ఆశ్రమములోని పవిత్రమైన అనుభూతిని కూడా అతడు పొందలేకపోతున్నాడు. ఆయన ఆలోచనలు, మనస్సు, చేతనత్వము మొదలైనవన్నీ మోహమనే మబ్బులతో కమ్మి వేయబడినాయి. వాస్తవానికి ప్రాపంచికత, ఆధ్యాత్మికత అనేవి కేవలము భావనల యొక్క దిశను అనుసరించి తమ రూపురేఖలను ఏర్పరచుకుంటాయి. భావనల ప్రపంచము, ప్రపంచ సంబంధిత విషయములతో బంధించబడినప్పుడు, ప్రపంచము, ప్రాపంచిక విషయములు ఆ భావనలను వాసనలుగా(తీవ్రమైన ఆకాంక్షలుగా) మార్చివేస్తాయి. అలాకాక, అవే ఆలోచనలు భగవతియైన మహామాయతో తమ సంబంధమును స్థాపించుకొనగలిగితే వాటికి 'భక్తి' అనే స్థాయి లభిస్తుంది.

తమ భావనలను 'వాసన లేదా భక్తి' క్రింద మార్చుకొన వలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉన్నది. చాలామంది వ్యక్తులు తాము చూడకపోవటము మాట అటుంచి, కనీసము తమ తల్లిదండ్రులు కూడా చూడనటువంటి పూర్వీకులతో సంబంధమును ఏర్పరచుకుంటూ ఉంటారు అనే విషయము ఎంతో ఆశ్చర్యమును కలుగజేస్తుంది. తాతముత్తాతలు, ఇంకా వారి తాతముత్తాతల గురించి కూడా రోజుకు ఎన్నోమార్లు ఘనంగా చెప్పుకుంటూ ఉంటారు. వారితోటి తమ సంబంధ బాంధవ్యములను, దగ్గరి తనమును అతిశయముగా వర్ణిస్తుంటారు. 'మా ముత్తాతగారి ముత్తాతగారికి కూడా ఇంతే పేరు ప్రఖ్యాతలుండేవి' అని పదే పదే చెప్పుకొనడము ద్వారా వారి మనస్సు పులకికాంకితమౌతూ ఉంటుంది. కానీ ఎవరి గర్భమునుండి ఆత్మ జన్మించినదో ఆ లీలామయియైన ఆదిశక్తి మాత యొక్క స్మృతి మన భావనలలో

**అసహనం అభివృద్ధికి అవరోధం**

ఎటువంటి పులకింతను ఎప్పుడూ కలుగజేయదు. మన ఆలోచనలు ఎన్నడూ ఆర్ద్రము కావు. ఇది ఎంతో విచిత్రమైన వైరుధ్యము కాక మరేమిటి? వేలకొలది, లక్షలకొలది దెబ్బలు తిన్నప్పటికీ ప్రపంచములోనుండి 'నాది' అనే భావన నశించడం లేదు. అలాగే మాటిమాటికీ ఎన్నోసార్లు విపత్తు తాలూకు వేదనల బారినుండి రక్షణ ప్రసాదించే భవానీమాత గురించిన ఆలోచనలు ఏనాడు మన హృదయములను ఆకట్టుకొనవు. ఇది మానవుని దౌర్భాగ్యము కాక మరేమిటి? ఇటువంటి దారుణమైన దౌర్భాగ్యములో పూర్తిగా మునిగిపోయి ఉన్న సురథమహారాజు గారు ఇంకా ఏమి ఆలోచిస్తున్నారనేది ఆదిశక్తి లీలాకథ యొక్క తరువాత శ్లోకములో వర్ణించబడుతున్నది.

**మద్భృత్త్యైస్తైరసద్వృత్తైర్ధర్మతః పాల్యతే న వా ।**
**న జానే స ప్రధానో మే శూరహస్తీ సదామదః॥(1/1/13)**

**అర్థము:** 'నేను లేనటువంటి నా నగరమును దురాచారులైన నా సేవకగణము ధర్మపూర్వకముగా పాలిస్తూ రక్షిస్తూ ఉన్నదో? లేదో? ఎల్లప్పుడు మదధారలను వర్షించే పరాక్రమశాలియైన నా ఏనుగు ఇప్పుడు ఎట్లా ఉన్నదో?'

ఆదిశక్తి లీలాకథ యొక్క ఈ శ్లోకమంత్రం కేవలము సాధకుని జీవన చేతనత్వమునకు సంబంధించిన కథ. ప్రపంచము, ప్రాపంచికమైన గాయాలు, వాటిద్వారా కలిగే ఆఘాత-ప్రతిఘాతాలు మనిషి మనస్సులో క్షణకాలముపాటు వైరాగ్యమును కలుగ జేస్తాయి, ప్రపంచమన్నా, ప్రాపంచికమైన విషయములన్నా విరక్తి కలుగుతుంది. దీనిని తొలగించుకొనటానికి మనస్సు వికలము అవుతుంది. ఈ వేదనలో ప్రపంచమును వదిలివేయాలనే ప్రయత్నము చెయ్యాలనికూడా అనిపిస్తుంది. కానీ కొంచెము సేపటి తరువాత తిరిగి శాంతి ఏర్పడుతుంది. తన జీవితములోని గడచిన రోజులు అతనికి గుర్తుకొస్తాయి. పదే పదే వాటిని గురించి ఆలోచిస్తూ వానిలోనే తన భావనలను రమింపజేస్తూ సంతృప్తి చెందుతూ ఉంటాడు. అతని యొక్క ఈవిధమైన ఆలోచనా విధానము అతనిని జీవన సాధనా మార్గములో అడుగుకూడా ముందుకు సాగనీయదు.

అంతరంగములో ఇటువంటి మానసిక స్థితిని క్షణకాలము సేపైనా ఉండనీయని మహనీయులనే సంత్‌లని, సాధువులని, తపస్వులని అంటారు. కొన్ని దశాబ్దముల క్రిందట చిత్ర కూటములో, జానకీ శరణదాసు అనే మహాత్ముడు జీవించేవారు. ఆయన సార్థక నామధేయులు. నిజముగా ఆయన జీవితమంతా జానకీమాతను శరణువేడటంలోనే గడిపారు. ఆయన పనులే కాదు, ఆలోచనలు, భావనలు అన్నీకూడా జానకీమాత యొక్క ధ్యానములోనే కలసి ఉండేవి. సాధువు కాకముందు ఆయన గొప్ప ధనవంతులైన కుటుంబమునకు చెందినవారు. అప్పుడప్పుడు కుటుంబసభ్యులు ఆయనను కలవటానికి వచ్చేవారు. వారితో కూడా ఆయన ఇతరులవలెనే వ్యవహరించేవారు. ఎవ్వరివద్దా ఏమీ తీసుకోకూడదనేది ఆయన నియమము. అదే నియమమును తన కుటుంబ సభ్యులపట్లకూడా పాటించేవారు, కాబట్టి వారు ఏమైనా తీసుకువచ్చినా నిరాకరించేవారు. ఒకసారి ఎవరో ఒక వ్యక్తి 'స్వామీ? మీకు ఎప్పుడు ఎవరు జ్ఞాపకము రారా?' అని ఆయనను ప్రశ్నించాడు. అప్పుడు ఆయన బదులుగా చిన్న నవ్వు నవ్వి ఊరుకున్నారు. పదే పదే అడిగిన తరువాత ఆయన ఈ క్రింది విధముగా జవాబు చెప్పారు.

'సంబంధాలు, సాహచర్యాల తాలూకు అనుభూతుల ఫలితముగా జ్ఞాపకము అనేది ఏర్పడుతుంది. ఏదైనా సంఘటన లేదా ఎవరైనా ఒక వ్యక్తి మన భావనలలో స్పందన కలిగిస్తే సహజముగానే తత్సంబంధమైన స్మృతి ఏర్పడుతుంది. ఆ జ్ఞాపకం అప్పుడప్పుడు మదిలో మెదులుతూ ఉంటుంది. నాకు సంబంధించి నంతవరకు, నా భావనల తాలూకు అనుభూతులన్నీ ఆ తల్లియైన జానకీదేవివరకే పరిమితమై ఉంటాయి. అందుచేత నా జ్ఞాపకములలో కూడా ఆమెతప్ప వేరెవ్వరికీ స్థానము లేదు.' భావనాత్మకమైన ఈ స్థితి భక్తుడిని ఈ ప్రపంచము, ప్రాపంచికత నుండి కాపాడుతుంది. ఆదిశక్తి లీలాగాథకు చెందిన ఈ శ్లోక మంత్రములో ఆధ్యాత్మిక భావనలతోపాటు, దీనియొక్క మంత్ర పరమైన సత్యము కూడా ఇమిడి ఉన్నది. అది క్రిందన ఇవ్వబడు తున్నది.

### సాధనా విధానము

**వినియోగః: ఓం అస్య శ్రీ 'మద్-భృత్త్యైస్తై' ఇతి సప్తశతీ త్రయోదశ మన్త్రస్య శ్రీబ్రహ్మా ఋషిః, శ్రీమహాకాళీదేవతా, స్త్రీం బీజం, శాకినీశక్తిః, ధూమామహావిద్యా, రజోగుణః, త్వక్ జ్ఞానేన్ద్రియం, గాంభీర్య రసః, గుద కర్మేన్ద్రియం, గమ్భీర స్వరం, జలతత్త్వం, నివృత్తి కళా, ఘూం ఉత్కీలనం, మత్స్య ముద్రా, మమ జ్ఞానభక్తి వైరాగ్య క్షేమస్థైర్యాయురారోగ్యాభివృద్ధ్యర్థం శ్రీఆదిశక్తి మాతా గాయత్రీ మాతా రూపేణ యోగమాయా భగవతీ శ్రీమహాదుర్గా ప్రసాదసిద్ధ్యర్థం చ నమోయుత ప్రణవ-వాగ్బీజ-స్వబీజ-లోమ-విలోమ పుటితోక్త త్రయోదశ మన్త్రజపే వినియోగః॥**

**అత్యాశకు పోయి అహర్నిశలు సంపాదన కొరకు పాకులాడకూడదు**

## న్యాసః

కరన్యాసః షడంగన్యాసః

ఓం ఏం స్త్రీం అంగుష్ఠాభ్యాం నమః హృదయాయనమః

నమో నమః తర్జనీభ్యాం నమః శిరసేస్వాహా

మద్ భృత్యైస్తైరసద్వృత్తైః మధ్యమాభ్యాంనమః శిఖాయైవషట్

ధర్మతః పాల్యతే నవా అనామికాభ్యాంనమః కవచాయహుమ్

నజానే స ప్రధానో మే కనిష్ఠికాభ్యాంనమః నేత్రత్రయాయవౌషట్

శూరహస్తీ సదామదః కర-తలకరపృష్ఠాభ్యాంనమః అస్త్రాయఫట్

## ధ్యానం

ధూమ్రాభాం ధూమ్ర-వస్త్రాం ప్రకటిత
ముక్తా బాలాంబరాఢ్యామ్ ।
కాకణ్ఢ స్పందనస్థాం ధవళకరయుగాం
శూర్పహస్తా తిరుక్షామ్ ।
నిత్యం క్షుక్షామ్-దేహాం రజత-
రజ యుతామన్తరశ్యాన్త చిత్తామ్ ।
ధ్యాయేద్ ధూమావతీం వామనయన
యుగళాం భీతిదాం భీషణాస్యామ్ ॥

## మంత్రం

ఓం ఏం స్త్రీం నమః
మద్భృత్యైస్తైరసద్వృత్తైర్ధర్మతః పాల్యతే నవా ।
న జానే స ప్రధానో మే శూరహస్తీ సదామదః ॥
నమో స్త్రీం ఏం ఓం ॥ 13 ॥
**1000 జపాత్ సిద్ధిః - సర్షప్ (ఆవాలు)-తిలైశ్చ హోమః ।**

అనగా ఆవాలు-నువ్వులు కలిపి హోమము చేయవలెను.

గాయత్రీమహామంత్ర జప - 10,000, గాయత్రీ విధానేన దశాంశ హోమః ॥

గాయత్రీమహామంత్ర జపము 10,000 చేయాలి. అందులో పదవవంతు గాయత్రీ విధివిధానముతో హోమము చేయాలి.

10 మాలలు గాయత్రి చేసి ఒక మాల సప్తశతీమంత్రం చేయాలి. ఈ విధంగా పదిరోజులు చేయవలెను. తరువాత దశాంశ హవనము చేయాలి.

**దీనికి ఆధ్యాత్మిక ఫలశృతి:** మోహ సంస్కారమునకు చెందిన అంతర్జ్ఞానం కలుగుతుంది.

**లౌకిక ఫలితము:** భావనాత్మకమైన బాధలకు ఉపశమనము.

గాయత్రీమంత్రముతో పాటు ఈ సప్తశతీమంత్రమును సాధన చెయ్యడముద్వారా సాధకునిలో అంతర్వివేకము ఉదయిస్తుంది. ఏ ఆలోచనలు, సంస్కారములు, వికారములు తనను ఈ ప్రపంచములో పట్టి బంధిస్తున్నాయో, వాటిని గురించిన జ్ఞానము అతనికి కలుగుతుంది. మనస్సు పదే పదే ప్రాపంచిక విషయముల వైపు ఆకర్షించబడుతున్నదని అతడు తెలుసుకుంటాడు. సాధకునికి వీటి గురించిన జ్ఞానము అవగతమైతే, భవానీమాత కృప వలన వీటిని తొలగించుకొనగలడు. గాయత్రీమంత్రముతోపాటు ఈ సప్తశతీమంత్ర సాధనను నిరంతరము క్రమము తప్పకుండా చేసినచో దాని ప్రభావము చేత సాధకునికి భావనాత్మకమైన బాధల నుండి విముక్తి కలుగుతుంది. ఫలితముగా అతనికి సహజముగానే సంతోషము లభిస్తుంది. విధివిధానమైన సాధనను చేస్తూ ఉండాలి. అలా చేసిన వ్యక్తి సహజముగానే పులకిత హృదయముతో సుఖ శాంతులతో మనగలడు.

*- అఖండజ్యోతి, జనవరి 2010*
*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

## శ్రద్ధాంజలి



**శ్రీమతి ధారా భవానీ దేవి**

**జననం: 04.09.1947; మరణం: 14.05.2013**

*శ్రీమతి ధారా భవానీదేవి గాయత్రీ పరివార్ ప్రముఖ కార్యకర్త 14.05.2013న పరమపదించారు. గాయత్రీ పరివార్ కార్యక్రమాలతో పాటు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణగారి ఆదేశానుసారం లలితా సహస్రనామ పారాయణలు, పూర్ణాహుతిగా గాయత్రీ లలితా మహా యజ్ఞములు చేయిస్తుండే వారు. వేదికలను, దేవి విగ్రహాలను అలంకరింపచేయుటలోను వీరిది అందెవేసిన చెయ్యి. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము.*

**- గాయత్రీ చేతనా కేంద్రము, హైదరాబాద్**

**ఉన్నంతలో ప్రశాంతంగా జీవించడం అలవరచుకోవాలి**

మెస్మరిజం-1

# మెస్మరిజం అంటే ఏమిటి? మెస్మరిజం మరియు యోగం

మెస్మరిజం, హిప్నటిజం అనేవి ఒకే విద్య యొక్క రెండు పేర్లా? కానీ వీటి అర్థములలోను, పద్ధతులలోను పరిపూర్ణమైన తేడా కనిపిస్తుంది. మెస్మరిజంను హిందీలో 'ప్రాణప్రయోగమని', హిప్నటిజంను 'మోహినీవిద్య' అని అంటారు. మెస్మరిజంను ప్రయోగించేటప్పుడు చేతులతో చేసే క్రియను స్థిరంగా ఉంచి, దృష్టిని శాంతంగా ఉంచుకోవాలి. అప్పుడు నిద్రను తెప్పించవచ్చు. కానీ హిప్నటిజంలో సూచనల ద్వారా రోగిని నిద్రలోకి పంపుతారు. ప్రపంచంలో దాదాపు 150 సంవత్సరాల నుండి ఈ విద్య ప్రాచుర్యంలో ఉంది. కానీ వాస్తవానికి ఈ విద్యకు ఆధారమైనది ప్రాచీన భారతదేశంలోని యోగవిద్యయే. ప్రపంచంలోని ఆశ్చర్యకరమైన విద్యలన్నింటికి ఇది తల్లివంటిది. ఆర్యులు మరియు వారి వంశస్తులు యోగవిద్యను గురించి సంపూర్ణంగా తెలుసుకున్నవారు కనుకనే యోగవిద్యలన్నింటికి భారతదేశమే మూలస్థానమైనది. భారతదేశం నుండి ఈ విద్య ముందుగా అరబ్ దేశాలకు, తరువాత ఇరాన్, యూరప్, గ్రీక్, రోమ్ దేశాలన్నింటికీ వ్యాపించి కాలాంతరంలో ప్రపంచంలోని నలుమూలలకు విస్తరించింది.

విషయాన్ని లోతుగా పరిశీలిస్తే రకరకాల మార్పులు చేర్పుల తరువాత ఇప్పుడు మెస్మరిజంగా పిలువబడుతున్న ఈ విద్యను మన పూర్వీకులు తమ కాలంలో 'యోగం' అని పిలిచేవారంటే అందులో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. కారణమేమంటే మెస్మరిజం, హిప్నటిజం రెండూ యోగవిద్యలోని భాగాలే. సాధువులు, మహాత్ములు, పైగంబరులు మొదలైనవారంతా ఎన్నో చమత్కారాలు చేసేవారని ప్రపంచంలోని ధర్మశాస్త్రాలన్నింటిలోను చెప్పబడింది. వాటిని మనమంతా చదువుతున్నాము. నిజానికి అవి అన్నీ యోగపరమైన చమత్కారాలేనని తెలుస్తున్నది. వారిని చూసినవారు, వారి చమత్కారాలను అనుభూతి పొందిన వారంతా వారిని ఒక్కోసారి మాయగాడని (ఇంద్రజాలికుడు), ఒక్కోసారి యోగులు అని, మరోసారి మెస్మరిజం చేశారని చెప్పుకునేవారు. వారు ఆ విధంగా ప్రసిద్ధి పొందారు. మన యొక్క సాధువులు, మహాత్ములు అందరు యోగరూపమైన మెస్మరిజంను తెలిసినవారే. దీని సహాయంతోనే వారు ఏ సమయంలోనైనా కేవలం చేతి స్పర్శతోనే కఠినాతికఠినమైన రోగాలనుండి కూడా రోగులకు విముక్తి కల్పించగలిగేవారు. ఇప్పటికీ ఇలాంటి అనేక సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. హిందూ ధర్మశాస్త్రంలోను, ధార్మిక ఇతిహాసాలలోను ఇందుకు సంబంధించిన అనేక ఉదాహరణలు ఉన్నాయి. క్రైస్ట్ వేలమంది రోగులకు తన చేతితో రోగవిముక్తి ప్రసాదించాడని, కళ్ళు లేనివారికి కళ్ళు తెప్పించాడని బైబిల్‌లో చెప్పబడి ఉంది. ఈ దృష్టాంతాలన్నీ ఈ విద్యను సమర్థిస్తున్నాయి. పార్శీమతంలోని పైగంబర్ జరయుస్త్ ఈ విద్యను బాగా తెలిసినవాడు. హిందూ ఇతిహాసంలో ఉన్న వేలాది ఉదాహరణల్లో ఒక భస్మాసురుడి ఉదాహరణను గమనిస్తే కనుక మనకు యోగం మరియు మెస్మరిజం ఒకదానిపై మరొకటి ఎలా ఆధారపడతాయో తెలియడమే కాక సందేహాలన్నీ తీరిపోతాయి. భస్మాసురుడు తపస్సు చేసి తాను ఎవరి తలపై చేయిపెడితే వారు తక్షణమే భస్మమైపోవాలని శివుడి నుండి వరాన్ని కోరుకున్నాడు. ఆ తరువాత భస్మాసురుడు సృష్టించిన ఉత్పాతం వల్ల నిర్దోషులైన మానవులెంతమందో భస్మీపటలమైపోయారు. దైవీశక్తి సంపన్నులైన దేవతలు కూడా రక్షించమని ఆర్తనాదాలు చేశారు. అప్పుడు విష్ణు భగవానుడు వారికి అభయమిచ్చి భస్మాసురసంహారము కొరకు మోహినీ రూపం దాల్చి కాళ్ళు, చేతులు కదిలిస్తూ కళాత్మకమైన నృత్యక్రియను ప్రదర్శించడం మొదలుపెట్టాడు. అది చూసిన ఆ రాక్షసుడు తను కూడా అలానే చేయసాగాడు. ఆ క్రమంలోనే తన తలపై తానే చేయి పెట్టుకొని భస్మమైపోయాడు. దీనివల్ల మనకు తెలిసేదేమిటంటే మెస్మరిజం, హిప్నటిజం అనేవి యోగసాధనలోని అంగాలు. వాటికి మూలస్థానము భారతదేశమే. హిమాలయాల్లో ఉండే అనేకమంది సిద్ధపురుషులు, మహాత్ములు, టిబెట్‌లో ఉండే లామాల యొక్క విచిత్రమైన మాటల గురించి ఇప్పటికీ మనం వింటుంటాము, చూస్తుంటాము కూడా. ఇదే విధంగా సాధకులు, విద్యార్థులు అయిన వారికి యోగవిద్య, హిప్నటిజం, మెస్మరిజంలాంటి ఏ విద్యనైనా అభ్యసించాలనుకుంటే అదేమంత అసంభవమైన పని కాదు. కొద్దిరోజుల క్రిందట ఒక భారతీయ ముస్లిం యోగి నిప్పులపై నడిచి అక్కడి వైజ్ఞానికులను అందరినీ ముగ్ధులయ్యేలా చేశాడు. ఇలానే మరో యోగి కళ్ళకు గంతలు కట్టుకొని క్రికెట్ మొదలైనవి ఆడాడు. భారతదేశంలోని గారడీవారు కూడా ఇలాంటివి చేస్తుంటారు. భారతదేశంలోని ఇంద్రజాలికులు చేసే మాయాజాలాన్ని పశ్చిమదేశాల్లో నివసించేవారు సంపూర్ణంగా విశ్వసిస్తారు. ఇందులోని రహస్యాన్ని తెలుసుకునేందుకు వారు పరిశోధనలు చేస్తున్నారు. దీన్నిబట్టి

**ఇతరుల విషయాలలో తలదూర్చకూడదు**

తెలిసేదేమంటే వీటన్నింటి కంటే ముందుగా ప్రపంచంలోనే ప్రసిద్ధికెక్కిన ఆశ్చర్యకరమైన విద్యలన్నింటికీ తల్లివంటి యోగవిద్య యొక్క ఉనికి స్థిరంగా ఉన్నది కనుక ఏ విధంగా చూసినా మెస్మరిజంకాని, హిప్నటిజం కాని నూతనవిద్యలుగా గుర్తింపబడవు.

ఎవరైతే ఈ రకమైన చమత్కారాలను ప్రదర్శిస్తున్నారో వారిని గురించి ప్రేక్షకులందరికీ అనేక సందేహాలు చెలరేగుతాయి. మహాత్ముడైన గౌతమబుద్ధుని జ్ఞానాన్ని అనుసరించి ఇక్కడ మూడు రకాల చమత్కారాలు ఉన్నాయి. 1.గుప్తచమత్కారాము, 2.ప్రకట చమత్కారము, 3.జ్ఞానశక్తి ద్వారా ఉత్పన్నమైన (బౌద్ధిక చమత్కారాలు) చమత్కారాలు. గుప్తచమత్కారాలపై ఒక వ్యక్తి సిద్ధిని సాధించడం ద్వారా గుప్తశక్తులను అన్నింటినీ పొందగలుగుతాడు. ఉదాహరణకు ఒకడు అనేకులుగా మారడం, అనేకులు కలిసి ఒకడుగా మారడం, అదృశ్యమైపోవడం, గోడల్లోంచి, దుర్గమ పర్వతాల్లోకి వాయువేగంతో ప్రవేశించడం, తిరిగిరావడం, అదేవిధంగా నీళ్ళల్లోకి ప్రవేశించడం, భూమిమీద ప్రత్యక్షం కావడం, గాలిలోకి ఎగరడం, సూర్యచంద్రుల హద్దులను స్పృశించడం మొదలైనవి. ఇవన్నీ యోగచమత్కారాల్లో ప్రథమ శ్రేణికి చెందినవి. ఇటువంటి ఎన్నో వేల ఉదాహరణలు మన ఇతిహాసాల్లో, ధర్మగ్రంథాల్లో ఉన్నాయి. మరో రకంగా చూపించే చమత్కారాలు ఉన్నాయి. ఒక వ్యక్తి యొక్క అంతఃకరణలోకి ప్రవేశించి వారి ఆలోచనా ప్రవాహమును తెలుసుకొనుట. ఈ చమత్కారము ఈనాటికీ సాధు, సన్యాసుల్లో కనపడుతుంది. కానీ బ్రహ్మీభూత మహాత్ముడైన బుద్ధుడు కూడా దీనికి గొప్ప విలువను ఇవ్వలేదు. ఆయన మూడవరకపు చమత్కారాన్ని విశేషమైనదిగా చెప్పారు. ఇది మెస్మరిజంతో సమానమైన విద్యగా గుర్తింప బడుతుంది. **కానీ ఎవరు తమ ఏకాగ్రత, ఆలోచనలపై పరిపూర్ణమైన అధికారాన్ని సాధిస్తారో వారు మాత్రమే ఈ విద్యను అభ్యసించ గలుగుతారు.** మన యోగశాస్త్రములో ఈ విద్యను పొందేందుకు కొన్ని మార్గాలు చెప్పబడ్డాయి. అవేమిటంటే మనం ముందుగా మన మనస్సును స్వార్థపూరిత ప్రపంచము యొక్క ఆకర్షణల నుండి తప్పించి మనో, వాక్కాయ కర్మలయందు ఏకత్వాన్ని సాధించి పవిత్రం చేసుకోవాలి. (అనగా ఆలోచించినదే చెప్పాలి, చెప్పిందే చేయాలి). ఇటువంటి సాధకులే యోగాభ్యాసంలో విజయం సాధిస్తారు. మెస్మరిజం విద్య పైన చెప్పిన చమత్కారాలతో కూడినదేనన్న విషయం మనం వేరుగా చెప్పుకోనవసరం లేదు.

మెస్మరిజంను మాయాజాలమని చెప్పలేము. ఎందుకంటే సరైన అర్థంలో చెప్పాలంటే ఇది యోగక్రియాసిద్ధి. మాయావిద్యలు రెండు రకాలుగా ఉంటాయి. 1. వైట్ మ్యాజిక్ 2. బ్లాక్ మ్యాజిక్. వైట్‌మ్యాజిక్‌లో యోగానికి సంబంధించిన ప్రక్రియలు చేస్తే, బ్లాక్ మ్యాజిక్‌లో క్రూరమైన దుష్టాత్మల శక్తి కనిపిస్తూ ఉంటుంది. అందుచేత మాయావిద్య (జాదూ), మెస్మరిజంలను ఒకే అర్థంలో వివరించడం కుదరదు. మెస్మరిజంలో కఠినమైన రోగాలతో బాధపడే రోగులను ఆ బాధల నుండి విముక్తులనుగావించే విధానము ముఖ్యమైనది. ఇందులో మూడు పద్ధతులు ఉన్నాయి. 1. ఔషధము (మెడిసిన్), 2. శల్యక్రియ (సర్జరీ), 3. పవిత్ర మంత్రాలు (అకల్ట్ సీక్రెట్). ఇందులో పవిత్ర మంత్రముల ప్రయోగమును ప్రాచీన యౌగిక ప్రక్రియలు అని కూడా అంటారు. మెస్మరిజంలో పై పద్ధతుల ద్వారా అనేక రకాల వ్యాధులను, రోగాలను నయం చేయవచ్చు. అదే హిప్నటిజంలో అయితే చిత్తమును భ్రమింపచేసి సూచనల ద్వారా మానవుని చిత్తశక్తిని సూక్ష్మశరీరము (లింగశరీరము) వైపుకు త్రిప్పుకోవచ్చు. ఇందులో మూడు ముఖ్యమైన స్థితులు ఉన్నాయి. 1. తంద్ర, 2. నిద్ర, 3. ప్రగాఢ సుషుప్తి, 4. అనువృత్తి, 5. దివ్యదృష్టి, 6. ప్రత్యంగదృష్టి. ఈ ఆరు స్థితులలోను మొదటి మూడు స్థితులు సాధారణంగా అందరిలోను కనిపిస్తాయి. దీని తరువాత వచ్చే 4,5 స్థితులలో భూత, భవిష్యత్, వర్తమానాలకు సంబంధించిన ప్రతి దానికి సమాధానాలుంటాయి. అమెరికాలోని వారు అపరాధులను పట్టుకునేందుకు ఈ మెస్మరిజం ప్రయోగాన్నే అనుసరిస్తున్నారు. చివరి స్థితిని సమాధి స్థితిగా పేర్కొనవచ్చు. ఈ స్థితి కేవలం పవిత్రం కంటే పవిత్రం చేయబడ్డ శరీరానికే లభిస్తుంది. ఆలోచనలయందుండే పవిత్రత, ఉన్నతమైన భావములతో ఈ శక్తి ఉత్పన్నమై పసుపు వర్ణపు ఛాయతో ప్రకాశిస్తుంది. ఈ ఛాయ మనిషి ప్రవర్తన, గుణములపై ఆధారపడి ఉంటుంది. అనేక ధర్మశాస్త్రాలు, విజ్ఞానము కూడా వీటిని సమర్థిస్తున్నాయి. ఫ్రాన్స్‌లో ఉన్న విజ్ఞానవేత్తల పరిశోధనల ప్రకారము మానవునియందు ఒక రసమయ పదార్థ రూపంలో విద్యుత్ ప్రవాహము ఉంటుంది. ఇది చెడు హృదయమున్న వారిలో దుర్గంధభరితంగాను, మంచివారి శరీరములో సుగంధ పూరితంగాను ప్రవహిస్తూ ఉంటుంది. ఈ ప్రవాహము ఒకరి శరీరము నుండి మరొకరి శరీరములోకి ప్రవేశిస్తుంది. అంత మాత్రం చేతనే ఈ శక్తిపైనే మెస్మరిజం ఆధారపడి ఉంటుందని కూడా చెప్పలేము. ఈ శక్తిని సాధించడం వల్ల మనిషి గాలిలోకి కూడా ఎగరవచ్చు, రోగనివారణ మొదలైనవి చేయవచ్చు. ఈ రకమైన మానసిక ప్రవాహాన్నే శాస్త్రాలు 'తేజస్సు' అన్నాయి, ఇంగ్లీషులో దీన్నే 'ఆరా' అన్నారు.

ఆశ్చర్యమును కలిగించే ఈ విద్య ఒక్క క్షణంలో వచ్చేది కాదు, స్వల్పంగా నేర్చుకున్నా వచ్చేది కాదు. దీన్ని సాధించాలంటే

**మంచిది అనిపించిన వాటిని పాటించడం మంచి లక్షణం**

ఆత్మవిశ్వాసము, ధృఢమైన ఇచ్ఛాశక్తి, ధృఢమైన సంకల్పం, పారిమార్థికమైన బుద్ధి, విచక్షణాత్మక దృష్టికోణము, ఆరోగ్య వంతమైన శరీరము, అఖండమైన ధైర్యము, పరిశుభ్రమైన ఆహారవిహారాదులు, శాంతచిత్తం అనే లక్షణాలు తప్పనిసరిగా ఉండాలి. దీని తరువాత నియమం ఆధ్యాత్మిక క్షేత్రంలో ప్రవేశించి సాఫల్యాన్ని సాధించాలి. ఇందుకొరకు బ్రహ్మముహూర్తంలో నిద్రలేవడమనేది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రశాంతమైన గదిలో కూర్చొని ఏకాగ్రతతో ధ్యానం చేయాలి. ఏదైనా ఒక విశేష వస్తువుపై దృష్టిని నిలిపి సాధన చేయాలి. సూర్య భగవానునిపై దృష్టి నిలిపి చూస్తే కనుక కళ్ళల్లో ప్రకాశిస్తున్న సూర్యుని బింబం ఉత్పన్నమౌతుంది లేదా ఏదైనా ఒక పవిత్ర మూర్తిని ధ్యానించాలి. అందులో చిత్తవృత్తులు స్థిరపడకపోతే ఒక తెల్లని కాగితం తీసుకొని పెన్సిల్‌తో నల్లని చుక్కలు, వృత్తాలు గీసి వాటిని లెక్కిస్తూ అభ్యాసం చేయవచ్చు. ఈ విధంగా ప్రతిరోజు ఐదు నిమిషాల నుండి 20 నిమిషాలు నియమంగా చేస్తూ సమయాన్ని పెంచుకోవాలి. దీనితో పాటే మనసుకి సంతోషాన్నిస్తూ ఉండాలి, **నా కన్నుల్లో పవిత్రబలం ఉంది. జ్ఞానతంతువులు చక్కని బలాన్ని, ధృఢత్వాన్ని కలిగి ఉన్నాయి. నా కన్నుల్లో ఇతరులను కట్టివేయగలిగేంతటి విలక్షణ ప్రభావం ఉంది అని భావించాలి. నేను ఎల్లవేళలా నిర్భయుడనై ఉంటాను, ఇతరులపై ప్రభావము చూపగలిగేంత మానసిక, శారీరిక బలము నాలో సంపూర్ణంగా ఉంది.** ఇలా ప్రతిరోజు భావన చేస్తూ ఉండడం వల్ల ఏదో ఒక రోజు మనకు మనమే మెస్మరిజం యొక్క తత్వాన్ని సాధించగలుగుతాము. **ఇవే కాకుండా మరో మార్గము కూడా ఉంది. దీన్నే దీర్ఘశ్వాసను పీల్చుకునే ప్రక్రియ అని కూడా అంటారు. ఇది మన ప్రాణాయామానికి దగ్గరగా ఉండే మార్గము.** ఈ ప్రక్రియను ఇంట్లో కాకుండా ఏకాంత స్థలంలో చేస్తే ఎక్కువ లాభాలు త్వరగా వస్తాయి. ఎందుకంటే ఇటువంటి చోట ఆకర్షణశక్తి, ఏకాగ్రత అనేవి సులువుగా స్ఫురణకు వస్తాయి. కానీ ఈనాడు మెస్మరిజం తెలిసిన యోగులందరు సిద్ధపురుషులు కాలేరు. ఎందుకంటే వారిలో పైన చెప్పిన గుణాలు ఏవీ ఉండవు. చాలామంది ఆశకు లోబడి మెస్మరిజంను ధనాన్ని సంపాదించే సాధనంగా తయారుచేస్తున్నారు. ఇంకా చాలామంది దీని ద్వారా ఇతరులకు కష్టాలను కల్పించేందుకు, వారిని నీచంగా చూపించేందుకు ఒక ఉపాయంగా వాడుకుంటున్నారు. మరికొంత మంది దీని గురించి వారికున్న అపరిపక్వ జ్ఞానాన్ని ఆధారంగా చేసుకొని యాచనలో నిమగ్న మయ్యారు. అందుచేత ఇటువంటి వారి వద్ద ఈ విద్యను గురించి తెలుసుకోవాలని, నేర్చుకోవాలని కలలు కనడమనేది అన్ని విధాలా భ్రమే అవుతుంది. ఈ జ్ఞానం గురించి అన్ని భాషల్లోను వేర్వేరు పుస్తకాలు ముద్రితమై ఉన్నాయి. అందువల్ల ఈ విద్యను నేర్చుకోవాలనుకునే విద్యార్థులు ముందుగా ఈ పుస్తకాలన్నింటినీ చదివి అన్నింటిలోను లభించే మూల విషయమును గురించిన జ్ఞానమును సంపాదించుకోవాలి.

*– పరమపూజ్యగురుదేవుల వాఙ్మయం 17 నుండి*

*అనువాదం : శ్రీమతి వల్లీశ్రీనివాస్*

## తపస్సు - మానవ సేవ - మోక్షం

*ఒక సంత్ సాధువు రాత్రింబవళ్ళు భగవంతుని ధ్యానంలోనే లీనమై ఉండేవాడు తప్ప వేరెవ్వరికి సేవ చేసి ఎరుగడు. ఆయనకు సేవపట్ల ఎటువంటి అభిరుచి లేదు. ఈ రీతిగా తపస్సు చేస్తూ చేస్తూ ఆయన మరణించాడు. మరణించిన ఈ సాధువును యమభటులు చిత్రగుప్తుని వద్దకు తీసుకొనిపోయారు. భూమిపై తాను చేసిన తపస్సుకు ప్రతిఫలంగా తనకు మోక్షం లభిస్తుందనే ఆశతో ఉన్నాడు సాధుసంత్. కాని చిత్రగుప్తుడతనికి ఒక పవిత్ర కులంలో తిరిగి జన్మ తీసికొనే ఏర్పాటు చేశాడు. దీనితో సాధుసంత్ సంతృప్తిజెందక, తనకు పునర్జన్మ కాదు, మోక్షం కావాలని పట్టుబట్టాడు. అప్పుడు, చిత్రగుప్తుడు సాధుసంత్‌ను, సమస్య పరిష్కారార్థమై యమధర్మరాజు ఎదుట హాజరు పరిచాడు. యమధర్మరాజు, చిత్రగుప్తుని ద్వారా నమోదు కాబడిన సాధుసంత్ భూమిపై జీవించిన జీవన విధానాన్ని తెప్పించుకొని పరిశీలించాడు. అట్లే సాధుసంత్ కోరిన మోక్షవాదాన్ని విన్నాడు. రెండు వాదనల విన్న పిదప, యమధర్మరాజు తన న్యాయ నిర్ణయాన్ని ప్రకటిస్తూ ఇట్లు వెలువరించాడు – "తపోమయ నిష్కళంక మానవ జీవనం చాలా మంచిదే. కాని మానవ జీవనసార్థకత తపస్సుతోపాటు, పరోపకారం లేక సేవా కార్యాలలో కొంత సమయాన్ని వెచ్చించుటతో ముడిపడి ఉన్నది. ఇట్లు కానిచో మోక్షప్రాప్తి సంభవం కాజాలదు". యమధర్మరాజు ప్రకటించిన తీర్పుతో సాధుసంత్‌కు జ్ఞానోదయమై మరుజన్మలో తపస్సుతోపాటు, సేవా కార్యక్రమాలు చేబూనుటకు సంకల్పం తీసికొని, తదనుసారం నడచుకుని మోక్షప్రాప్తిని పొందాడు.*

*– అఖండజ్యోతి మార్చి, 2013, అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**వినడం, వివేకంతో ఆచరించడం సంస్కారవంతుల లక్షణం**

జీవన వికాసం

# మృత్యువు-చేతనత్వము యొక్క ఉచ్చతమ వికాసమునకు ప్రవేశద్వారం

ఆత్మ అమరమైనది. శరీరము నశ్వరమైనది. ఈ సత్యమును పలుమార్లు విన్న తరువాత కూడా మనిషి మృత్యువు గురించి ఆలోచించటానికి భయపడుతూనే ఉంటాడు. మనిషి మరణమును గురించి అవగాహన చేసుకున్నట్లయితే విషయము మరోలా ఉంటుంది. కొంతమందికి మృత్యువు ఎటువంటి పరుసువేదిగా సిద్ధించిందంటే దాని అద్భుత స్పర్శ వారి జీవితమును కాయకల్పము చేసింది మరియు చిక్కుముడులతో నిండిన ఒక సామాన్యమైన, అర్థవిహీనమైన జీవితము ఒక కొంగ్రొత్త ఉద్దేశ్యము, ఉల్లాసాలతో కాంతులీనింది.

మార్గరేట్ అనే ఆంగ్లమహిళ మృత్యువును అనుభూతి చెందిన అనేకమంది మనుష్యుల మీద విస్తృతంగా పరిశోధనలు, పరిశీలనలు చేసింది. వాటిని 'రిటన్ ఫ్రమ్ డెత్' అనే తన పుస్తకంలో విపులంగా వర్ణించింది. రచయిత్రి అభిప్రాయానుసారం మృత్యు కోరలలో నుంచి బయటపడిన ఈ జనుల జీవితంలో మూడు రకములైన మార్పులు కలిగాయి. అవి ఇతరుల ఎడ ఆత్మీయత, ప్రేమ భావనల వికాసము, జీవన రహస్యము, బ్రహ్మాండీయ సిద్ధాంతములను తెలుసుకోవాలనే తీవ్రమైన కోరిక మరియు ఇతరుల సేవ నిమిత్తము శక్తి సామర్థ్యములను వికసింప జేసుకోవాలనే ఆకాంక్ష.

మరణానుభూతిని పొందిన ఒక హృద్రోగపీడిత మహిళ ఇలా అన్నది. 'ఈ అనుభవము తరువాత నేను నా అంతరంగములో ప్రేమ భావన నెమ్మది నెమ్మదిగా వికసించుటను గమనించాను.' ఆమె ఇంకా ఇలా అన్నది. 'చిన్న చిన్న లెక్కకురాని వస్తువుల పట్ల కూడా నాకిప్పుడు ఆనందము వెల్లివిరుస్తున్నది. ఇతరులతో ముచ్చటించే సామర్థ్యము కూడా మరింతగా వికసించినది. పరుల విషయాలలో అతీంద్రియ సామర్థ్యం వృద్ధి చెందినది. రోగులు మరియు మరణాసన్న జనుల పట్ల ఉదాత్త సంవేదన అంకురించినది. మృత్యు ప్రక్రియ జీవన విస్తారము (Extension of life) తప్ప అంతకుమించి మరేమీ కాదు అని వారికి ఏదో ఒకవిధంగా తెలియజెప్పాలని కోరుకుంటున్నాను.'

న్యుమోనియాతో బాధపడుతూ మృత్యుముఖంలోకి తొంగిచూసిన ఒక వ్యక్తి అభిప్రాయ సారాంశమిలా ఉంది. 'ఇతరుల పట్ల నా దృష్టికోణములో చాలా మార్పు వచ్చింది. నేను చాలా ముడుచుకుపోయే (introvert) మరియు ఒంటరి తనపు వ్యక్తిత్వం గల మనిషిని. కానీ ఈ అనుభవము పిమ్మట నా మనస్సు విశాల మయ్యింది. నేను పరులతో అధిక ఆత్మీయతను అనుభూతి చెందుతున్నాను. అంతేకాక వారిపట్ల మరింత అభిమానము పెరుగుతున్నది.'

అనేకమంది మనుష్యులు మానవజాతితోపాటు ప్రకృతి పట్ల తమ ఆత్మీయతాభావనను విస్తరింపజేసుకున్నారు. హృదయపు లోతులగుండా ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి అనుభవమిలా ఉంది. 'ఈ అనుభూతి పొందినప్పటినుండి సమస్తం మారిపోయింది. నేను ఎండను ఆస్వాదిస్తున్నాను. చల్లని గాలిని ఆనందంగా ఆస్వాదిస్తున్నాను! ఆకాశమెంత నీలంగా ఉందో! వృక్షాలు కూడా మరింత ఆకుపచ్చగా భాసిస్తున్నాయి. సమస్తం కూడా మునుపటి కంటే మరింత అందంగా గోచరిస్తున్నది! నా ఇంద్రియాలు ఇదివరకటికంటే ఎంత మారిపోయాయో! నేనిప్పుడు వృక్షాల ఆభామండలమును (aura) సైతము వీక్షించగలుగుతున్నాను!'

మరణానుభూతిని చెందిన మనుష్యులలో జీవితము మృత్యువు సృష్టి యొక్క సత్యములను తెలుసుకోవాలనే తీవ్రమైన ఇచ్ఛ కలిగింది. నేనెవరిని? ఈ భూమి మీదకు ఎందుకు వచ్చాను?' అని తెలుసుకోవాలనే తపన తనకిప్పుడు అధికమైనదని ఇటువంటి ఒక మహిళే చెప్పింది. ఆమె అదంతా తెలుసుకుని ఇతరులకు చెప్పాలని కోరుకుంటున్నది. ప్రసూతి సమయములో మరణమును రుచిచూసిన మహిళ కథనమిలా ఉంది. 'ఈ అనుభవము తరువాత నా జీవితము పూర్తిగా మారిపోయింది. నేనిప్పుడు జీవన్మరణముల రహస్యాన్వేషణలో లీనమైపోయాను.'

మరణమును చవిచూసి తిరిగొచ్చిన జనులలో రోగములను నివారించుకోగలిగే సామర్థ్యము, పరులకు సేవ చేయాలనే భావన వికసించింది. రెండుమార్లు శస్త్రచికిత్స చేయించుకున్న వ్యక్తి ఈ విధంగా చెప్పాడు. ఈ ఘటన పిమ్మట అతనికి తనలో రోగమును శమింపజేసుకునే శక్తి ఉన్నదనే అనుభూతి కలిగినది. అతనిప్పుడు బర్మింగ్‌హాంలో (ఇంగ్లాండు) ఒక చికిత్సాకేంద్రమును ప్రారంభించాడు. అతను ఉల్లాసంగా వేలాదిమంది రోగులకు సహాయమందించుట ఆశ్చర్యము కలిగిస్తున్నది. అతను నూతన జన్మ పొందినట్లు అనుభూతి చెందుతున్నాడు. అతని ఆలోచన

నలుగురు నడిచే మార్గం క్షేమం

నడవడికలో ఆమూలాగ్రం మార్పువచ్చింది. ఈ అనుభవము ఒకరకంగా ఆత్మశోధన ప్రక్రియ, అది గత జన్మల పాపాలను ప్రక్షాళన చేస్తుంది అని ఇతని నమ్మకం.

రెండు గంటలపాటు మరణించిన వ్యక్తి భావన ఇలా ఉంది. 'ఈ అనుభవము నా పూర్తి జీవితమును మార్చివేసింది. ఇప్పుడు నాకు ఒక జీవిత లక్ష్యము ఏర్పడింది. నేను ఈశ్వరుని కార్యము నిర్వర్తించుటకు పంపబడ్డాను. నేను పరోపకారము చేయాలని సంకల్పించాను. నాకిప్పుడు ఈ బ్రహ్మాండమును సంచాలితము (నియంత్రణ) చేసే పరబ్రహ్మసిద్ధాంతము ఉన్నదని తెలిసింది. భగవంతుడు ఆ సిద్ధాంతాలకు భంగం వాటిల్లనివ్వడు. అయితే మనము వాటిని కనుక ఉల్లంఘిస్తే కష్టములు, రోగములు మనలను చుట్టుముడతాయి. వాటినుండి తప్పించుకునేందుకు ఒకే ఒక ఉపాయమున్నది. అదేమిటంటే మన దారిని మార్చుకుని ఈశ్వరుని సిద్ధాంతాలకు అనుగుణ్యంగా జీవించాలి.

మరణానుభూతులు మనుష్యుల దృష్టికోణములో అద్భుత పరివర్తనలు తెచ్చాయి. జీవిత స్వరూపోద్దేశ్యములను గురించి కొంగ్రొత్త అవగాహన కల్పించాయి. జీవితం పట్ల విధేయాత్మక వైఖరిని (positive attitude) వికసింపజేశాయి. ఒక నవీన జీవితం ఉదయించింది. అధికమైన ఆత్మబలముతోపాటు ఆత్మగౌరవము యొక్క నూతన భావన వికసించింది. భౌతికసంపదల మీద దృష్టి సన్నగిల్లింది. ఇతరులనుండి అపేక్ష, ఆశలు తగ్గుముఖం పట్టాయి. వివేకం, దయ, కరుణ భావనలు ఉప్పొంగుతున్నాయి.

మృత్యువు తరువాత కూడా జీవన గమనము ముందుకు సాగుతుంది. ఈ విశ్వాసమే మృత్యుభయమును పోగొడుతుంది. మంటల బారినపడి బాగా కాలిన గాయాలు కల మహిళ ఇలా అన్నది. 'నా కిప్పుడు మృత్యువు గురించి ఇసుమంతైనా భయము లేదు. మృత్యువు తరువాత కూడా ఒక ఆశ్చర్యకరమైన జీవితం ఉంటుందని నేను తెలుసుకున్నాను.' సాహసోపేతమైన ఈ యాత్ర సాగించిన కారణంగా ఒక మహిళ అభిప్రాయమిలా ఉన్నది. 'ఇప్పుడు మృత్యుభయమంతా శమించినది. నేనిప్పుడు మృత్యువును స్వాగతిస్తున్నాను. అయితే మృత్యువును తెలిసి తెలిసి ఆహ్వానించేందుకు ఎప్పుడు ఏమీ చెయ్యను. మనమిక్కడకు ఏదో ఒక ఉద్దేశ్యముతో వచ్చాము. ఆ పని పూర్తిచెయ్యాలని నాకు అనిపిస్తున్నది.

ట్రక్ క్రిందపడి నుజ్జునుజ్జయిన ఒక వ్యక్తి కథనమిలా ఉంది. ఈ అనుభూతి పిమ్మట నాకు మృత్యువంటే భయము లేకుండా పోయింది. ఒకవేళ జీవితమును కష్టాల్లోకి నెట్టే పరిస్థితులు వచ్చినప్పుడు నేను వాటినుండి బయటపడటానికి శాయశక్తులా సంపూర్ణంగా కృషిచేస్తాను. కాని నాకు మృత్యు సమయం ఆసన్నమైనప్పుడు నేను చేతనారూపం అనగా భౌతిక రూపం నుండి విశ్రాంతి పొంది మృత్యువుకు ఆహ్వానము పలుకుతాను. ఎందుకంటే నేను అనుభూతి చెందిన వాటన్నింటిల్లో కెల్లా ఇదే ఆశ్చర్యకరమైన విషయము.

'ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ నియర్ డెత్ స్టడీస్' అనే పత్రికా సంస్థాపకుడు కైనేథిరింగ్ తన పత్రికలో గుండెపోటుతో మరణానుభూతిని పొందిన ఒక మహిళను గూర్చి వ్రాశాడు. 'ఆమె ఎప్పుడూ మృత్యువంటే భయపడేది. ఆమె ఆసుపత్రిలో పలుమార్లు మృత్యువును దర్శించింది. తత్ఫలితంగా ఆమెకు మృత్యుభయం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. వైద్యులు, బంధుగణమంతా కలవరపడ్డారు. ఆమెకు తాను ఏ క్షణములోనైనా మరణిస్తానని తెలుసు. అయితే ఆమెకు ఏ భయము లేదు. ఎందుకంటే మృత్యువంటే ఏమిటో ఆమెకు తెలుసు. **మృత్యువు జీవితమునకు అంతము కాదు, క్రొత్త ఆరంభము.** జీవితము ఈశ్వరుని బహుమానము. ఆమె దానినెప్పుడూ చేజార్చుకోదు. మంటల్లోపడి కాలిన స్త్రీ అభిప్రాయమిలా ఉంది. 'నాకు ఇప్పుడు భగవంతునిపట్ల విశ్వాసము మరింతగా దృఢమైనది. ఆయనపట్ల గల అభిప్రాయాలలో మార్పు గోచరించింది.'

105 డిగ్రీల విషజ్వరంతో బాధపడుతున్న ఒక మహిళ 'ఆ సమయమునుండి నాకు భగవంతుని సామీప్యత మరింత అనుభవంలోకొచ్చింది. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఈశ్వరుని ఉనికిని అనుభూతి చెందగలుగుతున్నాను. ప్రార్థనలు, చమత్కార వంతమైన రీతిలో స్వీకరించబడుతున్నాయి. పలు సమస్యలకు సహజంగానే సమాధానములు స్ఫురిస్తున్నాయి' అని వెల్లడించినది.

ఈ ప్రకారంగా మరణానుభూతి మనుష్యులలో ఆధ్యాత్మిక జాగరూకతను ఉత్పన్నము చేసింది. దాని లోతుల లోపల ఈశ్వరుని అధిక సామీప్యత మరియు వ్యక్తిగత స్థాయిలో భగవంతునితో మాటామంతి సాగించే అనుభవము కలిగినది.

భయంకరమైన కారు ప్రమాదము జరిగిన పిమ్మట మృత్యు అనుభవమును పొందిన ఒక మహిళ తన భావమును ఇలా వెల్లడించినది. 'దీని తరువాత నేను నా ఆధ్యాత్మిక జీవితమును మరింతగా వికసింప చేసుకోవాలని కోరుకుంటున్నాను. బ్రహ్మాండము భగవంతునితో ఏ సంబంధమున్నది? దీని నిజమైన అర్థమును తెలుసుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. నేను ఫాదర్ ద్వారా చెప్పబడ్డ కర్మకాండ ప్రక్రియ అనుష్ఠానం వరకే పరిమితము కావాలనుకోవటము లేదు.' ఆమె అభిప్రాయమును అనుసరించి ఆమెకిప్పుడు భగవంతుని అన్వేషించుటలో ఏ చర్చికి వెళ్ళవలసిన

**ఏదైనా మంచి పని చేద్దామనుకుంటే తక్షణం మొదలుపెట్టండి**

పనిలేదు. చర్చి అయినా లేక యహూదీసభా ప్రాంగణమైనా అన్నీ ఆమెకు సమానమే.

మృత్యువుని అనుభూతి పొందిన జనులమీద లోతైన అధ్యయనము, అన్వేషణ సాగిస్తున్నవారిలో మూడీ పేరుకూడ ప్రఖ్యాతమైనదే. మరణానుభవము పిమ్మట మనుష్యుల జీవితాల మీద అది చూపించే ప్రభావములను అతను 'లైఫ్ ఆఫ్టర్ లైఫ్' అనే తన పుస్తకంలో చర్చించాడు. అతని అభిప్రాయమును అనుసరించి చనిపోయిన అనుభూతి మానవ జీవితమునకు నూతన పరిభాషను, అర్థమును ఇచ్చింది. జీవితంలో అధిక ఉదారత, గాంభీర్యముల సమ్మేళనము గోచరించినది. ఇతరులపట్ల ప్రేమ భావన మరియు జీవితపు లోతైన రహస్యాలను తెలుసుకోవాలనే ఇచ్ఛ వృద్ధి చెందింది.

ఇటువంటి అనుభవమును చవిచూసిన ఒక మహిళ కథనమిలా ఉంది. 'నాకు ప్రస్తుతము జీవితములో ఒక నూతన అధ్యాయము ఆరంభమైనది. దానిని గూర్చి ఇదివరకు కనీసము ఇలాంటిది ఉన్నదనే సంభావన (possibility) కూడా నాకు తెలియదు.' ఈ అనుభూతికి ముందు ఆమె చాలా మామూలుగా ఉండేది. ఏమి నేర్చుకోవాలనే కోరిక ఉండేది కాదు. కానీ ఆమె ఇప్పుడు జీవితంలో ఇంకా తెలుసుకోవాల్సినది ఏమిటి అన్న విషయము గురించే ఆలోచిస్తున్నది.

ఒకానొక వ్యక్తి అనుభవమిలా ఉంది. 'గత జీవితంలో నేనొక సంతుష్ట మానవుడను. నావరకు పరిమితమై జీవించాను. ఇతరులకు చెయ్యవలసినది చేశాను అని అనిపిస్తున్నది. మరణాను భవము ఒక నూతన దృష్టికోణమునకు జన్మనిచ్చినది. వేటినైతే మంచివని నమ్మి ఆచరించానో అవి మూలతః నా స్వార్థం కొరకే చేశానని అనిపిస్తున్నది. మునుపు నా భావోద్వేగాలను అనుసరించి పనులు చేస్తుండేవాడిని. ఇప్పుడు ఆలోచించి, అవగాహన చేసుకుని బుద్ధి వివేకములను ఉపయోగించి పని చేస్తున్నాను. తత్ఫలితముగా మనస్సు, ఆత్మల ఆరోగ్యవంతంగా ఉంటున్నాయి. ప్రస్తుతము ఇతరుల దోషాలను చూడటము, వారిని గురించి అంచనా వెయ్యటము అనే పనులను చేయటము లేదు. సత్కర్మలు అని నిజంగా అనిపించినవాటినే నేను ఆచరణలో పెడుతున్నాను. అంతేతప్ప నా స్వార్థము కొరకు, నా తృప్తి కొరకు వాటిని చెయ్యటము లేదు. జీవితము గురించి లోతైన అవగాహన ఏర్పడింది.'

కొంతమంది అభిప్రాయమిలా ఉంది. 'శరీరమునకు అధికమైన మహత్వమునిచ్చే విషయములో మార్పు గోచరించినది'. ఈ వర్గమునకు చెందిన ఒక మహిళ మనోభావం ఇలా ఉంది. పూర్వము ఆమె శరీరము విషయములో అధిక జాగరూకతతో మెలగేది. శరీర అలంకరణకు పోషణలకు అధికాధిక సమయమును, శక్తిని వెచ్చిస్తూండేది. మరణానుభూతిని పొందిన తరువాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఆమెకు ఇప్పుడు శరీరము లెక్క లోనిది కాదు. అంతేకాదు మనస్సునే ఆకర్షణకు ప్రధాన కేంద్రంగా భావిస్తూ, దానిమీదనే తన సంపూర్ణదృష్టిని నిలిపినది.

ఈ ప్రకారంగా మృత్యువు అనే అనుభవము మనుష్యులను దేహభావన నుండి పైకి లేపి ఉచ్చతర భావనలో ప్రతిష్ఠించినది. జీవితమును ఒక ఉద్దేశ్యపూరితంగాను, లోతైన దృష్టితోను ముందుకు సాగేటట్లు చేసింది. ధర్మముమీద అధిక ప్రీతిని అంకురింపజేసినది. మతపరమైన గుడ్డినమ్మకాలు, మూఢాచారాలను గణనీయంగా తగ్గుముఖం పట్టేలా చేసింది. అంతేకాదు ఒక ఉచ్చస్తరీయ నియామకశక్తి యొక్క జ్ఞానమును ఉదయింపచేసింది మరియు వారి మనస్సు లోతులలో ఆ సర్వోచ్చ సత్తాతో మాటా మంతి చేసే సామర్థ్యమును కూడా వికసింప జేసింది. వీటన్నింటి మేలుకలయికతో ఒక నూతన దృష్టికోణమును అంకురింపజేసినది. తత్ఫలితముగా వారిలో నిస్వార్థ ప్రేమ మరియు నిజమైన ఆధ్యాత్మిక విలువలు ప్రకాశించినవి. ఈవిధంగా మరణానుభూతి (experience of death) మనిషి ఆలోచన, ఆచరణ మరియు దృష్టి కోణములో ఎటువంటి పరిణామమును తీసికొచ్చిందంటే జీవితాంతము సంస్కరించుకున్నప్పటికి కూడా వారికి అది సాధ్యపడదు. తత్కారణంగా ఈ అనుభవజ్ఞానం వారికి పరసు వేదివలె ఉపయోగపడింది. ఇదంతా ఈశ్వరుని చేతన యొక్క భాగములోని ఒకానొక ఉచ్చస్తర చేతనత్వము యొక్క దివ్య స్పర్శ కారణముగా జరిగింది. దీని అర్థము **మృత్యువు జీవితానికి అంతము కాదు, పైపెచ్చు జీవితం ద్వారా వికసించబడుతున్న చేతనత్వపు ఉత్తమోత్తమ వికాసక్రమమునకు ప్రవేశద్వారము. అది జీవితపు మరో ఒడ్డున గల అదృశ్యలోకంలో ఒక ఉచ్చస్తర జీవితం వైపుకు సాగే యాత్రకు అవసరమయ్యే ఒకానొక సోపానము.**

*– అఖండజ్యోతి, డిసెంబర్ 2001*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*


**యుగశక్తి గాయత్రి**
**మాస పత్రిక చదవండి ! చదివించండి !!**


**కాలం సమీపిస్తే మృత్యువు దాని పని అది చేసుకుపోతుంది**

# ఆధ్యాత్మికత యొక్క సరియైన రూపమును తిరిగి జాగృతం చేయాలి - 3

మహాపురుషులు ఎంతో తీవ్రతరమైన విషయములను కూడా అత్యంత సరళమైన పదములతో వ్యక్తపరచగలరు. పూజ్యగురుదేవులు తమ ప్రత్యేకమైన ఉద్బోధనలతో లోతైన ఆధ్యాత్మిక అంశములను కూడా సర్వసులభముగా మార్చివేశారు.

'ఆధ్యాత్మికత అనేది ఏదో ఒక లాటరీ వంటిదికాదు, అది జీవితము యొక్క సిద్ధాంతములను ఆమూలాగ్రముగా మార్చివేయ గలిగినది' అన్న విషయమును మనము గత సంచికలో చదువుకున్నాము. ఆధ్యాత్మికత యొక్క పునర్జాగరణకొరకు, క్రొత్త తర్కాన్ని ఆవాహన చేస్తూ వారు తాము భిక్షకులుగా గాదు, భిక్షువుగా మారినామని తెలియజేస్తున్నారు. తమ జీవితమును తపింపజేసుకొని ఉన్నతమైన ఆదర్శములకొరకు మరణించడానికైనా సిద్ధంగా ఉండగలిగినవారే భిక్షువులు. 'ఆత్మను సంస్కరించుకొనుటయే ఆధ్యాత్మికతలోని మర్మము' అని చెప్తూ పూజ్యగురుదేవులు స్వామీ దయానందయే ఇందుకు ఉదాహరణ అని తెలియజేస్తున్నారు. ఈ చివరి అంకంలో వారియొక్క విప్లవాత్మకమైన ఆలోచనలను మరికొన్నింటిని చదువుదాము రండి!

## ఆత్మను సంస్కరించు కొను టయే ఆధ్యాత్మికత లోని రహస్యం



స్వామీ దయానంద స్వయముగా ఆత్మబలసంపన్నులు, కాబట్టే వారికి ఇంత మంచి దృఢమైన వ్యక్తుల సహయోగము లభించినది. సమర్థత ఉన్న వారి దగ్గరకు మంచి వ్యక్తులు ఎల్లప్పుడూ వస్తూనే ఉంటారు. వారివద్ద ఉన్న భాండాగారము ఎప్పటికీ తరిగిపోదు. ఈ ప్రపంచములో ఎంతోమంది ఉన్నతమైన వ్యక్తులే వారి వద్దకు వచ్చారు, వస్తూనే ఉంటారు. స్వామిదయానందులు చేసిన పనినే మేము చెయ్యటానికి సంకల్పించుకున్నాము.

ఈ కుంభమేళా సందర్భముగా మీరు గంగ ఒడ్డున, హిమాలయాలకు ద్వారంవంటి ఈ శాంతికుంజ్‌లో ఒక నెలరోజులపాటు ఉండేవిధంగా వచ్చారు. ఇక్కడ మా ఉపన్యాసములకన్నా ఎక్కువ విలువైనదానిని మీరు తీసుకు వెళ్ళవచ్చు. దానినిగురించి మీకు శిక్షణనిస్తాముకూడా. మీకు నేర్పించబడుతున్న హవనవిధి, సంస్కారములకన్నా కొన్ని లక్షలరెట్లు విలువైనది. దానిని పొందటము గర్వకారణమేకాదు, ఎంతో ప్రాముఖ్యత కలిగి జీవితాంతము మీకు ఉపయోగ పడుతుంది. దాని సహాయముతో మీ పని, మా పని కూడా అవుతుంది. మీకు మాకు కూడా మేలు చేకూరుతుంది. ఈ మూడింటిని మీరు జమచేసుకుంటూ ఉండండి.

చెడు ఆలోచనలు మిమ్మల్ని ప్రభావితము చెయ్యనీయకండి, అందుకోసమే మేము పూర్తిగా 8 గంటల సమయానికి సరిపోయే కార్యక్రమమును ఏర్పరిచినాము. చెడు ఆలోచనలు అనేవే మీ మనస్సులో ప్రవేశించకుండా, ఇంకా చెప్పాలంటే మీరు ఇంకొక్క మెట్టు పైకి ఎక్కి, అసలు మనము ఇక్కడకు ఎందుకు వచ్చాము? ఇక్కడినుండి మనము శక్తి పుంజాన్ని కాని లేదా శక్తి ప్రవాహమును గాని తీసుకుని వెళ్ళగలగాలి. ఆ శక్తి ప్రవాహము ఎక్కడ నుండి వస్తున్నది? మనము ఎక్కడినుండి తెచ్చుకోవాలి? అని ఆలోచించగలగాలి.

అయితే ఇందులో కొంత మీరు చేయవలసిన పని ఉన్నది. కొంత పని మాది ఉన్నది. ఎవరి పని వాళ్ళు చేసుకుపోవాలి. ఇరువురి సహకారముతోనే పని పూర్తవుతుంది. మీరు మీ పనిని చెయ్యాలి. మేము మా పనిని పూర్తిచేస్తాము. ఈవిధముగా ఇద్దరం కలిసి పనిచేసినట్లయితే ఒక మంచి లక్ష్యమును సాధించగలము. దేనికోసమైతే మిమ్మల్ని ఇక్కడికి పిలిపించామో దానిని మీరు తప్పకుండా తీసుకువెళ్ళగలరు.

## భగవంతుని ఉపాసన అంటే ఏమిటి?

ఇందుకోసమై భగవంతుడిని ఉపాసించాలి. ఉపాసన అంటే భగవంతునికి సమీపముగా ఉండటము. భగవంతుడు ఎలా

మనం చేసే పనుల వలన ఇతరులకు ఇబ్బంది కలుగకూడదు

ఉంటాడో మనము కూడా అదేవిధముగా మారగలిగినప్పుడు దానిని మనము ఉపాసన అని అనగలుగుతాము. మంట మండుతూ ఉంటుంది. అందులో మనము ఒక కట్టెను వేస్తే అది ఉపాసన అవుతుంది. నిప్పు ఎలా వుందో కట్టె అదేవిధముగా మారితే అప్పుడు పని సరిగ్గా పూర్తయినట్లు. నిప్పు తాను ఉన్నట్టుగానే ఉండి, కట్టె తాను ఉన్నట్టుగానే ఉండిపోయినట్లయితే ఇక ప్రయోజనమేముంది? మట్టిని, నీటిని కలుపుతాము. మట్టి నీరుగానో, నీరు మట్టిగానో మారి ఒకదానితో ఒకటి కలసిపోతాయి. భగవంతుడిని ప్రార్థించండి. కానీ ఆయన గుణములను మీలో ధారణ చేయలేకపోతే అది ఇక ఉపాసన అని ఎలా అనబడుతుంది? మీరు ఆ గుణములతో భగవంతుని ధారా ప్రవాహములో కలిసి పొండి. లేదా ఆ గుణములన్నింటిని మీలో ధారణ చెయ్యండి. ఉపాసన అంటే అదీ! ఇంతకన్నా స్వల్పంగా ఉపాసన అనేది ఉండదు. భగవంతుని వంటి అత్యంత మహనీయులు కావటానికి, మీ లోపల అందుకు దిశానిర్దేశములను ఉత్పన్నం చెయ్యండి. మీ ఉపాసన సఫలం కావాలంటే మీలో అందుకు తగిన వేడి ఉత్పన్నం కానివ్వండి. ఉపాసనకు అవసరమైన కర్మకాండలోని అంతర్భాగముగా మీకు గాయత్రీ మంత్రమును నేర్పుతాము. గాయత్రీమంత్రమును మించిన మంత్రము యావత్ప్రపంచములోనే లేదు. నాకు ఈ విషయమై అచంచలమైన విశ్వాసమున్నది. అయితే ఒక్క విషయమును మటుకు గుర్తుంచుకోండి. **ఉపాసనగాని, జపముగాని భావనాత్మకముగానే జరగాలి.**

## భారతీయ సంస్కృతికి తల్లిదండ్రులు

గాయత్రి, యజ్ఞము... ఇవి రెండూ భారతీయ సంస్కృతికి తల్లిదండ్రులు. మనము పద్మాసనం వేసుకొని జపం చేస్తూ కూర్చుంటాము. అది గాయత్రి యొక్క స్థూల లేదా బహిరంగ రూపము. అదేవిధముగా వేదిక ఏర్పరచి సమిధలు, నెయ్యితో చెయ్యబడే యజ్ఞం, యజ్ఞం యొక్క స్థూలరూపం. యజ్ఞం యొక్క సూక్ష్మరూపం మరియొక విధముగా ఉంటుంది. ఇక్కడ మీరు నిరంతరము చేస్తున్నది గాయత్రి యొక్క సూక్ష్మరూపమునకు సంబంధించిన జపము. ఉదయము నాలుగున్నర గంటలకు మీరు నిద్ర లేవవలసి ఉంటుంది. ఉదయం 6.15 గంటలకు తేనీరు ఇవ్వబడుతుంది. ఈ మధ్య కాలములో నిత్యశౌచక్రియలను ముగించుకొనవలసి ఉంటుంది. ఆ తరువాత ఉపాసన ప్రారంభం అవుతుంది. ఉపాసనలో జపముతో పాటు ధ్యానముకూడా జోడింపబడాలి. యజ్ఞము అగ్నికి, తేజస్సుకు, బ్రహ్మవర్చస్సుకు ప్రతీక. హవనము దానియొక్క బహిరంగరూపము. ఇక యజ్ఞము యొక్క అంతరంగరూపము 'సూర్యుడే!' మీరు ఉదయమే పద్మాసనము వేసుకొని జపము చెయ్యండి. వెలిగించాలనుకుంటే అగరుబత్తిని వెలిగించండి. సూర్యునకు అర్ఘ్యము సమర్పించటానికి ఒక గ్లాసుతో నీటిని దగ్గర ఉంచుకోవాలి. ప్రాతఃకాలములో మీకు ఎక్కడ ఏకాంతమైన, అందమైన ప్రదేశము లభిస్తుందో అక్కడ కూర్చుని జపము, ధ్యానము చెయ్యండి. **కళ్ళు మూసుకుని మనస్సులోనే గాయత్రీ జపము చేస్తూ నేను జ్ఞానగంగలో తేలియాడుతున్నాను అని భావన చేసుకుంటూ ఉండాలి. శాంతికుంజ్‌లో జ్ఞానగంగ ప్రవహిస్తున్నది. ఇది జ్ఞానగంగకు ఉద్గమ స్థానము.** శాంతికుంజ్ యొక్క భౌతిక రూపమును మేము తయారుచేశాము. ఇక్కడ రాళ్ళు, ఇటుక, ఇసుక మొదలైనవానిని చేరవేసే బాధ్యత మాది. కానీ వీటన్నింటిని సమకూర్చుకొనటాని కన్నా ముందుగా బుద్ధభగవానునివలె మేము ఇందులో నిండి ఉన్న ప్రేరణలను మన ప్రాచీన సంప్రదాయములను పునర్జాగరణ చెయ్యగలిగిన వేలాది, లక్షలాది మంది వ్యక్తులకు అందించవలసి ఉన్నది. నిజానికి ఈ కార్యక్రమాలన్నీ మేమొక్కరమే నిర్వహించడము లేదు. ఇందులో మా గురువుగారి పాత్ర కూడా ఉన్నది. ఉదయము మీరు ధ్యానము చేసుకునేటప్పుడు, 'ఇక్కడ మనము మాత్రమే ధ్యానము చేస్తున్నాము, జపము చేస్తున్నాము' అన్న అనుభూతి మీకు కలుగదు. ఎందుకంటే వాస్తవానికి ఇక్కడకు ఒక శక్తి (గురుసత్తా) వస్తున్నది. శీతలవాయువులు మిమ్మల్ని స్పృశించి మీలో కంపనలు, పులకింతలు ఉత్పన్నము చేస్తున్నాయి.

## జ్ఞానసూర్యుడు-సవితాదేవత

మీరు సూర్యుడిని ధ్యానించాలి. కళ్ళు మూసుకుని సూర్యుడు అంటే 'వెలుతురుతో నిండిన సూర్యుడు, మెరిసే సూర్యుడు కాదు. జ్ఞానసూర్యుడు, ఆయనే సవితాదేవత!' అని అనుభూతి చెందుతూ ఉండాలి. పొద్దున్నే ఉదయించే సూర్యుడు వేరు, సవితాదేవత వేరు. పొద్దున్నే ఉదయించే సూర్యుడు సవితాదేవతకు ప్రతీక. అసలైన సూర్యుడిని మనము సవితాదేవత అని, ఆదిత్యుడు అని అంటాం. ఆ సూర్యుని కిరణములు మిమ్మల్ని నిలువెల్లా ముంచెత్తుతున్నాయి. సూర్యుని కాంతిలో మీరు నిలబడిన ప్రదేశములో పైనుండి బ్రహ్మవర్చస్ దిగివచ్చి మీ మెదడులోకి, ఊపిరితిత్తులలోకి ప్రవేశిస్తుంది. మీ పాదాల మొదలు భుజాల దాకా, జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు అన్నీ జ్ఞానగంగలో ఓతప్రోతమౌతూ ఉంటాయి. ఈవిధముగా మీరు జపము, ధ్యానము ఒక గంట సమయము వరకు చెయ్యవలసి ఉంటుంది. ఆరు గంటలకు అన్నీ పూర్తికావాలి. జపము చేసేటప్పుడు సంఖ్యగురించి

**ఓర్పు అనేది ఎంత చేదుగా ఉంటుందో దానివలన లభించే ఫలం అంత తియ్యగా ఉంటుంది**

పట్టించుకోవద్దు. ధ్యానము చేసేటప్పుడు మనస్సును సంఖ్యను లెక్కించడములోగాక, భగవంతునిపైన లగ్నము చెయ్యండి. జపములోనే ధ్యానం, ప్రకాశమనే జ్ఞానరూపములోనే ధ్యానం, జ్ఞానగంగను గురించిన ధ్యానం చెయ్యండి. జ్ఞానగంగ బాహ్య శరీరమును స్పృశించలేకపోవచ్చు, కానీ హృదయమును కడిగి వేస్తుంది. మనస్సును, బుద్ధిని పూర్తిగా ప్రక్షాళన చేస్తుంది. దేని గురించి అయితే మీకు చెప్తూ వచ్చానో, అసలైన జ్ఞానగంగ అదే!

## దైవీశక్తికి పిలుపు-ఆహ్వానము

బ్రహ్మవర్చస్సు, ఆత్మబలము, ఆత్మతేజముల యొక్క ప్రవాహమే అసలైన సూర్యుడు. ఆయనే మిమ్మల్ని ఉద్ధరించగలడు. ఆయనలోనుండే మీ అంతరంగములోకి ప్రేరణలు, స్ఫురణలు లభిస్తాయి. మా గురుదేవులు, భగవంతుడు, మేమందరము మీకు అవసరమైనవి సమకూర్చుతాము. వారి సూచనతోనే ఈ క్రొత్త కార్యక్రమము ప్రారంభమైనది. నేను చెప్పడము వల్ల ఈ పని ప్రారంభము కాలేదు. ఏదో ఒక గొప్ప శక్తి మిమ్మల్ని ఇక్కడకు లాక్కొనివచ్చింది. ఆ శక్తియే మీకు ఆత్మబలమును, బ్రహ్మ వర్చస్సును ఇస్తుంది. మీ జీవాత్మను సంస్కరించుకునే క్రమములో మీకు సహాయపడుతుంది. ఆ గంగ మీలోని మాలిన్యమును కడిగివేస్తుంది. ఆ ప్రకాశపుంజము మీ లోపల వేడిని ఉత్పన్నము చేస్తుంది. ఒక నెల తరువాత మీరు ఆత్మబలసంపన్నులై ఇక్కడినుండి వెళ్ళగలరు.

మీకు ఇక్కడి కాలనిర్ణయపట్టికను (టైం టేబుల్) అందిస్తున్నాము. ఇక్కడ ఉదయము గం॥ 6.15 ని॥లకు మాతాజీ మిమ్మల్ని తేనీటికి పిలుస్తారు. 6.30 గం॥ కల్లా ఆ కార్యక్రమము అయిపోగానే, గం॥ 6.45 ని॥లకు ప్రవచనము ప్రారంభమై గం॥ 7.45 ని॥ల వరకు కొనసాగుతుంది. 8 గంటలకు మా రెండవ కార్యక్రమము ఆరంభమౌతుంది. ఇందులో లోకనిర్మాణము ఏవిధంగా చెయ్యవలసి ఉంటుంది?' అనే విషయమై ధర్మవేదిక మాధ్యమముగా మొత్తము శిక్షణ ఇవ్వబడుతుంది. మీరు మీ గొంతును విప్పి తీరవలసినదే. అదే మీకు ముఖ్యమైన ఆయుధము కాగలదు. సంకోచపడుతూ మాట్లాడకుండా ఉంటే కార్యక్రమము నెరవేరేదెలా? మీ మనసులోని దానిని వాక్కు (అగ్ని) ద్వారానే ఇతరుల మనస్సులలోకి ప్రవేశపెట్టగలరు. ప్రవచనము ఎలా ఇవ్వాలి? దీని గురించి మీకు మంచి శిక్షణ ఇవ్వబడుతుంది. మీకు బాగా మాట్లాడటము వచ్చేదాకా ఎక్కువ సమయము దీనికి కేటాయించబడుతుంది.

అటుపైన మిమ్మల్ని రెండు రకాలైన ప్రజలవద్దకు పంపుతాము. మా సంపర్కములోకి వచ్చికూడా ప్రకాశమును పొందలేనటువంటి లక్షలాదిమంది వ్యక్తులు అందరు మొదటి రకమునకు చెందిన వారు. మిమ్మల్ని మేము రామబాణంవలె తయారు చేసి, ఎక్కడైనా హనుమంతుల వంటి వ్యక్తులు కనిపిస్తే వారికి ప్రేరణ నివ్వటానికే మిమ్మల్ని పంపుతున్నాము. హనుమంతుని వంటి శక్తిమంతులు మావద్ద ఒక లక్షమంది ఉన్నారు. వారు శాఖా కార్యకర్తలు, సక్రియ సదస్యులు, అఖండజ్యోతి పాఠకుల రూపములో ఉంటారు. వాళ్ళు ఎంతో శక్తిమంతులు. శక్తిమంతులు కాకుంటే మేమెందుకు వారిని పిలిపించుకొని, వారితో సంబంధం ఏర్పరచుకుంటాము?

తోటమాలి మంచి మంచి పూలను ఎంచుకునేవిధంగా, మేము మా కుటుంబములో, పరివారములో మంచి ముత్యాలవంటి వ్యక్తులనే ఎంపిక చేశాము. అయితే మంచి ముత్యాలకు, రత్నాలకు సానబెట్టడమే మిగిలి ఉన్నది. మీరు ఇక్కడినుండి బయలుదేరి దేశమంతటా విస్తరించి ఉన్న మా కార్యకర్తలవద్దకు వెళ్ళి, వారికి తగిన ప్రేరణ, శిక్షణ నిచ్చి, ధైర్యమును పెంపొందించి వారిలో ఉత్సాహమును నింపి మార్గదర్శనము చెయ్యవలసి ఉన్నది. వారిని జాగృతము చెయ్యవలసి ఉంటుంది. ఈవిధమైన క్రియా కలాపాలకు సంబంధించి, మా ప్రాతఃకాల ప్రవచనము ఉంటుంది. మన కార్యకర్తలు ఎక్కడెక్కడ కనబడినాసరే మీరు వారితో 'ఇంత వరకు గురువుగారి సంపర్కములోకి రాని ప్రజల వద్దకు మీరు వెళ్ళండి. గురువుగారు గాయత్రీజపం, యజ్ఞం చేయించే వారిలో ఉన్నారు. జపము చేయించడం ద్వారా మన ఉన్నతికి సంబంధించిన శిక్షణ నిస్తారు. హవనము చేయించి అన్ని విధములైన మనో రథములు నెరవేరే మార్గమును తెలియ జేస్తారు' అని మాత్రమే వారికి తెలుసు. అయితే అది చాలా స్వల్పమైన జ్ఞానం. మేము గాయత్రీ జపం చెయ్యడం నేర్పిస్తామనే వారికి తెలుసు. జపము చేసేవారంతా శిష్యులుగా మారలేరు, జపము చేయించడముతోనే మేము ప్రారంభిస్తాము. అక్కడితో సమాప్తము కాదు. చెయ్యవలసినది చాలా ఉన్నది' అని వారికి సవివరంగా, అర్థమయ్యేటట్లుగా, వివరించి వారిని జాగృతము చెయ్యండి.

## నవనిర్మాణమునకు అవసరమైన ఆలోచనలు

ఈ నవనిర్మాణమునకు సంబంధించిన ఆలోచనలను ప్రజల చెంతకు చేర్చడం మన మొట్టమొదటి కర్తవ్యం. నవనిర్మాణమునకు సంబంధించిన ఆలోచనలు అంటే వ్యక్తిలోని ఔన్నత్యమును జాగృతము చెయ్యగలిగేటటువంటి, సమాజమునకు క్రొత్త జీవితమును ప్రసాదించగలిగేటటువంటి ఆలోచనలు అని అర్థము.

**ఇతరులకు హాని చెయ్యడం అంటే నీవు తవ్వుకున్న గొయ్యిలో నీవు పడటమే**

వివరముగా చెప్పాలంటే వ్యక్తి నిర్మాణం, కుటుంబ నిర్మాణం, సంఘ నిర్మాణం, సమగ్ర నిర్మాణం, ధర్మనిర్మాణం మొదలైనవన్నీ కలిస్తేనే అది సమాజమౌతుంది. పైన చెప్పబడిన అంశము లన్నింటినీ సమగ్రముగా ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించ వలసిన విధానమును గురించి సాయంకాల ప్రవచనములో బోధించబడుతుంది. అందుకు తగిన శిక్షణ ఇవ్వబడుతుంది. మన పండుగలు, సంస్కారములు కుటుంబమును నిర్మించుకునే విధానమును నేర్పించగలిగేంత శక్తివంతమైనవి. మేము చెప్పదలచుకున్న అంశములను ధర్మవేదికనుండే నేర్పించుతాము కానీ సంఘవేదిక మీదనుండి కాదు. ఈ వేదికయే మన మాటలను హృదయాలలోకి తీసుకునివెళ్ళగలదు.

ఇంజెక్షన్ ద్వారా మందును రక్తములోకి పంపించాలంటే ఒక మంచి సూది, దానికొక రంధ్రము ఉండాలి. సూదికి రంధ్రము లేకపోతే, మందు రక్తములోకి ప్రవేశించలేదు. అలాగే ధర్మము, ఆధ్యాత్మికత అనేవికూడా హృదయము దాకా ప్రవేశించగలిగేటటు వంటి అంశములు. రాజకీయములు, ఆర్థికశాస్త్రం, సాంఘిక శాస్త్రం వంటి శాస్త్రములన్నీ మానవుని మస్తిష్కము వరకు మాత్రమే చేరుకుంటాయి. హృదయందాకా చేరుకునే సామర్థ్యం వీటికి లేదు. కానీ మా పనులు, మాటలు అన్నీకూడా ప్రజల హృదయములలోకి మా మాటలను చేర్చటముతోనే ప్రారంభం అవుతాయి. అందుచేత ధర్మమే మాకు ఎల్లప్పుడూ ఆధారముగా నిలబడుతుంది. ధర్మవేదిక ద్వారా మేము మీకు కొన్ని విషయములను చెప్పాలనుకుంటున్నాము. **ప్రాచీన కాలములో అమలు చేయబడుతూండే 16 సంస్కారములు తిరిగి జీవంతము కావాలి. ప్రతి ఇంటిలోను వేదమంత్రముల ఋక్కులు ప్రతిధ్వనించాలి. ప్రతి ఇంటికి భారతీయ సంస్కృతి యొక్క సందేశము చేరాలి. గ్రామాలలో పండుగలన్నీ జరుపబడాలి, అందులో భారతీయ సంస్కృతి యొక్క ఋక్కులు ప్రతిధ్వనించాలి. మా సందేశము, శిక్షణల గురించిన విషయములు ప్రజలకు లభించాలి. ఇవన్నీ జరగాలన్నదే మా ఆకాంక్ష.**

## వ్యక్తిత్వమును సంస్కరించుకొనుట - రంగు వేయడము అనగా ఆధ్యాత్మికత

ఉదయంలో ఒక గంట సమయము పూజకు బాగా సరిపోతుంది. స్వచ్ఛమైన మనస్సుతో ప్రకాశమును గ్రహిస్తూ ఒక గంట సమయము జ్ఞానగంగలో స్నానం చేస్తుంటే చాలు. ఈమాత్రం పనితో మీ మనస్సును శుభ్రము చెయ్యడం రంగు వెయ్యడం అనే రెండు కార్యాలు పూర్తవుతాయి. జ్ఞానగంగలో, గాయత్రీ గంగలో స్నానము చెయ్యడము ద్వారా మీరు శుభ్రపడటమనే పని అవశ్యం జరుగుతుంది. మీరు స్వీకరించే సూర్యకాంతి మీ లోపల ఒక మెరుపుని ఉత్పన్నం చేస్తుంది. ఈ విధముగా ఒక నెల రోజుల పాటు చేస్తూ ఉంటే, మీ కన్నులలో, మెదడులో, వాక్కులో కాంతి ప్రస్ఫుటమౌతుంది. మీరు ఎంత స్వచ్ఛముగా, ఉజ్జ్వలంగా తయారౌతారో మీరే గమనించగలరు. దీనిని మీరు గ్రహించగలిగే సమయము ఉదయము 6.15 నిముషములు. మాకు లభించిన ప్రభావవంతమైన, మహత్వపూర్ణమైన శిక్షణను మీకు నేర్పిస్తాము. మాకు ఎవరో చెప్పిన విషయములను మీకు చెప్తున్నాము. ఇందులో మాది అని చెప్పుకునేదేమీ లేదు. మా గురువుగారు, మార్గదర్శకులు, మమ్మల్ని ముందుకు నడిపించిన వారు మాకు నేర్పిన అంశములనే మేము మీకు నేర్పిస్తున్నాము. అంతకుమించి క్రొత్త విషయమనేది ఏదీ లేదు. వ్యక్తి నిర్మాణం, సమాజ నిర్మాణం ఒకదానితో ఒకటి జోడింపబడి ఉన్నాయి. **వ్యక్తి ఎదిగితే సమాజము ఎదుగుతుంది. సమాజము ఎదిగితే వ్యక్తి ఎదుగుతాడు.** వ్యక్తి, సమాజమును వేరుచెయ్యలేము. వ్యక్తి ఒంటరిగానే ఎదుగుతాడు, తనకు తాను మేలు చేసుకుంటాడు. సంఘముతో ఎలాంటి అవసరం లేదు' అనేది వట్టిమాట. **సమాజముతో కలిసి ఉండే వ్యక్తిమాత్రమే ముందుకు సాగగలడు. ఒంటరివ్యక్తి ఏమీ చెయ్యలేడు.** గడియారపు ముల్లు ఒంటరిగా ఏమీ చెయ్యలేదు. గడియారముతో కలిసి ఉంటేనే కదా దానికి విలువ!

ఇప్పటివరకు మేము చెప్పిన మాటలన్నింటిలోకి మీరు ఎక్కువగా దృష్టిసారించవల్సిన విషయము ఏమిటంటే జ్ఞానగంగను, ప్రకాశమును మీరు ధ్యానము చెయ్యడము అనేది జరగాలి. ఏదో ఒక జ్ఞానగంగ, ప్రేరణాత్మకమైన భావనలనే గంగ, ప్రతి నిముషం మీ హృదయమును, భావనలను స్పృశిస్తూ ఉన్నట్లు నిరంతరము మీరు అనుభూతిచెందవలసి ఉంటుంది. అజ్ఞాత లోకములనుండి వెలువడుతున్న ప్రకాశ కిరణములు ఎల్లవేళలా మీ మెదడును, వాక్కును, అంతరమును, హృదయమును స్పృశిస్తున్న అనుభూతి మీకు కలగాలి. ఇదే మా బలము, సంపద, శిక్షణ. ఇదే మా వరం, ఆశీర్వాదం కూడా! మీరు దీనిని తీసుకొని వెళ్ళి మా పనులను చెయ్యండి. మిమ్మల్ని మీరు ఉద్ధరించుకోండి. దేశమును, మానవజాతిని ఉన్నతస్థితికి చేర్చండి. దేనికోసమైతే మిమ్మల్ని పిలిపించామో ఆ ప్రకాశమును తీసుకునే వెళ్ళండి. స్వస్తి.

*- అఖండజ్యోతి, 2012*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**ఎన్ని చిక్కు సమస్యలున్నా నిబ్బరంగా ఉండాలి**

నా వారితో నా మాట

# నిందించకండి - ప్రోత్సహించండి

వ్యక్తిగతంగా మన నిజజీవితంలో జీవిస్తున్నప్పుడు, సామూహికంగా మిషన్ కుటుంబంలో జీవిస్తున్నప్పుడు కూడా నకారాత్మక (negative) ఆలోచనల నుండి, నిషేధాత్మక చర్చల నుండి దూరంగా ఉండాలి. మనలో మనం మాట్లాడు కుంటున్నప్పుడు కాని, బయటి వారితో చర్చిస్తున్నప్పుడు కాని దోషపూరిత ఆలోచనలు, కలుషిత చర్చల్ని ఎవరైనా ప్రోత్సహిస్తూ ఉంటే తక్షణం వాటికి అడ్డుగోడ కట్టాలి. అలా చేయలేకపోతే మన వ్యక్తిగత, సామూహిక జీవితాలలో మనోబలం దెబ్బ తింటుంది. మనోబలం క్షీణించిన చోట ప్రగతి సాధ్యం కాదు, ఏదీ ముందుకు సాగనే సాగదు. ఇలా చాడీలుచెప్పే వాళ్ళు, నిందించేవాళ్ళు, ఎటు చూస్తే అటు లోటుపాట్లను ఎత్తిచూపే వారు, కాలనేమిలాగా స్నేహపు ముసుగు వేసుకున్న జిత్తులమారి వంటివాళ్ళే. ఇటువంటి వారికి హనుమంతుడి దారిలో గులకరాళ్ళు వేయడం తప్ప వేరే పని లేదు. ఆయన చేసే శ్రీరామ కార్యాన్ని అడ్డుకుంటూనే ఉంటారు.

చాలాసార్లు ఇటువంటి వాటిని సామాన్యమైనవి అనో, క్షుద్రమైనవనో భావించి పట్టించుకోరు. ఇటువంటి మాటలు సామాన్యులనే కాదు, ప్రతిభావంతులనుకునే వాళ్ళని కూడా తమ మోహజాలంలో బంధిస్తాయి. ఎందుకంటే చాలాసార్లు 'సమీక్ష' లాంటి ఆకర్షణీయమైన పదాలను ఉపయోగిస్తుంటారు. కానీ వీరు సమీక్ష అంటే దోషాలు ఎత్తి చూపడం మాత్రమే కాదు అని తెలుసుకోరు. లోటుపాట్లను ప్రచారం చేయడం కాదు. సమీక్షలో అన్ని గుణాల గురించి చర్చించాలి. విషయాన్ని తప్పు దోవపట్ట నివ్వకుండా, సార్థకమైన విశ్లేషణ చేస్తూ ఖచ్చితమైన మార్గదర్శనంతో సముచితమైన తీర్మానాలను ప్రతిపాదించాలి. అనవసరంగా తప్పులను ఎత్తిచూపిస్తూ, విషయాన్ని తప్పుదోవ పట్టేవాళ్ళు పరిజనుల జీవితం గురించి కానీ, మిషన్ యొక్క సామూహిక జీవితం గురించి కానీ పట్టించుకోరు. శ్రద్ధ, నిష్ఠలను ఎలా దెబ్బ కొట్టాలా అని పన్నాగం పన్నుతుంటారు. పగలు రాత్రి కష్టపడే పరిజనుల మనోబలాన్ని దెబ్బకొట్టాలి, అప్పుడు కాని తీవ్రగతితో నిరంతరం అభివృద్ధి చెందుతున్న మిషన్ కుంటుపడదు. కాలనేమి ఎంత మధురంగా రామనామం జపిస్తే మాత్రం, అసలైన లక్ష్యం మాత్రం రామకార్యంలో అడ్డుపడడమే కదా.

మహాభారతంలోని ఒక ఘట్టం, దీన్ని తెలుసుకుని, అర్థం చేసుకోవడం చాలా అవసరం. మద్ర దేశపు రాజు శల్యుడు, పాండురాజు భార్య మాద్రికి స్వయానా అన్న, పాండవులకు మేనమామ. యుద్ధంలో పాండవులకు సహకరించడానికి బయలు దేరారు. దారిలో దుర్యోధనుడు కుట్రతో ఆయనకు స్వాగతం పలికాడు. శల్యుడు మాత్రం అది ధర్మరాజు చేస్తున్న సత్కారమనే అనుకుని వాటన్నింటిని స్వీకరించాడు. యుద్ధభూమి చేరుకున్నాక కాని నిజం తెలియలేదు. అప్పటికే చాలా ఆలస్యమైపోయింది. యుధిష్ఠరుడి దగ్గరకు వెళ్ళి, 'నాయనా! నీవు నాకు అత్యంత ప్రీతిపాత్రుడవు. కాని దుర్యోధనుడి సత్కారం స్వీకరించినందుకు గాను నేను అతని పక్షానే యుద్ధం చేయాలి. కాని నీవు ఒక వరం కోరుకో.' అన్నాడు. పాండవులు శ్రీకృష్ణుడి సలహా తీసుకున్నారు. 'దుర్యోధనుడి సైన్యంలో కర్ణుడు అజేయుడు. భీష్మ పితామహుడు, ద్రోణాచార్యులు అజేయులైనప్పటికి వారు హృదయ పూర్వకంగా ధర్మరాజు విజయం కోరుకుంటున్నవారు. కాని కర్ణుడి సంగతి అలా కాదు. అతను వారంతటి వీరుడే. ఇప్పుడు భీష్ముడు అతన్ని అర్ధరథుడని చెప్పి యుద్ధానికి దూరంగా ఉంచాడు, కాని భీష్ముడు తప్పుకున్న రోజు కర్ణుడు రంగంలోకి దిగుతాడు. పరమ గురువు పరశురాముడి శిష్యుడు, మహావీరుడు అయిన కర్ణుడిని ఓడించడం అసంభవం.

శల్యుడు మాత్రమే ఈ అసంభవాన్ని సంభవం చేయగలడు. నేను యుధిష్ఠరుడి కోసం ఏదైనా చేయగలను, ఎలా చేయాలో తెలియజేయమని శ్రీకృష్ణుడిని అడిగాడు శల్యుడు. 'కర్ణుడు సైన్యానికి సేనాని అయినప్పుడు మీరు అతని రథసారథిగా ఉండండి. నేను అర్జునుడికి సారథిగా ఉండి అతని మనోబలాన్ని పెంచుతాను. మీరు కర్ణుడికి సారథుడిగా ఉండి అతని మనోబలాన్ని నిరంతరం తగ్గిస్తూ ఉండాలి. ఇందుకోసం మీరు కర్ణుడి వ్యక్తిగత జీవితంలోవి, దుర్యోధనుడి సైన్యంలోని లోటుపాట్లు వినిపిస్తూ ఉండండి. అతన్ని, అతని సైన్యాన్ని నిరంతరం నిందిస్తూ అతని మనోబలాన్ని కృంగజేయండి.'

శల్యుడు శ్రీకృష్ణుడు చెప్పినట్టే సరైన సమయానికి సారథ్యాన్ని వహించి కర్ణుడిని, సైన్యాన్ని నిందిస్తూ అంచలంచలుగా, పలు రకాలుగా అతని మనోబలాన్ని దెబ్బతీసాడు. యుద్ధంలో అతను ఏకాగ్రత కోల్పోయాడు. చివరికి శ్రీకృష్ణుని ప్రణాళిక నెరవేరింది. కర్ణుడి వంటి మహావీరుడు, అజేయుడు, నిష్ఠాపరుడు ఓడిపోయి వీరస్వర్గం పొందడం వల్ల కౌరవులు ఓడిపోయారు.

**మనిషికి నిజమైన సంపద సంతృప్తి**

నింద ప్రభావం అలాంటిది. మనలోని, మన సహచరుల లోని, మార్గదర్శక తంత్రంలోని లోటుపాట్లను మాత్రమే చర్చిస్తూంటే మనసులో నిరాశ కమ్ముకుంటుంది. మనోవిజ్ఞానం ఆత్మ స్వీకృతిని అన్నిటికన్నా ముఖ్యమైనదిగా చెప్తుంది. అది మన ద్వారా పుట్టినప్పటికి, చుట్టుపక్కల వాళ్ళ ప్రభావం, శ్రేయోభిలాషుల ప్రభావం దాని మీద ఎక్కువ ఉంటుంది. కాబట్టి నిందించే వారెప్పుడు కాలనేమి రూపం దాల్చిన స్వజనులే.

ఈ మనోవైజ్ఞానిక తథ్యాన్ని మనవాళ్ళందరు అర్థం చేసుకోవడం చాలా అవసరం. నకారాత్మక (negative) ప్రదర్శన వల్ల కలిగే హానికరమైన ప్రభావం గురించి తెలుసుకుని దాని స్థానంలో సకారాత్మక (positive) ప్రక్రియను అవలంబిస్తే ఎంతో తేడా తెలుస్తుంది. గోతులు తవ్వడానికి, గోడ కట్టడానికి ఉన్నంత తేడా. గోతుల్లో మనుషులు కూరుకుపోతారు, గోడ పనికొస్తుంది, దూరం నుంచి కనిపిస్తుంది కూడా. మనవాళ్ళందరిలో ఎంతో గొప్ప శారీరిక సామర్థ్యం, తెలివి, కార్యకౌశలం, శ్రేష్ఠమైన వ్యక్తిత్వం ఉన్నాయి. వారు తమతమ స్థానాలలో ఉన్నా, శాంతికుంజ్‌లో ఉన్నా ఈ విషయాలను ఉత్సాహంతో చెప్తే దాని పరిణామం, ప్రభావం ఎంతో గొప్పగా ఉంటుంది.

ఇది వంచన కాదు, మిథ్యాచారం కాదు. ప్రతి ఒక్కరిలోను ప్రశంసించగల, ప్రోత్సహించగల తత్త్వం ఎంతో అంత ఉండనే ఉంటుంది. చిన్న చిన్న శారీరిక రోగాలను నయం చేసుకోవడానికి వేలకు వేల రూపాయలు ఖర్చుపెట్టగాలేనిది, కొంచం మంచి అన్నవాటిని ప్రోత్సహిస్తే తప్పేముంది, పైగా ఖర్చు కూడా లేదు.

ఇలాంటి ప్రోత్సాహం పరిజనుల నిజజీవితాలకు, మిషన్ సామూహిక జీవితానికి ఎంతో సహకారంగా, ఉపయుక్తంగా ఉంటుంది. ఆసురీ తత్త్వాలు కొరలు చూపిస్తున్న వేళలో ఒకరికొకరం మనలోని మంచిని పరస్పరం గుర్తుచేసుకుంటూ ఉండాలి. సకారాత్మక అవకాశాలను చూపించి ప్రోత్సహించాలి, ఉజ్జ్వల భవిష్యత్తు కలలను కనాలి. చాలా పెద్ద మొత్తాల్లో ధనాన్ని దానమివ్వడం కన్నా ఈ భావనాత్మక అనుదానం చాలా గొప్పది. ధనంతో అవసరాలు తీరచ్చు, వనరులు సమకూరవచ్చు. కాని వ్యక్తిత్వంలో ప్రసన్నతని పెంచి పోషించడంతో పోలిస్తే ఎటువంటి బహుమానమైనా గొప్పది కాదు.

అయితే ఇలాంటి పరిస్థితుల్లో చెప్పేవాళ్ళు, వినేవాళ్ళు అందరు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. నిజంగానే ఎవరైనా తప్పు చేస్తున్నా, వారిలో ఏదైనా లోటున్నా, దాన్ని తొలగించాలంటే వారిని నిందించకూడదు. అందరి ముందు దాని ప్రస్తావన తీసుకు రాకూడదు. ఒంటరిగా ఉన్నప్పుడు అతనిలోని ఈ దోషాన్ని చాలా సామాన్యమైనదిగా చూపిస్తూ, దానిని ఎలా వదిలించుకోవచ్చో చెప్పాలి. దోషం గురించి వీలైనంత తక్కువగా మాట్లాడి, మెరుగు పరుచుకునే మార్గాన్ని గురించి ఎక్కువగా చర్చించాలి. మీకు వీలైతే రచనాత్మకమైన ఉపాయాలను, సలహాలను ఇవ్వాలి. ఎలాంటి సమస్య అయినా సరే, దాని సమాధానం, ఉజ్జ్వల భవిష్యత్తు గురించిన చర్చే ఎక్కువ జరగాలి.

ఎవరైనా మనలను తప్పుపడుతుంటే వాటి గురించి ఆలోచించాలి. తప్పు జరిగితే సవరించుకోవాలి. ఊరికే తప్పులు పట్టేవారి మాటలను పట్టించుకోకూడదు. మనము ఆరాధిస్తున్న వారిని నిందిస్తే అలాంటి వాళ్ళని అల్పజ్ఞులని భావించి మరచి పోవాలి. ఇలాంటివి విని బాధపడక్కర్లేదు, శ్రద్ధను కోల్పోనక్కరలేదు. అయినప్పటికీ ఇలా నకారాత్మకంగా నిందిస్తూ ఉంటే, అలాంటి వారి నుండి దూరంగా ఉండడమే మంచిది. కాని ఈ పని ఎంతో తెలివిగా, చాలా జాగ్రత్తగా చేయాలి. పట్టించుకోవట్లేదు, అలిగారు, సహకరించట్లేదు అనే కొత్త ఆరోపణలని రానివ్వకండి. అలా చేస్తే పరిస్థితి ఇంకా హీనంగా తయారవుతుంది.

మన చుట్టుపక్కల వాతావరణం హానికరమైన తత్త్వాలతో ఉండి ఉంటుంది. అటువంటి వాటినుండి అప్రమత్తంగా ఆత్మరక్షణ చేసుకుంటూ ఉండాలి. ఎక్కడో అక్కడ, ఎప్పుడో అప్పుడు మనోబలాన్ని కూడా దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతూ ఉంటాయి. మన చుట్టు పక్కలే ఉండే ఈగలు, దోమలు, చెదలు, క్రిమికీటకాల వల్ల కలిగే నష్టం, కష్టం మనం చూస్తూనే ఉంటాం.

దొంగలు, దోపిడీదారులు, సోమరిపోతులు అకారణంగానే మీదపడి విసిగిస్తుంటారు. సన్నిహితునిగా వచ్చి శత్రుత్వం చూపించడం, మోసం చేయడం నేడు మామూలైపోయింది. గాలిలో, నీళ్ళలో ఉండే జీవులు, విషాణువులు ఏదో విధంగా శరీరంలో జొచ్చుకెళ్లి లోలోపల కుళ్ళబరుస్తూ ఉంటాయి. వీటినుండి తప్పించుకోవడానికి ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటూనే ఉండాలి. ఇదే విధంగా మనోబలాన్ని దెబ్బతీసే ఇలాంటి ఎదురుదాడులు చూడడానికి, వినడానికి చాలా మామూలుగా అనిపించినా ఎంతో నష్టాన్ని కలగజేస్తాయి. మనందరము కలసికట్టుగా మన ఈ మిషన్‌ను అభివృద్ధి చేయాలి. జీవితంలోని ఎన్నో అవసరాల లాగానే ప్రోత్సాహం, ప్రేరణ కూడా చాలా అవసరం. మన కోసం మనం గాలి, నీరు, బలమైన ఆహారం సమకూర్చుకున్నట్టే, మిషన్ కోసం కూడా నిరంతరం కృషి చేస్తూనే ఉండాలి.

*– అఖండజ్యోతి, మే 2013*

*అనువాదం: శ్రీ ఎం.వి.ప్రసాద్, జయలక్ష్మి*

**తిని కూర్చుంటే కొండలయినా కరిగిపోతాయి**

# శాంతికుంజ్‌లో జరిగిన సంజీవని సాధనా శిబిరంపై ఒక సమీక్ష

2013 మే 1 నుండి 5 వరకు ఐదురోజుల సంజీవని సాధన శిబిరము శాంతికుంజ్, హరిద్వార్‌లో నిర్వహింపబడింది. ఈ శిబిరంలో చాలా మంది స్త్రీ, పురుషులు రాష్ట్ర నలుమూలల నుండి 220 మంది పాల్గొనిరి. వీరిలో 80 నుండి 85 శాతం మంది ప్రప్రథమంగా శాంతికుంజ్‌ను దర్శించుట జరిగింది. క్రొత్తవారై నప్పటికి అత్యంత శ్రద్ధాసక్తులతో కార్యక్రమాలలో పాల్గొన్నారు.

2013 ఏప్రిల్ 30వ తేది సాయంత్రం 5 గంటలకు హాజరైన సాధకులకు శ్రీ పరమానంద ద్వివేదిగారు సంకల్ప దీక్షను ఇచ్చుట జరిగింది. ప్రతిరోజు ఉదయం 6 నుండి 7 గం॥ల వరకు యోగసాధన శ్రీ తోషన్‌గారు నిర్వహించారు. శ్రీమతి ప్రశాంతి శర్మ హిందీ ప్రవచనాలను తెలుగులోనికి తర్జుమా చేసి చెప్పారు.

మరునాడు మే 1వ తేది నుండి సంజీవివి సాధనా శిబిరం గురు ప్రార్థనతో ఉదయం 9 గంటలకు ప్రారంభమైనది.

డా॥ సందీప్‌కుమార్, రిజిస్ట్రార్, దేవసంస్కృతి విశ్వ విద్యాలయం వారి "సాధనా-సిద్ధి" అనెడి విషయంపై హిందీలో ప్రసంగించారు.

మధ్యాహ్నం 2.30 గంటలకు శాంతికుంజ్ పనిచేసెడి పద్ధతిని, వివరించి తదుపరి అందరిని రెండు గ్రూపులుగా విడదీసి, శివాజిగారు ఒక గ్రూపును, తోషన్‌గారు మరియొక గ్రూపును, వెంట నిడుకొని శాంతికుంజ్‌ను చూపించుట జరిగింది.

రాత్రి 6.30 గంటలకు, శ్రీ అభయ్ సక్సేనాగారు దేవ సంస్కృతి విశ్వవిద్యాలయాన్ని గురించి, బోధనాంశాల గురించి, దాని లక్ష్యాల గురించి వారి ప్రవచనంలో వివరించారు.

మే 2వ తేది నుండి 5వ తేది వరకు ఉదయం 6 నుండి 7 వరకు శ్రీ తోషన్‌గారు యోగా క్లాసును నిర్వహించారు. ఉదయం 9 గంటలకు, డా॥ ప్రమోద్ భట్నాగర్, హర్యానా యూనివర్సిటీ రిటైర్డు ప్రొఫెసరు గారు "ఆలోచనా శక్తి" దాని విశిష్టతల గురించి, పూజ్య గురుదేవులు, ఆలోచనాశక్తికిచ్చిన ప్రాధాన్యతను వివరించారు. తన ఆలోచనల ద్వారా మనిషి దేవతగా/రాక్షసునిగా మారగలడని, అదేవిధంగా తన జీవితాన్ని మలచుకొనునని వివరించారు.

మధ్యాహ్నం 2.30 గం॥లకు డా॥ నమో నారాయణగారు గాయత్రీ విజ్ఞానంపై ప్రవచించారు. సాయంత్రం 4 గంటలకు శ్రీ పరమానంద ద్వివేదిగారు మనస్సు, బుద్ధి, చిత్తం వాని విశ్లేషణ ఇచ్చి ఇచ్చి ఒక చక్కని అవగాహన కల్పించారు.

రాత్రి 6.30 గంటలకు డా॥ ఒ.పి.శర్మగారు గాయత్రీ మంత్రార్థాన్ని విశదీకరించి, ఉదాహరణలతో వివరించారు.

3వ తేది ఉదయం 7 గంటల నుండి గురు మంత్రదీక్షను అందించుట జరిగింది. శ్రీ పరమానంద ద్వివేదిగారు 220 మందికి మంత్రదీక్షనందించారు. ఉదయం 9.30 గంటల ప్రవచనంలో శ్రీ దినేష్ పటేల్ జ్ఞానయజ్ఞాన్ని గురించి అత్యంత ప్రేరణాత్మకంగా మార్గనిర్దేశనం గావించారు.

సాయంత్రం 6.30 గంటలకు డా॥ బ్రిజ్‌మోహన్‌గౌర్‌జీ సంస్కారాల ప్రాధాన్యతను వివరిస్తూ ఇంటింటికి వెళ్ళి సంస్కారాల వ్యాప్తి చేయండి అని ఉద్బోధించారు.

2013 మే 4న ఉదయం 6 నుండి పితృతర్పణ కార్యక్రమం శ్రీ శివాజీగారు నిర్వహించారు. 130 మంది దీనిలో పాల్గొన్నారు.

## ప్రవచనాల సారాంశము

### 30.04.2013 శ్రీ పరమానంద ద్వివేదిగారి దీక్షా ప్రవచనం:

శిక్షణా శిబిరానికై విచ్చేసిన మీరంతా చాలా భాగ్యశాలురు, ప్రతినిత్యము 24 లక్షల గాయత్రీ జపం, 18 నుండి 27 కుండముల గాయత్రీ యజ్ఞము నిర్వహించబడుచున్న విశ్వంలోనే ఏకైక గాయత్రీ పుణ్యతీర్థంలో అడుగుపెట్టిన మీరు ధన్యజీవులు. నేటి యుగంలో సమయదానమిచ్చెడివారు కరువైనారు. బంగారు పనిచేసెడి కంసాలీల ఇళ్ళవద్ద, వీధులు, ఊడ్చేవారు, అచ్చట ప్రోగుచేసిన దుమ్ము జల్లెడపట్టి విలువైన బంగారు కణాలను వెలికితీస్తారు. అట్లే పూజ్యగురుదేవులు ఆంధ్రప్రదేశ్‌లో జల్లెడపట్టి, మిమ్ములను జల్లెడ పట్టించుకొని ఈ శిబిరంలో మీకు శిక్షణనిచ్చి మహామానవులుగా, దేవమానవులుగా తీర్చిదిద్దుటకు కావలసిన బీజాలను మీలో ప్రవేశ పెట్టుట జరిగింది. మీరు మీ మానసిక భూమిలో దేవత్వంతో నిండిన మహావృక్షాల వంటి దేవ మానవులుగా ఎదగాలి. మానవులైన తల్లిదండ్రులు తమ బిడ్డల ఆలన, పాలన చూస్తూ వారికి తోడ్పాటు నందిస్తూ, వారి జీవితాలను సుఖశాంతులతో నింపి ఉన్నతులు తయారు చేయుటకు, ఏ రీతిగా కృషి సల్పెదరో, పూజ్యగురుదేవులు మాతాజీ ప్రియతమ బిడ్డలైన మిమ్ములను అడుగడుగునా మార్గ దర్శనం చేస్తూ మిమ్ములను తీర్చిదిద్దెదరు. ఆ ఋషియుగ్మం అందించెడి అనుదానాలను స్వీకరించుటకై మిమ్ములను మీరు తీర్చిదిద్దుకొంటూ అర్హతను పొందండి, వారి పరిపూర్ణ ప్రేమకు పాత్రులు కండి, దీక్షాబద్ధులుకండి, నరులలో నారాయణులుగా ఎదగండి. పై విధంగా సాధకులను ఉద్బోధించి తగిన ప్రేరణనందిస్తూ వారికి సంకల్పాన్ని ఇచ్చారు.

**చేసే పనిని ఆస్వాదించాలి**

**01.05.2013:**

సంజీవిని శిక్షణా శిబిర ప్రారంభదినాన ఉదయం 9 గంటలకు గాయత్రి సాధన ద్వారా సిద్ధిని పొందుట అనెడి విషయంపై డా॥ సందీప్‌కుమార్ దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ చక్కని ప్రసంగము ఇలా సాగింది.

పూజ్య గురుదేవులు 1971 నుండి 1990 వరకు ఇచ్చట నిత్యసాధన చేశారు. దీనిని గాయత్రీ తీర్థంగా మలచారు. భౌతిక లాభాలను లేక ఆధ్యాత్మిక లాభాలను పొందాలన్నా సాధన తప్పనిసరి. గురువు అందించెడి జ్ఞానాన్ని అందుకొనుటకు శిష్యుడు మానసికంగా తగిన రీతిలో సిద్ధంగా ఉండి తన మనస్సును తన అధీనంలోనికి తెచ్చుకోవాలి. లేనిచో సాక్షాత్తు ఆ బ్రహ్మయే గురువుగా విచ్చేసినను ఫలితముండదు. మానవుడు కడు స్వతంత్రుడు. అతని మనస్సును స్వయంగా అతను తప్ప మరొకరు నియంత్రించజాలరు. అందువలన పూజ్య గురుదేవులు తన అనుంగు శిష్యులతో తరచూ అంటూ ఉండేవారు. "మీ అంతః కరణంలో ప్రవేశించుటకై నన్ను మీరు అనుమతించుటలేదు" అనగా శిష్యుడు తన ఇచ్ఛాశక్తిని తన యొక్క సద్గురుని అధీనంలో ఉంచినచో వివేకానందునిలా మారిపోగలడు. అప్పుడే మీలోనికి గురువు శక్తి ప్రవేశించి, రెండు శక్తులు ఏకమై ఒక ప్రచండ శక్తిగా మారుతుంది. అద్భుత ఫలితాలను చవిచూడగలం. సమాజగతిని మార్చగలరు. కావున సాధన ద్వారా మీలోని లోపాలను సవరించుకోండి. శంకరాచార్యులు, వివేకానందులు, పూజ్యగురుదేవులు కఠోర సాధనలతో మహాపురుషులుగా ఎదిగారు. మట్టిలో ఖనిజంగా ఉన్న ముడి బంగారం, వెండి, ఇనుము, అగ్నిబట్టిలో తపింపబడిన పిదప, తమలోని మలినాలు తొలగించుకొని శుద్ధ లోహాలుగా రూపుదాల్చుతాయి. అదే రీతిలో మీరు కూడా సాధన అనెడి అగ్నిలో తపింపబడిననేగాని మీలోని లోపాలు తొలగి, శుద్ధ మానవులుగా అనగా దేవమానవులుగా మారెదరు. ఇది మొదటి మెట్టు.

**2వ మెట్టు కష్టాన్ని సహించెడి గుణం:**

మీరు సాధనా మార్గంలో ఎదురయ్యెడి కష్టాలను, నష్టాలను సహించెడి గుణాన్ని పెంపొందించకోవాలి. సామాన్య మానవుడు కష్టనష్టాలకు దుఃఖిస్తాడు, సుఖ సంపదలకు అహంకారి అవుతాడు. కాని మహాపురుషులు పై రెండు స్థితుల యందు కూడా వారు ఒకే రీతిలో ఉంటారు. వారి సమతుల్యతను కోల్పోరు. ధైర్యాన్ని విడువరు. మనలోనున్న మూడు గుణాలైన సత్వ, రజో, తమో గుణాల మధ్య సమతుల్యతను సాధించాలి. తమో గుణాన్ని నియంత్రించుకుంటూ జడత్వాన్ని విడనాడాలి. రజోగుణాన్ని పెంపొందించుకొంటూ, వికసిత మార్గం వైపు నడవాలి. ప్రగతిబాటను పట్టాలి. అహంకారానికి తావివ్వక సతోగుణాన్ని పెంపొందించుకుంటూ ఉండాలి. జనక మహారాజులా చిత్తవృత్తులను నిరోధించి కర్తవ్యపరాయణునిగా జీవించాలి. భోగాలకు దూరంగా ఉండాలి. అప్పుడు మూడవ మెట్టులోనికి ప్రవేశించగలడు.

**3వ మెట్టు దేవత్వ వికాసం:**

రాక్షసులైన రావణుడు, కంసుడు, హిరణ్యాక్షుడు, హిరణ్య కశ్యపుడు మున్నగువారు గొప్ప తపశ్శాలురు. కాని వీరు తమ వ్యక్తిత్వాన్ని భగవంతునిలో సంవిలీనం గావించజాలకపోయారు. తత్ఫలితంగా వారిలోని అహంభావం, అహంకారాలు వారి తపశ్శక్తిని నిర్వీర్యం గావించాయి. చరిత్రహీనులై, లోకకంటకులుగా మారి, వారి వినాశనాన్ని వారే ఆహ్వానించుకొన్నారు. అదే మహర్షులైన విశ్వామిత్రుడు, దధీచి, ప్రహ్లాదుడు మున్నగువారు తమ వ్యక్తిత్వాలను భగవంతునిలో సంమిళితంగావించి, తద్వారా ఆ భగవత్ శక్తితో చరిత్ర ప్రసిద్ధులై లోకపూజితులయ్యారు. వీరంతా భగవంతుని చేతిలో ఒక యంత్రంలా మారిపోయారు. అజరామరులైనారు.

మీరు ఈ రీతిలో గాయత్రి సాధనను చేపట్టి, కష్టాలను సహిస్తూ, ఓర్పు సహనశీలతలతో మీలోని దేవత్వాన్ని వికసింప జేసుకుంటూ దేవమానవులుగా ఎదగాలి. ఇదే సాధనలో సిద్ధిని పొందుట.

**సాయంత్రం 6.30 గంటలకు:**

డా॥ అభయ్ సక్సేనాగారు దేవ సంస్కృతి విశ్వవిద్యాలయాన్ని గురించి విపులీకరించిరి. ఈ విశ్వవిద్యాలయంలో ప్రవేశానికి ప్రవేశ పరీక్షలు దేశంలో 6 చోట్ల నిర్వహించుచున్నారు. ప్రస్తుతం ఉత్తర భారతదేశానికే పరిమితమైయున్నది. ఆంధ్రప్రదేశ్ నుండి దాదాపు 15 మంది విద్యార్థులు విద్యనభ్యసించుచున్నారు. హిందీ మరియు ఆంగ్ల భాషా మాధ్యమాలుగా విద్యాబోధన జరుగుతూ ఉంటుంది. యూనివర్సిటీ గ్రాంట్సు కమీషన్ గుర్తింపు ఉన్నది. యోగ విద్యలో దేశంలో పేరెన్నికగన్న విశ్వవిద్యాలయం. ఇచ్చట యోగవిద్య అభ్యసించినవారికి చక్కని గుర్తింపు మరియు వీరి సేవలకు చక్కని డిమాండు ఉన్నది. పి.హెచ్.డి. వరకు యోగాలో శిక్షణనిచ్చెదరు. జర్మనీ, కెనడా, చైనా, ఆస్ట్రేలియా, అర్జంటీనా మున్నగు దేశాలలోని విశ్వవిద్యాలయాలతో కలిసి కోర్సులను నిర్వహించుట జరుగుచున్నది. 12వ తరగతి తరువాత నుండి డిగ్రీ కోర్సులలో ప్రవేశమున్నది. ఇంటర్‌నెట్ ద్వారా యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో బోధనకు సంబంధించిన కోర్సులను తెలిసికొనవచ్చు. ఒక్కొక్క విద్యార్థికి బోధనారుసుము, హాస్టలు ఛార్జీలతో కలిపి రూ. 24,000/- మాత్రమే వార్షిక ఖర్చు అవుతుంది. ఇంత చౌకగా విద్యనందించెడి విశ్వ విద్యాలయం ప్రపంచంలోనే లేదు. ప్రభుత్వం నుండి ఎటువంటి ఆర్థిక సహాయాన్ని పొందుట లేదు.

**కలసి ఉంటే కలదు సుఖం**

విద్యార్థులను స్వావలంబన దిశగా ఎదుగుటకు ప్రోత్సహించుచున్నారు. ఆ దిశలో విద్యాబోధన జరుగుతుంది. ఇచ్చట విద్యనభ్యసించెడి విద్యార్థులలో 70 శాతం బాలికలే.

**02.05.2013:**

ఉదయం 9 గంటలకు ఆచార్య ప్రమోద్ భట్నాగర్ (శాస్త్రవేత్త) గారి ప్రవచనం. నేడు ప్రపంచంలో ఆవిష్కరింపబడుచున్న కొత్త కొత్త శాస్త్ర విషయాలు, భౌతిక సాధనలను చూస్తే శరీరం గగుర్పొడుస్తుంది, ఆశ్చర్యాన్ని గొల్పుతుంది. ప్రపంచంలో ఎన్నో శక్తులున్నాయి. కాంతిశక్తి, ధ్వనిశక్తి, అయస్కాంతశక్తి, అణుశక్తి, వాయుశక్తి, ఇచ్ఛాశక్తి, మానసికశక్తి వగైరా వగైరా ఎన్నో ఉన్నాయి. భగవంతుడు మనిషికి మరే ప్రాణికి ఇవ్వని ఆలోచనాశక్తినిచ్చాడు. ఇది కాంతి వేగాన్ని మించిన వేగం గలది. మనలోని ప్రగతి లేక అధోగతి మన ఆలోచనల ప్రతిరూపమే. నరుని నుండి నర శ్రేష్ఠునిగా కూడా మారగలడు. కావున మనిషి తన ఆలోచనా విధానాన్ని వ్యక్తిత్వ నిర్మాణానికి, పరివార నిర్మాణానికి మరియు సమాజ నిర్మాణానికి సరియైన దిశలో వినియోగించాలి. మస్తిష్కంలో ఆలోచనలు వస్తాయి, అవి వాక్కులుగా, కర్మలుగా మారుతాయి. కావున తన ఆలోచనలపైన, తదుపరి వాక్కుపైన, తదుపరి కర్మలపైన దృష్టిని పెట్టాలి. అటు పిమ్మట తన అలవాట్ల పైన కూడా దృష్టిని సల్పాలి. ఉదాహరణకు ఒక ఆరోగ్యవంతుని "నీవు అనారోగ్యంగా ఉన్నావు, నీవు అనారోగ్యంగా ఉన్నావు" అని పదే పదే అతనికి వినిపిస్తూ పోతే క్రమక్రమంగా అతడు అనారోగ్యంగానే ఉన్నాననెడి భావనకులోనై నిజంగా అనారోగ్య వంతుడవుతాడు. అట్లే అనారోగ్యవంతుని "నీకు అనారోగ్యం లేదు, నీకు అనారోగ్యం లేదు" అనెడి ఆలోచన, అతని మస్తిష్కంలో ప్రవేశపెట్టినచో అతడు అతి త్వరలోనే కోలుకుంటాడు, ఆరోగ్య వంతుడవుతాడు.

సకారాత్మక (positive) ఆలోచనలతో నిండినవారు ఇతరులకు నాయకత్వం వహించి నాయకులుగా ఎదురుతారు. దీనికి ఉదాహరణలు కార్ల్‌మార్క్స్, రూసో జీవితాలు. కార్ల్‌మార్క్స్ చాలా పేదవాడు. అతడు సృజనాత్మక ఆలోచనలతో వ్రాసిన "ది కేపిటల్" అనే గ్రంథం ప్రపంచంలో కొన్ని కోట్లమంది ఆలోచనల ప్రభావితం చేసింది. వారి కార్యాచరణలను ఒక మలుపు త్రిప్పి ప్రపంచంలో సోషలిస్టు ప్రభుత్వాలకు రాచబాటవేసి ఆయా దేశాలలోని రాచరికపు వ్యవస్థను పెట్టుబడిదారీ వ్యవస్థలను కనుమరుగయ్యేలా చేసింది. దీనికి రష్యా, చెకోస్లోవేకియా, చైనా, రుమేనియా మున్నగు దేశాలు ఉదాహరణలు. అట్లే అమెరికా దేశపు నివాసి రూసో రచించిన గ్రంథం, ప్రపంచంలో ప్రజాస్వామ్య వ్యవస్థకు గట్టి పునాదులను వేసి పాలనను ప్రజల వద్దకు చేర్చింది. ప్రజలే ఎన్నికల ద్వారా తమ తమ ప్రభుత్వాలను ఎన్నుకొనెడి విధానాన్ని ప్రవేశపెట్టింది. అట్లే అమెరికాలో ఒక స్త్రీ వ్రాసిన పుస్తకం, బానిసత్వాన్ని రూపు మాపింది. నల్లవారు, తెల్లవారు సమానమైన హక్కులను పొందేలా చేసింది.

ఆలోచనలలో ఆకర్షణ శక్తి ఉంటుంది. రేడియో తరంగాల వలె ఆలోచనా తరంగాలు నలుదిశలా వ్యాపించి వాని ప్రభావాన్ని చూపిస్తాయి. రేడియో, టి.వి. ఆయా తరంగాలను అందుకొని ఏ రీతిలో ప్రసారం చేస్తాయో, అదే రీతిలో సకారాత్మక ఆలోచనలు కల్గినవారు ఆ ఆలోచనలను అందిపుచ్చుకొని స్పందించెదరు. ఇది అంతఃకరణ జాగృతినొందినవారు మాత్రమే చేయగలరు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ పురాణ కాలంలో ద్రౌపదీ వస్త్రాపహరణవేళ ద్రౌపది ఆక్రందనలనాలకించిన అతి దూరంలో నున్న కృష్ణుడు ఆమెను రక్షించుట. అట్లే పరమ పూజ్యులైన మన గురుదేవులు తనను దర్శించుటకై వచ్చిన వారి మనస్సులలోని ఆలోచనల పసిగట్టుట.

లక్నో నుండి తనను దర్శించుటకు వచ్చిన వారిలో ఒకడు "ఏమి గురువితడు, తలవంచుకొని వ్రాసికొనుచున్నాడే కాని, తనను దర్శింపవచ్చినవారిని కనీసం కన్నెత్తి అయినా చూచుట లేదు. నోరారా పలుకరించుట లేదు" అని భావించాడు మనస్సులో. ఇతని వంతురాగానే, గురుదేవులు తన తలను పైకెత్తి "ఏమి గురువితడు. దర్శింపవచ్చినవారిని పరామర్శించడు అని అనుకుంటున్నావు కదూ?" అని ప్రశ్నించగనే, అతడు నివ్వెరపోయి క్షమించమని గురువు పాదాలపై వ్రాలాడు. తగిన సాధన ద్వారా అందరూ దీనిని పొందగలరు.

సూర్యుని కిరణాలు, భూతద్దం ద్వారా ఏకీకృతమైనచో అవి అగ్నిని పుట్టిస్తాయి. ఇదే రీతిలో ఆలోచనాశక్తి కూడా ఏకాగ్రతతో కూడినదైనచో ఆశ్చర్యకరమైన ఫలితాలను అందిస్తుంది. విద్యార్థి స్థితి కూడా అనగా అతని సఫలత / అసఫలతలు అతని ఆలోచనల తీవ్రతపై, ఏకాగ్రతపై ఆధారపడి ఉంటాయి.

మనిషి అంతిమ శ్వాస సమయమందున్న అతని ఆలోచనలు, మరుజన్మలో అతడు పొందబోయెడి స్థితిని నిర్దేశిస్తుంది. దీనిని జ్ఞాపకముంచుకొని ప్రతి వ్యక్తి సకారాత్మక (positive) ఆలోచనల పెంపొందించుకొంటూ ఉండాలి. నకారాత్మక (negative) ఆలోచనల ప్రవాహాన్ని నిరోధించుటకై తాను కూర్చున్న చోటు నుండి ప్రక్కకు జరుగుట మంచిది.

చెట్టు నుండి రాలి క్రిందపడెడి పండును న్యూటన్‌కు పూర్వం అనేకులు చూచారు. కాని న్యూటన్ తన వినూత్న ఆలోచనా సరళితో గురుత్వాకర్షణ సిద్ధాంతానికి రూపకల్పన చేసి, ఆధునిక, వైజ్ఞానిక ప్రయోగాలకు మార్గం సుగమం చేశాడు. "చక్రవర్తి! నిన్ను శత్రువులు చుట్టుముట్టారు. వారి తూటాలను తప్పించుకొని ప్రాణాలతో నీవు బయటపడుట అసంభవం" అని నెపోలియన్‌ను

**నిజాయితీగా పని చేసుకుంటూ పోవాలి**

అతని సేనానులు హెచ్చరిస్తూ ఉంటే, నిర్భయంగా, దృఢ మనోబలంతో "ఈ నెపోలియన్ ఉక్కు గుండెను చీల్చగల్గెడి తూటా ప్రపంచంలో ఇంకా ఏ కార్ఖానాలో తయారు కాలేదు" అని గంభీరంగా జవాబిచ్చిన వజ్రసదృశమనోబలుడు నెపోలియన్.

కళింగ యుద్ధ సమాప్తానంతరం, యుద్ధ ఖైదీలను ప్రవేశ పెట్టమని అశోకుడు తన సేనానిని ఆదేశించగా, కేవలం ఒక్క ముసలివానిని ప్రవేశపెట్టారు. "ఏమిటది" అని ప్రశ్నించగా "ఇతడొక్కడే బ్రతికి ఉన్నాడు" అని జవాబిచ్చాడు సేనాని. అశోకుని చూస్తూ ఆ ముసలి వాడు "గెలిచి ఓడిన ఓ రాజా! ఎవరిపై రాజ్యం చేస్తావు" అని అవహేళనగా అశోకునితో మాటలాడగా, ఇతనిని ఖైదీ చేయండి" అని ఆదేశించాడు. ఆ రోజు రాత్రి ముసలి వాని మాటలు అశోకుని చెవిలో మార్మ్రోగుతూ ఉన్నాయి. నిద్ర పట్టలేదు. మరునాడు ఉదయం ముసలివానిని ప్రవేశపెట్టమని అశోకుడు ఆదేశించగా, "ఆ ముసలివాడు కూడా రాత్రి చని పోయాడు" అని జవాబు లభించింది. దీనితో అశోకుని హృదయం కకావికలైంది. ఆలోచనలు చెదరిపోయాయి. తన కాళ్ళక్రింద భూమి కంపించింది. ఇందరి ప్రాణాలు బలిగొన్న ఈ ఖడ్గం నాకు పనికిరాదు అని దానిని తుత్తునియలు గావించి, దుఃఖము పెల్లుబుకగా బుద్ధుని శరణువేడాడు. బుద్ధుని ప్రేమ స్పర్శతో శాంతిమార్గం పట్టాడు. కళింగ ప్రజల దృఢ సంకల్పం, యుద్ధ పిపాసి, కీర్తి పిపాసియైన అశోకుని శాంతి కాముకునిగా మార్చివేసి ధర్మ ప్రచారకుని చేసింది. ఇదే సంకల్ప శక్తికున్న గొప్పతనం.

ఇలా చరిత్ర పుటలలో అనేకానేక ఉదాహరణలున్నాయి. కాశీ పట్టణంలో ఒక పండితుడు తన భాషా పాండిత్యంలో అనేకమంది పండితులను ఓడిస్తూ, సత్కారాలు పొందుట ఒక ఆనవాయితీగా చేసుకున్నాడు. దీనితో అతనిలో గర్వం, అహంకారం తొణికిస లాడగా, అచ్చటనే ఉన్న ఒక వృద్ధుడు తిరస్కారంతో చూచాడు. ఇది చూచిన వృద్ధుడు, "నీవు అనేక మందిని తర్కంలో ఓడించావు, కీర్తి సత్కారాల పొందావు! దీనితో సామాన్య ప్రజలకు ఒనగూరిన లాభమేమి?" అని ప్రశ్నించాడు. కనువిప్పు కలిగిన ఆ పండితుడే తదుపరి కాలంలో చైతన్య ప్రభువుగా మారాడు.

ఆలోచనలకు నశింపు లేదు. అవి విశ్వంలో నిక్షిప్తమై ఉంటాయి. వాని వాని తరంగ పరిమాణాన్ని బట్టి, రంగును బట్టి సకారాత్మకమైనవి ఒక చోట, నకారాత్మకమైనవి మరోచోట చేరిపోతూ ఉంటాయి.

ఇట్లే మహర్షి దయానంద, స్వామి వివేకానంద చరిత్రలు మనకు ఎంతో తెలుపుతాయి. నేడు మన జాతి నిద్రలోనున్నది. దారితప్పి నడుస్తున్నది. స్పృహలో లేదు. పరిణామం తెలియుట లేదు. టి.వి. మరియు సినిమాలలో చూడగూడనివి అనేకం ఉన్నాయి. రోగాలు, ఈతి బాధలు, గృహాలలో అశాంతి, కలహాలు, సర్వసాధారణమై పోయాయి. హరిద్వార్‌లో 50 సంవత్సరాల క్రితం ఇదే కాలంలో చలి ఎక్కువగా ఉండేది. పంకాల (ఫ్యాన్లు) వాడకం తెలియదు. నేడు పూర్తిగా దీనికి భిన్నస్థితి. నేడు చదువు లేని వానికన్నా చదువుకున్నవాడు ఎక్కువ బాధలను అనుభవిస్తున్నాడు.

ఇట్టి స్థితిలోనే సమాజ ఉద్ధరణకై మహాపురుషులు జన్మించుట జరుగుతుంది. నిద్రించెడి సమాజాన్ని నిద్ర నుండి లేపి మనుష్యులలో దేవత్వాన్ని మేల్కొల్పుతారు. కలియుగం సమాప్తమై, దుఃఖము సమసిపోయి సత్యయుగం అవతరించి, కలసిమెలసి ఉంటూ, పంచుకొని తినెదరు. ఆ సత్యయుగావతరణకు నాందీ ప్రస్థావన చేసిన కేంద్రము శాంతికుంజ్, హరిద్వార్ మిమ్ములను ముందుగా నిద్రలేపింది. మీరు అదృష్టవంతులు, ప్రపంచానికి సుఖశాంతులను అందించెదరు.

పై లక్ష్యసాధనలకై మీకు శిక్షణ ఇచ్చుట అందించెదరు. ఇది పుస్తకాల ద్వారా, బోధనల ద్వారా లభిస్తుంది. విద్య ద్వారా పరమాత్మను దర్శించుటకై ప్రకాశంతో కూడిన జ్ఞానాన్ని పొందాలి. హరిధ్యానం సత్యం. గాయత్రీ మంత్ర జపం, ఉపాసన అన్నింటి కన్నా శ్రేష్ఠమైనవి. ఇదే వేదమంత్రం, దేవమంత్రం మరియు విశ్వమంత్రం. ఈ మంత్రానికి దేవత సూర్యుడు. సూర్యుని ఆత్మ సవిత - గాయత్రీ ఉపాసకుడికి సవితా ప్రకాశం అనగా జ్ఞానం లభిస్తుంది.

గాయత్రీ ఉపాసన ద్వారా వ్యక్తిలోని పాపాలు క్షీణించి, సద్గుణాలు వికసితమై మంచి పనులు చేస్తూ, శ్రేష్ఠుడై, దైవ స్వరూపునిగా మారును.

పూజ్య గురుదేవులు గాయత్రీ కఠోర సాధన 24 ఏళ్ళు చేశాడు. గాయత్రీగా మారి ఆమెను తనలో సంలీనం గావించుకొన్నాడు. గాయత్రీ మహావిజ్ఞాన్‌ను రచించారు. మనకు అట్టి గురువు మార్గదర్శనం కావాలి. మరచిపోయి తప్పు చేస్తే గురువు మనలను సంస్కరించి మన తప్పులను సరిచేస్తాడు. గాయత్రిని విశ్వ జనీనం చేయుట ద్వారా సర్వులకు గాయత్రిని అందుబాటులోనికి తెచ్చారు. తద్వారా సత్యయుగావతరణకై బాటలు వేశారు. అట్టి గురువుపై మొక్కవోని శ్రద్ధ, విశ్వాసాలు కలిగి ఉండుట ఆయనకు అందించెడి గురు దక్షిణ

**సా॥ 6.30 గం॥లకు డా॥ ఓ.పి.శర్మగారి ప్రవచనం:**

శాంతికుంజ్‌నకు విచ్చేసిన మీరంతా ధన్యజీవులు. 4 వేదాలకు తల్లి గాయత్రి. ఈ గాయత్రీ మంత్రము 4 వేదాలలో ఉన్నది. 24 అక్షరాలతో కూడిన వేదవిజ్ఞానం దీనిలో నిబిడీకృతమై ఉంది.

ఓం భూర్భువః స్వః - ఋగ్వేదానికి ప్రతీక
తత్సవితుర్వరేణ్యం - యజుర్వేదానికి ప్రతీక
భర్గోదేవస్య ధీమహి - సామవేదానికి ప్రతీక
ధియో యోనః ప్రచోదయాత్ - అధర్వణవేదానికి ప్రతీక

**కోరికలు లేకుండా మనిషి బ్రతకటం అసాధ్యం**

పై అర్థాల సూచనగా గాయత్రీ మంత్రాన్ని చిన్న వేద శాస్త్రంగా అభివర్ణించారు. ఈ మంత్ర ఉపాసన ద్వారా మనకు సాధనశక్తి సద్బుద్ధిశక్తి, సామర్థ్యాలు. పరస్పర సహకారం లభించే పరివారాన్ని అందిస్తుంది. అత్రి మహాముని, ఆది శంకరాచార్యులు మొదలు అనేకమంది మహాపురుషులకు గాయత్రీ మంత్రజపం ద్వారా, తేజస్సు, శక్తి, సద్గుణాలు, పవిత్రత లభించాయి. భోజనం శరీరానికి పోషణను, శక్తిని అందిస్తే గాయత్రీ మంత్రోపాసన శరీరంలోనున్న ఆత్మకు అవసరమైన ఆహారాన్ని అందిస్తుంది.

అథర్వణ వేదం ఈ మంత్రోపాసన ద్వారా లభించెడి సూక్ష్మ ఫలితాలను తెలుపుతుంది. మన కుసంస్కారాలను, దుష్ట స్వభావాల సంస్కరించి మనకు నూతన జన్మను (ద్విజత్వాన్ని) ప్రసాదిస్తుంది. గాయత్రి మంత్రోపాసన ద్వారా మనకు ఉత్పత్తి, పోషణ, జ్ఞానం, ప్రేరణ, పరివర్తన కలిగి మనం ఉన్నత మార్గంలో పయనిస్తాం. ఈ మంత్రం త్రిమూర్తుల స్వరూపం, త్రిగుణాత్మకం.

నీ కర్తవ్యాన్ని పూరించు, జీవన లక్ష్యాన్ని చేరుటకు ప్రయత్నించు, సంసార బాధ్యతల పూర్తిగావించుకొని, మీ అంతర్ జీవితాన్ని జాగృతి గావించుకోండి. మీ మనస్సు పవిత్రమై, శక్తిశాలి కాగానే దుఃఖం పోతుంది, శరీరం నిరోగి అవుతుంది. అన్ని సమస్యలు పరిష్కరింపబడతాయి. స్మరణశక్తి పెరుగుతుంది. వివేకవంతుడవుతాడు. జ్ఞాననేత్రం తెరుచుకొని భవిష్యత్‌ను దర్శింపగలడు. నా 46 సంవత్సరాలు అనుభవంలో వైద్యవృత్తిలో ఉండి దీనిని అనుభవంలోనికి తెచ్చుకున్నాను.

నేడు సమాజంలో ఆలోచనల వికృతంగా ఉన్నాయి. ఇవే అన్ని అనర్థాలకు, దుఃఖాలకు, సమస్యలకు మూలం. భోగవాదం పెరిగి, స్వార్థం, అహంకారం, అహంభావాలు, మోసాలు, కుట్రలు, కుతంత్రాలు, పెచ్చుమీరాయి. త్యాగం, సేవ, కరుణ, దానగుణాలు మృగ్యమైనాయి. వీనినన్నింటిని నివారించి, సద్బుద్ధిని పెంచి సదాలోచనల ద్వారా సత్కర్మలు పెంపొందింపజేసి సమాజ గతిని మార్చుటకై 24 సంవత్సరాలు కఠోర సాధన చేసి సఫలీకృతు లయ్యారు గురుదేవులు. అట్లే భోగవాద స్థానంలో యోగవాదాన్ని స్థాపించారు. స్త్రీని రమణిగా చూడక సహచరణిగా చూడాలి. ధనం మన అవసరాలకే వాడాలి కాని ప్రదర్శనకై వాడిన భోగవాద మవుతుంది.

కాన మీరంతా నిత్యం ఈ ఐదు పనులు చేయాలి.

1) సవితా ధ్యానం-మూడు మారులు చేయాలి. ఒకటి మీకు, ఒకటి పరివారానికి, ఒకటి సమాజానికి.
2) స్వాధ్యాయం - అర్థగంట స్వాధ్యాయం - గురుదేవుల సాహిత్యాన్ని పఠించాలి.
3) సత్సంగం - రోజు ఒక గంట పాటు సత్సంగం నిర్వహించండి.
4) సమయదానం - నిర్ణీత సమయాన్ని సమాజసేవకు నిత్యం వినియోగించాలి.
5) అంశదానం - సంపదలో నిర్ణీత భాగాన్ని సమాజకళ్యాణానికి తప్పక వినియోగించాలి.

విశ్వంలో నిక్షిప్తమైయున్న సకారాత్మక ఆలోచనలను, మీలోని సకారాత్మక ఆలోచనల ద్వారా ఆకర్షింపజేసుకొని, మీలోని ఆత్మశక్తిని పెంపొందించుకొనండి. మానసిక బలవంతులుగా ఎదగండి. మీలో నిద్రాణంగా ఉన్న దైవత్వాన్ని మేల్కొల్పండి. మంచి సాహిత్యాన్ని చదవండి. అవి మిమ్ముల ప్రకాశమార్గం వైపు నడిపిస్తుంది. మీ జీవితాన్ని తేజమయం చేస్తుంది.

గురుదేవులు వ్యక్తికాదు - ఒక శక్తి

ఆలోచనల మార్పుతో - సామాజిక క్రాంతి వస్తుంది

(సశేషం)

- ఎ. వేణుగోపాలరెడ్డి


**యుగశక్తి గాయత్రి**

**మాస పత్రిక చదవండి - చదివించండి**
**చందాదారులుగా చేరండి - చేర్పించండి**

**చందా రుసుమును ఆన్‌లైన్ ద్వారా పంపించండి.**
బ్యాంకు పేరు: ఎస్.బి.ఐ., ఎర్రగడ్డ శాఖ
ఖాతాపేరు : శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు
ఖాతానెం. : **32506416087**
IFSC Code : **SBIN-0013272**

అట్లే మనీ ఆర్డరు ద్వారా కాని, బ్యాంకు డ్రాఫ్టు ద్వారా కూడా చందా రుసుమును పంపవచ్చు. ఆన్‌లైన్ ద్వారా పంపునప్పుడు బ్యాంక్ కమీషన్ క్రింద రూ. 20/- చందాకు అదనంగా పంప ప్రార్థన. ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంకు చలానా జిరాక్సు కాపీని మీ చిరునామాను (పిన్‌కోడ్‌తో సహా) తెలుపుచూ మాకు తప్పక పంపించండి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము**, హెచ్.పి. రోడ్, మూసాపేట
అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.
ఫోన్: 040-23700722, సెల్: 9949111175

| | |
|---|---|
| విడి ప్రతి రూ॥ 12/- | 3 సం॥ చందా రూ॥ 350/- |
| సం॥ చందా రూ॥ 120/- | 10 సం॥ చందా రూ॥ 1116/- |


**డబ్బుని క్రమపద్ధతిలో వాడుకుంటే జీవితం క్రమపద్ధతిలో ఉంటుంది**